జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పత్రిక

సంపుటి : 52 | సంచిక : 16-18 | విజయవాడ | 20-9-2019 | పేజీలు : 24 | వెల : రు. 10/-

ప్రస్తుత పరిస్థితులలో భారత కార్మికవర్గం ముందున్న కీలక కర్తవ్యం

మన దేశంలో బ్రిటిష్ వలస పాలన అంతమై 72 సంవత్సరాలు కావస్తున్నా దేశ ప్రజల, ప్రత్యేకించి శ్రామిక ప్రజానీకం యొక్క స్థితిగతులు ఏమాత్రం మెరుగుపడలేదు; అందుకుబదులుగా నానాటికీ క్షీణిస్తూ వున్నాయి. దేశంలో దారిద్ర్యం అనూహ్యమైన స్థాయికి పెరిగిపోయింది. నిరుద్యోగం గత 46 సంవత్సరాల స్థాయిని మించి పెరిగిపోయింది. సామాజిక అసమానతలు తీవ్రమయ్యాయి. దేశమంతటా కుల, మత విద్వేషాలపై ఆధారపడ్డ హింస చెలరేగుతోంది. స్త్రీలపై లైంగిక హింస దారుణ రూపం దాల్చింది. తమ సమంజసమైన హక్కుల కోసం గళం విప్పే అన్ని సెక్షన్ల ప్రజలపై - మేధావులపై సైతం - అణచివేత సాగుతోంది. ప్రజల, కార్మికుల హక్కులను హరిస్తున్నారు; ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛా - స్వాతంత్ర్యాలపై ఆంక్షలు విధిస్తున్నారు. నిరంకుశాధికార పాలన దిశలో పాలకులు వేగంగా చర్యలు తీసుకొంటున్నారు. ప్రజల ప్రజాస్వామిక హక్కులను చట్టబద్ధంగానే రద్దు చేస్తున్నారు. పలురకాల క్రూర నిర్బంధ చట్టాలు చేస్తున్నారు. దేశ ప్రజల కనీసపు ఆకాంక్షలను కూడా సహించమంటున్నారు.

దేశంలో సంపదను సృష్టించి, పెంపొందించే కార్మికవర్గాన్ని నామమాత్రంగా కూడా లక్ష్యపెట్టడానికి పాలకులు - పాలకవర్గాలు నిరాకరిస్తున్నారు. శతాబ్ద కాలంగా వీరోచిత పోరాటాలు సాగించి, తమ ఆత్మ బలిదానాల ద్వారా, అశేష త్యాగాల ద్వారా కార్మికవర్గం సాధించుకున్న హక్కులనన్నింటినీ నిర్దాక్షిణ్యంగా రద్దుచేస్తున్నారు. కార్మికవర్గాన్ని - కార్మికవర్గం యొక్క శ్రమశక్తిని బడా పెట్టుబడిదారీవర్గం, సామ్రాజ్యవాదులు నిరాటంకంగా దోచుకొనేందుకు పూర్తి హక్కులను, పరిస్థితులను కల్పిస్తున్నారు.

దేశానికి వెన్నెముకగా వున్న రైతాంగాన్ని, వ్యవసాయరంగాన్ని తీవ్రమయిన సంక్షోభంలోకి నెట్టి, వారిని అనాధలుగా మార్చారు. సామ్రాజ్యవాద, మార్కెట్టుశక్తుల పెత్తనాన్ని, ఆధిపత్యాన్నీ వ్యవసాయ రంగంపై బలవంతంగా రుద్దారు. పేద, చిన్న, మధ్యతరగతి రైతాంగాన్ని సంక్షోభ భారం తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడే స్థితి కల్పించారు. నిరుపేదలుగా మారిపోయిన రైతాంగం, ఉపాధిని వెతుక్కొంటూ సుదూర ప్రాంతాలకు కుటుంబాలు - కుటుంబాలుగా వలసలబాట పట్టాల్సిన తప్పనిసరి పరిస్థితులు సృష్టించారు. దిక్కూ, మొక్కూ లేని ప్రమాద భరితమైన, కష్టసాధ్యమైన శారీరక శ్రమచేసే నైపుణ్యంలేని రోజువారీ కూలీలుగా పనిచేయవల్సిన స్థితికి వీరిని నెట్టారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయిక రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వివిధ వృత్తుల ప్రజల బతుకులను, వ్యవసాయం ఆధారపడిన కూలీల జీవనోపాధిని ధ్వంసం చేశారు.

తమ సహజ నివాసమైన అడవులలో, కొండలలో నివసిస్తూ తమదైన సంస్కృతి - సాంప్రదాయాలను పాటించే ఆదివాసులను వారి భూముల నుండి, ఆవాసాల నుండీ బలవంతంగానూ, చట్టపరంగానూ వెళ్ళగొడ్తూ వారిని నిరాశ్రయులను చేస్తున్నారు.

పట్టణ ప్రాంతాలలో విద్యాధికులు సహితం నిరుద్యోగులుగా మిగిలిపోతూ, అసాంఘిక కార్యకలాపాలకు ఆకర్షితులవుతున్న, ప్రమాదకర వ్యసనాలకు లోనవుతున్న దిగజారుడు పరిణామాన్ని, పాలకులు - పాలకవర్గాలూ సృష్టించారు.

దళితులూ, మహిళలూ, మత మైనారిటీలూ... ఒక్కమాటలో చెప్పాలంటే దేశంలోని అన్ని సెక్షన్ల ప్రజల జీవన స్థితిగతులూ ఘోరమైన స్థాయికి పతనమయ్యాయి.

మరోవైపు తమ దిగజారిన జీవనస్థితిగతులను మెరుగుపరుచుకోవటానికి, హక్కుల సాధనకోసం, ప్రజాస్వామిక ఆకాంక్షల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు వివిధ స్థాయిలలో, వివిధ రూపాలలో పోరాడుతున్నారు. వారిని ఐక్యం కాకుండా నిరోధించే కుల, మత, ప్రాంతీయ, జాతీయ, భాషా ఉన్మాదాన్ని - వైషమ్యాలను రెచ్చగొట్టే విష భావజాలాన్ని పాలకులు, పాలకవర్గాలు ప్రజల మనస్సులోకి దట్టిస్తున్నారు. ప్రచార, ప్రసార సాధనాలకు తమ గుప్పెట్లో పెట్టుకొని కాలం చెల్లిన అంధ విశ్వాసాలను, పతన సంస్కృతిని విస్తృతంగా వ్యాప్తి చేస్తున్నారు.

దేశంలో నెలకొన్న ఈ పరిస్థితికి కారణం నాడు జాతీయ విముక్తి కోసం - ప్రజల ప్రజాతంత్ర విప్లవం కోసం కార్మికవర్గం చేపట్టిన కర్తవ్యాలు పరిపూర్తి కాకుండా మిగిలిపోవటమే.

అందువల్లనే దేశంలో సామ్రాజ్యవాద దోపిడీ నేడు అనూహ్యమైన స్థాయిలో సాగిపోతోంది. భూస్వామ్యవర్గం (ఫ్యూడల్‌వర్గం) యొక్క దోపిడీ, పీడనలు రూపాలు మారినా నేటికీ యధాప్రకారంగా కొనసాగుతూనే వున్నాయి. భూస్వామ్యవర్గాన్ని సాంఘిక పునాదిగా జేసుకుని, సామ్రాజ్యవాదం, దళారీ పెట్టుబడిదారీవర్గం ద్వారా తన దోపిడీని

జనశక్తి

సంపాదకుడు

పి. జస్వంతరావు

వెబ్‌సైట్ :

www.janasakthionline.com

ఈ-మెయిల్ :

janasakthi1963@gmail.com

సంపుటి : 52 సంచిక : 16-18

20-9-2019

లోపలి పేజీల్లో

వెల : విడిప్రతి..................రూ.10/-

సంవత్సర చందా....రూ. 100/-

చిరునామా :

పి. జస్వంతరావు, సంపాదకుడు

32-13-26/1, బి.ఎం.ఆర్. రోడ్, ఎం.ఆర్.పురం, విజయవాడ-10.

నానాటికీ తీవ్ర జేస్తోంది. మనదేశంలో నేడున్న ఈ అర్ధవలస - అర్ధభూస్వామ్య దోపిడీ వ్యవస్థను రద్దుచేసి, ప్రజల ప్రజాతంత్ర వ్యవస్థను నెలకొల్పాల్సిన కర్తవ్యం పరిపూర్తికానంతవరకూ, నానాటికి ముమ్మరమవుతున్న దోపిడీ, సామాజిక అసమానతలు, దుర్భర దారిద్ర్యం, నిరుద్యోగం తదితర వినాశకర రుగ్మతలను అంతం చేయటం అసాధ్యం.

నేడు అటువంటి ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాన్ని చేపట్టాల్సిన చారిత్రక బాధ్యతతోపాటు ఈ ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించాల్సిన బాధ్యత కూడా కార్మికవర్గానిదే. ఈ ప్రజాతంత్ర విప్లవాన్ని విజయవంతంగా పరిపూర్తి చేయాలంటే కార్మికవర్గం బడా పెట్టుబడి దోపిడీకి, పెట్టుబడిదారీ - సామ్రాజ్యవాద దోపిడీకి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగంతో భుజం, భుజం కలిపి పోరాడాలి. రైతాంగం ప్రధాన శక్తిగా సాగే ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించి ముందుకు నడపాలి. ఇతర రంగాల ప్రజలు సాగించే ప్రజాతంత్ర హక్కుల పోరాటాలకు కార్మికవర్గం సంఘీభావంగా నిలవాలి. మహిళా, విద్యార్థి, గిరిజన, ఉద్యోగ, బలహీనవర్గాల వారితో భుజం, భుజం కలిపి పోరాడి, ఆ పోరాటాలను ప్రజాతంత్ర - విప్లవ పోరాటంలో ఒక భాగంగా మలచాలి. విశాల కార్మికవర్గాన్ని ట్రేడ్ యూనియన్లలో సంఘటితపరచటంలోపాటుగా వ్యవస్థ మార్పుకు కార్మికవర్గం నాయకత్వం వహించాలనే రాజకీయ కృషిని వారి మధ్య నిరంతరం సాగించాలి. వారిని అందుకు సన్నద్ధం చేయాలి.

కార్మికవర్గం యొక్క అంతిమ లక్ష్యం వర్గరహిత - సోషలిస్టు వ్యవస్థ ఏర్పాటేనన్నది నిర్వివాదం. అయితే ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే, మనదేశ నిర్దిష్ట పరిస్థితులలో ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాన్ని పరిపూర్తి చేయాలి. అదే ప్రస్తుత విప్లవ దశ. ఈ దశను పూర్తిచేయకుండా, వర్గరహిత సమాజ వ్యవస్థను ఏర్పాటుచేసే లక్ష్యాన్ని చేరుకోవటానికి మరేదగ్గర మార్గం లేదు. యీ సుదీర్ఘ విప్లవాన్ని సాగించి విజయవంతం చేయటమన్నదే భారత కార్మికవర్గపు తక్షణ, ఆవశ్యక కర్తవ్యం!

అయితే దేశంలోని కార్మికోద్యమం వివిధ చారిత్రక కారణాల దృష్ట్యా అనేక బలహీనతల వాత బడింది. కార్మికులను ఐక్యపరచి, సంఘటితపరచి, చైతన్యపరచి ఒక వర్గశక్తిగా మలచే కర్తవ్యాన్ని ప్రతిభావంతంగా నిర్వర్తించగలిగిన స్థితిలో లేదు. సంస్కరణవాదం, ఆర్థికవాదం, చట్టబద్ధవాదం, జాతీయ దురహంకారవాదం, కుల - మత - ప్రాంతీయ విద్వేష భావజాలాల ఊబిలోకి కూరుకుపోయింది. దోపిడీ పాలకవర్గాల జిత్తులు, కుట్రల ఉచ్చులో చిక్కుకు పోయింది.

దేశంలోని యావత్ కార్మికులను ఐక్యపరచి, దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా సంఘటితపరచి, వారిని ఒక వర్గశక్తిగా - కార్మికవర్గంగా - అగ్రగామి శ్రేణులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత, కర్తవ్యం భారత కార్మికోద్యమంపైనున్నాయి.

అందుకుగాను భారత కార్మికోద్యమం - పైన పేర్కొన్న ఆ బలహీనతల నుండి తనకు తాను బయటపడాల్సి వుంది. దేశమంతటా వున్న కార్మికులను ఆ హానికర భావజాల ప్రభావాల నుండి బయటకు తీసుకువచ్చి వారిని వర్గ రాజకీయ చైతన్యవంతులుగా ఐక్యపరచాల్సి వుంది. అలా ఐక్యమైన కార్మికులను ఒక వర్గశక్తిగా మలచి సంఘటితపరచాల్సి వుంది. ఆ రకంగా ఒక వర్గశక్తిగా మలచబడ్డ భారత కార్మికవర్గం తన చారిత్రక కర్తవ్యాన్ని నిర్వహించే స్థితికి వస్తుంది. ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను చేబడుతుంది. ప్రజాతంత్ర విప్లవానికి, రైతాంగపు మద్దతును సాధించి, నాయకత్వం వహిస్తుంది. ఆరకంగా ప్రస్తుత దశలో తన విప్లవ కర్తవ్యమైన ప్రజాతంత్ర విప్లవ కర్తవ్యాలను విజయవంతంగా నిర్వహిస్తుంది. తన అంతిమ లక్ష్యమైన వర్గరహిత సమాజ స్థాపన లక్ష్యంవైపుకు పురోగమించగలుగుతుంది.

కార్మికవర్గం యీ కర్తవ్య నిర్వహణ ద్వారా యావత్ భారత ప్రజానీకంపై సాగుతున్న దోపిడీ, అణచివేతల పాలనా వ్యవస్థను అంతం చేయగలుగుతుంది. కార్మికవర్గ విజయం తథ్యం! ✶

మన ఉద్యమం యొక్క జరూరు కర్తవ్యాలు

వి.ఐ. లెనిన్

కామ్రేడ్ లెనిన్ ఈ వ్యాసాన్ని 1900 సంవత్సరం నవంబరులో రాశారు. అప్పటికి యూరప్ ఖండంలో పెట్టుబడిదారీ విధానం గుత్తపెట్టుబడిదారీ విధానంగా, సామ్రాజ్యవాదంగా పరివర్తన చెందుతోంది. మార్క్సిజాన్ని సవరించే పేరిట బెర్న్‌స్టైన్ వంటివారి నుండి రకరకాల రివిజనిస్టు ధోరణులు ప్రబలంగా ముందుకు వచ్చాయి. 1895లో ఏంగెల్సు మరణించేవరకూ, ఈ ధోరణులపై నిరంతరాయంగా పోరాడారు. రష్యాలో ఈ రివిజనిస్టు ధోరణులు ఒకపక్క, వీరులే చరిత్ర నిర్మిస్తారనే నరోద్నిజం భావజాలం ఒకపక్క వ్యాప్తిలో ఉన్నాయి. ఈ రెండు పెదధోరణులు శ్రామికవర్గం, ముఖ్యంగా కార్మికవర్గం యొక్క నాయకత్వ పాత్రనూ, కార్మికవర్గంలోకి వర్గపోరాట దృక్పధాన్ని కమ్యూనిస్టుపార్టీ అందించి, సామాజిక విప్లవాన్ని నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించ నిరాకరించేవే. లెనిన్ ఈ పెదధోరణులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటాన్ని సాగిస్తూనే, కార్మికవర్గంలో పార్టీ రాజకీయ కర్తవ్యాలతో సాగించాల్సిన కృషికి, ఆ సైద్ధాంతిక పోరాటాన్ని జోడించే వైఖరి తీసుకున్నాడు. కార్మికవర్గాన్ని విప్లవీకరించడం, కార్మికవర్గంలో విప్లవ పార్టీని నిర్మించడం అనే అత్యంత అవసరమైన కర్తవ్యాలు మన ముందున్న కాలంలో ఈ వ్యాసం ఉపయోగంగా ఉంటుందని భావిస్తున్నాము. 'జనాలలో పార్టీ కార్యకలాపాలు' అనే పేరుతో మాస్కో- ప్రగతి ప్రచురణాలయం ముద్రించిన లెనిన్ వ్యాసాలూ, ఉపవ్యాసాల సంకలనంలోని ఈ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాము.



– సంపాదకుడు

రష్యన్ సోషల్ డెమొక్రసీ పదేపదే ప్రకటించింది, రష్యన్ కార్మికవర్గ పార్టీయొక్క తక్షణ రాజకీయ కర్తవ్యం నిరంకుశత్వాన్ని కూలదోయడమూ, రాజకీయ స్వాతంత్ర్యం సాధించడమూ అని. దీనిని పదైదేండ్లకంటే పూర్వం రష్యన్ సోషల్ డెమొక్రసీ ప్రతినిధులు- 'శ్రమ విమోచన' బృందం (ఫుట్ నోట్1)సభ్యులు ప్రకటించినారు. 1898 వసంతంలో రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీని (ఫుట్‌నోట్.2) స్థాపించిన రష్యన్ సోషల్ డెమొక్రటిక్ సంస్థల ప్రతినిధులు దీనిని రెండున్నర సంవత్సరాల క్రితం ప్రకటించినారు. కానీ, పదేపదే యీ ప్రకటనలు చేయబడినప్పటికీ, రష్యాలో సోషల్ డెమొక్రసీయొక్క రాజకీయ కర్తవ్యాల సమస్య యీనాడు మళ్లీ ముందుకు వచ్చింది. మన ఉద్యమ ప్రతినిధులు చాలామంది సమస్యకు పైన చెప్పిన పరిష్కారం సరైనదా అని సందేహిస్తున్నారు. ఆర్థిక పోరాటం అధిక ప్రాముఖ్యం కలదని అంటున్నారు; కార్మికవర్గ రాజకీయ కర్తవ్యాలను పూర్వరంగంలోకి తోస్తున్నారు, కుదిస్తున్నారు, సంకుచిత పరుస్తున్నారు; రష్యాలో స్వతంత్ర కార్మికవర్గ పార్టీ నిర్మాణం గురించి మాట్లాడడం కేవలం మరొకరి మాటలు పునశ్చరణ చేయడమనీ, కార్మికులు ఆర్థిక పోరాటం మాత్రం సాగిస్తూ, రాజకీయాలను ఉదారవాదులకూ, మేధావులకూ వదలి వేయాలనీ కూడా అంటున్నారు. యీ కొత్త మతంలో తాజా విశ్వాసం (అపఖ్యాతి కెక్కిన Credo) (ఫుట్ నోట్.3) రష్యన్ కార్మికవర్గానికి యింకా యీడు రాలేదని అనడానికీ, సోషల్ డెమొక్రటిక్ కార్యక్రమాన్ని పూర్తిగా నిరాకరించడానికీ సమానం. 'రబోచయా మీస్ల్' (ముఖ్యంగా దాని 'విడి అనుబంధం'లో)(ఫుట్ నోట్.4) దాదాపు యిదే వైఖరి తీసుకుంటుంది. రష్యన్ సోషల్ డెమొక్రసీ స్వయం నిరాకరణలాంటి ఊగిసలాట, సందేహాల దశలో గడుస్తున్నది. ఒకవైపున కార్మికవర్గ ఉద్యమం సోషలిజం నుండి వేరుచేయ బడుతున్నది, ఆర్థిక పోరాటం చేయడానికి కార్మికులకు తోడ్పడుతున్నారు, కానీ మొత్తం ఉద్యమంయొక్క సోషలిస్టు లక్ష్యాలనూ, రాజకీయ కర్తవ్యాలనూ కార్మికులకు వివరించడానికి యేమీ చేయడంలేదు, లేదా దాదాపు యేమీ చేయడంలేదు. మరొకవైపున సోషలిజం కార్మికోద్యమంనుండి వేరుచేయబడు తున్నది; కార్మికులు ఆర్థిక పోరాటానికి పరిమితమౌతారు గనుక ప్రభుత్వ వ్యతిరేక పోరాటం కేవలం మేధావులు సాగించవలసి వుండడం గురించి రష్యన్ సోషలిస్టులు అంతకంతకూ యెక్కువ మాట్లాడడం మళ్లీ ప్రారంభించినారు.

నా అభిప్రాయంలో, మూడు పరిస్థితులు యీ విచారకర సన్నివేశానికి ఆధారం తయారు చేసినాయి. మొదటిది, తమ మొదటి రోజుల కార్యకలాపాలలో రష్యన్ సోషల్ డెమొక్రట్లు కేవలం ప్రచార బృందాలలో పనిచేయడానికి పరిమితమైనారు. మనం జనాలలో ఆందోళన ప్రారంభించినప్పుడు మనం ఆవలి కొసకు పోకుండా యెల్లప్పుడూ నిగ్రహించుకోలేక పోయినాము. రెండవది, మన మొదటి రోజుల కార్యకలాపాలలో మనం తరచు మన అస్తిత్వ హక్కుకోసం 'నరోద్నయ వోల్య' (ఫుట్ నోట్.5) అనుయాయులతో పోరాడవలసి వచ్చింది; వాళు "రాజకీయాలు" అంటే కార్మికవర్గ ఉద్యమం నుండి వెలువడిన కార్యకలాపాలుగా అర్థం చేసుకొని, రాజకీయాలను కేవలం కుట్రలతో చేసే పోరాటానికి కుదించినారు. యిలాంటి రాజకీయాలను నిరాకరించడంలో సోషల్ డెమొక్రట్లు సాధారణంగా రాజకీయాలను పూర్వరంగంలోకి నెట్టే కొసకు వెళ్లినారు. మూడవది, సోషల్ డెమొక్రట్లు చిన్న స్థానిక బృందాలకు వెలిగా పనిచేస్తూ, స్థానిక బృందాల కార్యకలాపాలనన్నిటినీ కలిపి, విప్లవ పనిని సరైన పద్ధతులలో ఏర్పాటు చేయడం సాధ్యంచేసే, విప్లవ పార్టీని సంఘటితపరిచే అవసరంమీద తగినంత శ్రద్ధ అర్పించలేదు. ఏకాకి పనియొక్క ఆధిక్యం సహజంగా ఆర్థిక పోరాటపు ఆధిక్యంతో లంకె కలిగివుంటుంది.

యీ పరిస్థితుల ఫలితంగా ఉద్యమం యొక్క ఒక పార్శ్వంమీద మాత్రమే కేంద్రీకరించడం జరిగింది. యీ "ఆర్థికవాద" ధోరణి(దీనిని ఒక "ధోరణి" అనగలిగితే) యీ సంకుచితత్వాన్ని ఒక ప్రత్యేక సిద్ధాంత స్థాయికి లేవనెత్తడానికి ప్రయత్నించి, పాత బూర్జువా భావాలను కొత్త పేరుతో అమ్మజూపే ఫాషనబుల్ బెర్న్‌స్టైనిజమూ, (ఫుట్‌నోట్.6) "మార్క్సిజం విమర్శ"నూ యీ ప్రయోజనానికి వినియోగించుకోడానికి ప్రయత్నించింది. యీ ప్రయత్నాలే రష్యన్ కార్మికవర్గ ఉద్యమానికీ, రాజకీయ స్వాతంత్ర్యం కొరకు జరిగే పోరాటంలో అగ్రదళమైన రష్యన్ సోషల్ డెమోక్రసీకీ మధ్య వున్న సంబంధాన్ని దుర్బరపరిచే ప్రమాదాన్ని ఉత్పన్నం చేసినాయి. మన ఉద్యమం యొక్క అత్యంత జరూరు కర్తవ్యం, యీ సంబంధాన్ని పటిష్టపరచడం.

సోషల్ డెమోక్రసీ అనేది కార్మికవర్గ ఉద్యమంయొక్కా సోషలిజంయొక్కా సమ్మేళనం. దాని కర్తవ్యం కార్మికవర్గ ఉద్యమానికి దాని ప్రతి ప్రత్యేక దశలోనూ నిష్క్రియాత్మకంగా సేవ చేయడం కాదు; దాని కర్తవ్యం మొత్తం ఉద్యమం యొక్క ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించడమూ, యీ ఉద్యమానికి దాని అంతిమ లక్ష్యాన్నీ, దాని అంతిమ రాజకీయ కర్తవ్యాలనూ చూపించడమూ, దాని రాజకీయ, సిద్ధాంత స్వాతంత్ర్యాన్ని రక్షించడమూ. సోషల్ డెమోక్రసీ నుండి వెలువడిన కార్మికవర్గ ఉద్యమం చిల్లర ఉద్యమం అవుతుంది, అనివార్యంగా బూర్జువా ఉద్యమం ఔతుంది; ఆర్థికపోరాటం మాత్రమే చేయడంలో కార్మికవర్గం తన రాజకీయ స్వాతంత్ర్యం కోల్పోతుంది; అది యితర పార్టీలకు తోక అయి, "కార్మికవర్గ విమోచనను కార్మిక వర్గమే జయించుకోవాలి" (ఫుట్ నోట్.7) అనే మహా సూత్రానికి ద్రోహం చేస్తుంది. కార్మికవర్గ ఉద్యమం సోషలిజంకు దూరంగా వుంటూ, రెండూ చెరొక దారినా పోయే దశ ఒకటి ప్రతిదేశంలోనూ వుండింది; ప్రతి దేశంలోనూ యీ యేకాకితనం సోషలిజంనూ, కార్మికవర్గ ఉద్యమాన్నీ రెంటినీ బలహీనపరిచింది. కార్మికవర్గ ఉద్యమంతో సోషలిజంయొక్క సమ్మేళనం మాత్రమే సకల దేశాలలోనూ రెంటికీ స్థిరమైన ఆధారాన్ని సృష్టించింది. కానీ, ప్రతి దేశంలోనూ సోషలిజం, కార్మికవర్గ ఉద్యమాల యీ సమ్మేళనం చారిత్రకంగా, సామ్యం లేని మార్గాలలో, దేశ కాల పరిస్థితుల ననుసరించి పరిణామం చెందింది. రష్యాలో, సోషలిజంనూ, కార్మికవర్గ ఉద్యమాన్నీ సమ్మేళనం చేయవలసిన అవసరం సిద్ధాంతరీత్యా యేనాడో ప్రకటింప బడింది, కానీ యిప్పుడే అది ఆచరణలోకి కొనిరాబడుతున్నది. అది చాలా కష్టమైన, ప్రక్రియ; అందువల్ల, దానివెంట ఊగిసలాటలూ, సందేహాలూ వుండడంలో ఆశ్చర్యం యేమీ లేదు.

గతం నుండి నేర్చుకోగల గుణపాఠం యేమిటి?

రష్యన్ సోషలిజంయొక్క చరిత్ర సమస్తమూ నిరంకుశ ప్రభుత్వంమీద పోరాటమూ, రాజకీయ స్వాతంత్ర్య సాధనా అత్యంత జరూరు కర్తవ్య మైనట్టి పరిస్థితికి దారితీసింది. మన సోషలిస్టు ఉద్యమం నిరంకుశత్వంతో చేసే పోరాటంమీద కేంద్రీకరించిందనవచ్చు. మరొకవైపున, సోషలిస్టు యోచన కార్మికవర్గ అగ్రదళానికి వెలిగా వుండడం యితర దేశాలలోకంటె రష్యాలో యెక్కువగా వుంది; యీ స్థితి కొనసాగితే, రష్యాలో విప్లవోద్యమం నిర్వీర్యం కాకతప్పదు. ఈ పరిస్థితి నుండి ఉద్భవిస్తున్నది రష్యన్ సోషల్ డెమోక్రసీ నిర్వహించవలసిన కర్తవ్యం – సోషలిజం భావాలనూ, రాజకీయ చైతన్యాన్నీ కార్మికవర్గ జనాలలోకి యెక్కించడమూ, స్వయంజనితమైన కార్మివర్గ ఉద్యమంతో విడదీయరాని సంబంధం గల విప్లవ పార్టీని నిర్మించడమూ అనే కర్తవ్యం. యీ దిశలో రష్యన్ సోషల్ డెమోక్రసీ చాలా చేసింది, కానీ చేయవలసింది యింకా చాలా వుంది. ఉద్యమ వృద్ధితో సోషల్ డెమోక్రట్ల కార్యరంగం విస్తృతమౌతుంది; పని యింకా వైవిధ్యపూరితమౌతుంది, ఉద్యమంలో అంతకంతకూ యెక్కువమంది కార్యకర్తలు ప్రచార ఆందోళనల దినదిన అవసరాలు ముందుకు తెచ్చే వివిధ ప్రత్యేక కర్తవ్యాలు పూర్తిచేయడంమీద కేంద్రీకరిస్తారు. యీ ఘటన యెంతో సహజమైనదీ, అనివార్యమైనదీ; కానీ యీ ప్రత్యేక కార్యకలాపాలూ, పోరాట పద్ధతులూ అవే లక్ష్యాలు కాకుండా నివారించే పనిలోనూ, సన్నాహక కృషి ప్రధాన కార్యంగానూ, ఏకైక కార్యంగానూ పరిగణింపబడకుండా నివారించే పనిలోనూ మనం మరీ లగ్నమయ్యేటట్లు చేస్తుంది యిది.

మన ప్రధాన, మౌలిక కర్తవ్యం యేమిటంటే, కార్మికవర్గ రాజకీయ అభివృద్ధికీ, రాజకీయ సంస్థా నిర్మాణానికీ దోహదం కలిగించడం. యీ కర్తవ్యాన్ని పూర్వరంగంలోకి తోసేవాళ్ళు, సకల ప్రత్యేక కర్తవ్యాలనూ, నిర్దిష్ట పోరాట పద్ధతులనూ దీనికి లోబరచడానికి నిరాకరించేవాళ్ళు, బూటకపు మార్గాన్ని అనుసరిస్తూ, ఉద్యమానికి తీవ్రమైన హాని కలిగిస్తున్నారు. మరి, మొదట, ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలో కార్మికవర్గ ఉద్యమంనుండి విడవడిన ఏకాకి కుట్ర బృందాల శక్తులను మాత్రమే వినియోగించాలని విప్లవకారులను ఉద్బోధించేవాళ్ళు యీ కర్తవ్యాన్ని పూర్వ రంగంలోకి తోస్తున్నారు. రెండవది, రాజకీయ ప్రచార, ఆందోళన, సంస్థా నిర్మాణాల సారాన్నీ, విస్తృతినీ పరిమితపరిచేవాళ్లూ, కార్మికుల జీవితంలో అసాధారణ సమయాలలో మాత్రమే, వేడుక సందర్భాలలో మాత్రమే, వాళ్లకు "రాజకీయాలు" చెప్పడం ఉచితమని యెంచేవాళ్లూ, నిరంకుశత్వంతో చేసే రాజకీయ పోరాటం స్థానంలో నిరంకుశత్వంనుండి పాక్షిక సౌకర్యాల కొరకు డిమాండ్లను యెంతో ప్రాధేయ పూర్వకంగా పెట్టేవాళ్లూ, యీ పాక్షిక సౌకర్యాల కొరకు డిమాండ్లను నిరంకుశత్వంతో విప్లవ కార్మికవర్గ పార్టీచేసే క్రమబద్ధమైన, రాజీలేని పోరాటపు స్థాయికి నమ్మకంగా పెంచడానికి తగినంత చేయనివాళ్లూ యీ కర్తవ్యాన్ని పూర్వ రంగంలోకి తోస్తున్నారు.

"సంఘటితపడండి!" అని రకరకాల శ్రుతులలో 'రబోచయా మీస్ల్' కార్మికులకు పునశ్చరణ చేస్తూనే వుంది; "ఆర్థికవాద" ధోరణి అనుయాయులందరూ పునశ్చరణ చేస్తున్నారు. నిజమే, యీ ఉద్బోధను మనం పూర్తిగా ఆమోదిస్తాము; కానీ మనం మరొకటి కలపకుండా వుండము: సంఘటితపడండి, కానీ పరస్పర సహకార సంఘాలలోనూ, సమ్మె నిధులలోనూ, కార్మిక బృందాలలోనూ మాత్రమే కాదు; రాజకీయ పార్టీలో సంఘటితపడండి; నిరంకుశ ప్రభుత్వం మీద, మొత్తం పెట్టుబడిదారీ సమాజంమీద కృతనిశ్చయమైన పోరాటానికి సంఘటితపడండి. అలాంటి సంఘ నిర్మాణం లేకుండా కార్మికవర్గం యెన్నడూ వర్గచైతన్యపూరిత పోరాటానికి యెదగలేదు; అలాంటి సంఘ నిర్మాణం లేకుంటే కార్మికవర్గం నిర్వీర్యం కాకతప్పదు. నిధులూ, అధ్యయన బృందాలూ, పరస్పర సహకార సంఘాలూ తప్ప మరి దేని సహాయమూ లేకుంటే కార్మికవర్గం తన మహత్తర చారిత్రక కర్తవ్యాన్ని యెన్నడూ నిర్వహించజాలదు రాజకీయ, ఆర్థిక బానిసత్వంనుండి తననూ, మొత్తం రష్యన్ జాతినీ విమోచనచేసే కర్తవ్యాన్ని. చరిత్రలో యే ఒక్క వర్గమూ తన రాజకీయ నాయకులను సృష్టించకుండా, ఒక ఉద్యమాన్ని నిర్మించి, దానిని నడిపించగల తన ప్రముఖ ప్రతినిధులను సృష్టించకుండా, అధికారం సాధించలేదు. అలాంటి వ్యక్తులను సృష్టించగలనని రష్యన్ కార్మికవర్గం యిప్పటికే నిరూపించింది. గత అయిదారేండ్లలో

అంత విస్తృతంగా అభివృద్ధి అయిన పోరాటం కార్మికవర్గంయొక్క మహత్తర గుప్త విప్లవశక్తిని వెల్లడించింది; అత్యంత నిర్దాక్షిణ్యమైన ప్రభుత్వ హింసలు సోషలిజంవైపూ, రాజకీయ చైతన్యంవైపూ, రాజకీయ పోరాటంవైపూ కృషిచేసే కార్మికుల సంఖ్యను తగ్గించదు సరికదా, తద్వ్యతిరేకంగా యెక్కువ చేస్తుంది అని అది చూపించింది. 1898లో మన కామ్రేడ్లు జరిపిన మహాసభ మన కర్తవ్యాలను సరిగా నిర్వచించింది; అది కేవలం యితరుల మాటలు పునశ్చరణ చేయలేదు, కేవలం "మేధావుల" ఉబలాటాన్ని వ్యక్తం చేయలేదు... పార్టీ కార్యక్రమమూ, నిర్మాణమూ, యెత్తుగడలూ అనే సమస్యను యీనాటి దినచర్యలో చేర్చి, యీ కర్తవ్యాలను పూర్తిచేయడానికి మనం కృతనిశ్చయంతో కృషి చేయాలి. మన కార్యక్రమం యొక్క మౌలిక సూత్రాలమీద మన అభిప్రాయాలను యిప్పటికే తెలియజేసినాము; యిక, సహజంగా, వాటిని సవివరంగా విశదీకరించడానికి యిది స్థలం కాదు. సంస్థా నిర్మాణ సమస్యలమీద, ఒక వ్యాస పరంపర వచ్చే సంచికలో రాయాలని అనుకుంటున్నాను. ఇది మనలను యెదుర్కొంటున్న సమస్యలలో ముఖ్యమైనది. యీ విషయంలో, రష్యన్ విప్లవోద్యమంలోని పాత కార్యకర్తలకంటె మనం గణనీయంగా వెనుకబడివున్నాము. యీ లోపాన్ని మనం మొమాటం లేకుండా ఒప్పుకొని, మన పనిలో మరింత రహస్యమైన పద్ధతులు రూపొందించడానికీ, సరైన పని పద్ధతులను, పోలీసుల కన్నుగప్పడానికీ పోలీసుల పన్నాగాలను తప్పించుకోడానికీ సరైన పద్ధతులను, క్రమబద్ధంగా వ్యాప్తిచేయడానికీ సకల ప్రయత్నాలూ చేయాలి. తమ తీరిక సాయంత్రాలనేగాక, తమ యావత్తు జీవితాలనూ విప్లవానికి అర్పించే వ్యక్తులను మనం తర్ఫీదు చేయాలి; మన పనిలోని వివిధ రూపాలలో ఖచ్చితమైన శ్రమవిభజనను ప్రవేశపెట్టడానికి వీలిచ్చేటంత పెద్ద సంస్థను మనం నిర్మించాలి. చివరన, యెత్తుగడల సమస్యలకు సంబంధించి, మనం యీ కింది వాటికి పరిమితమౌదాము: ముందుగా ఊహించిన యేదో ఒక రాజకీయ పోరాట రూపానికీ, పద్ధతికీ సోషల్ డెమోక్రసీ తన చేతులు కట్టి వేసుకోదు, తన కార్యకలాపాలు పరిమిత పరుచుకోదు; అది సకల పోరాట రూపాలనూ గుర్తిస్తుంది, ఆ రూపాలు పార్టీకి అందుబాటులో వున్న శక్తులకు అనుగుణంగా వుండి, ఆయా పరిస్థితులలో సాధ్యమైనంత ఉత్తమ ఫలితాల సాధనకు దోహదం కలిగించేటట్లైతే. మనకు పటిష్టంగా సంఘటితమైన పార్టీ వుంటే, ఒకే ఒక సమ్మె రాజకీయ ప్రదర్శనగా, ప్రభుత్వంమీద రాజకీయ విజయంగా మారవచ్చు. మనకు పటిష్టంగా సంఘటితమైన పార్టీ వుంటే, ఒకే ఒక ప్రాంతంలోని తిరుగుబాటు విజయవంతమైన విప్లవంగా పెరగవచ్చు. మనం గుర్తుపెట్టుకో వలసింది యేమిటంటే, పాక్షిక డిమాండ్ల కొరకూ, కొన్ని సౌకర్యాల సాధనకొరకూ ప్రభుత్వంతో చేసే పోరాటాలు శత్రువుతో చిన్న ఘర్షణలు మాత్రమే, ఠాణాలమధ్య ఘర్షణలు మాత్రమే, కానీ నిర్ణయాత్మక యుద్ధం యింకా రావలసివుంది. శత్రు దుర్గం బలసంపన్నంగా మన ముందు నిటారుగా వుంది; అది తుపాకి గుండ్లూ, ఫిరంగి గుండ్లూ మనమీద వర్షిస్తూ మన ఉత్తమ యోధులను నేలకూలుస్తున్నది. మనం యీ కోటను పట్టుకోవాలి; జాగృత కార్మికవర్గపు సమస్త శక్తులనూ రష్యన్ విప్లవకారుల సమస్త శక్తులతో కలిపి, రష్యాలో ప్రాణప్రదమైన, నిజాయితీ అయిన సమస్తాన్నీ ఆకర్షించే ఏకైక పార్టీగా మనం సమైక్యం చేస్తే, యీ కోటను మనం తప్పక పట్టుకుంటాము. అప్పుడే రష్యన్ కార్మిక విప్లవకారుడైన ప్యోత్ర్ అలెక్సేయెవ్ (ఫుట్‌నోట్.8) యొక్క యీ మహత్తర జోస్యం నిజమౌతుంది: "లక్షోపలక్షల కార్మికుల మాంసల బాహుదండం పైకి లేస్తుంది, సైనికుల సన్నీలతో పరిరక్షితమైన నిరంకుశత్వపు నిగళాలు చూర్ణమౌతాయి!"

రచన: నవంబర్ 1900 తొలి భాగం
ప్రచురణ: డిసెంబర్ 1900, 'ఇస్క్రా' నం.1

ఫుట్‌నోట్స్ :

1 *'శ్రమ విమోచన' బృందం - రష్యాలో మొట్టమొదటి మార్క్సిస్టు గ్రూపు. ఇది 1883లో జి.వి. ప్లెహనోవ్‌చేత జెనీవాలో స్థాపించబడింది. ఆర్.యస్.డి.యల్.పి. రెండవ మహాసభ (1903) దాకా యీ బృందం వుండింది.*

2 *మార్చి 1898, మీన్స్కులో ఆర్.యస్.డి.యల్.పి మొదటి మహాసభ జరిగింది. దానిలో ఆరు స్థానిక సోషల్ డెమోక్రటిక్ సంస్థలనుండి తొమ్మిదిమంది పాల్గొనినారు. స్థానిక సంస్థలు 'రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ'గా సమ్మేళనం కావాలని మహాసభ నిర్ణయం చేసింది.*

3 'Credo' *అనే పత్రంలో "ఆర్థికవాదులు" తమ భావాలను వ్యక్తం చేసినారు. (ఆర్థికవాదులు-19వ శతాబ్ది అంతం, 20వ శతాబ్ది ప్రారంభంలో రష్యన్ సోషల్ డెమోక్రట్లలో యేర్పడిన అవకాశవాదధోరణి). జారిజానికి వ్యతిరేకంగా రాజకీయ పోరాటం లిబరల్ బూర్జువావర్గం చేయాలనీ, కార్మికులు కేవలం పని పరిస్థితుల మెరుగుదలకూ, వేతనాలు పెంచడానికీ, పనిగంటలు తగ్గించడానికీ ఆర్థిక పోరాటానికి పరిమితం కావాలనీ ఆర్థికవాదులు అభిప్రాయపడినారు. కార్మికవర్గ స్వతంత్ర రాజకీయ పార్టీని స్థాపించడానికి వ్యతిరేకంగా వుండి, కార్మికవర్గ ఉద్యమంలో విప్లవ సిద్ధాంత ప్రాముఖ్యతను నిరాకరించినారు. ఆర్థికవాదుల తప్పు అభిప్రాయాలను 1902లో వెలువడిన 'ఏమి చేయాలి?', తదితర రచనలలో లెనిన్ ఖండించినాడు.*

4 *'రబోచయా మీస్ల్' ('కార్మిక చింతన') -ఆర్థికవాదుల పత్రిక; 1897-1902లో వెలువడింది.*

5 *'నరోద్నయ వోల్య' ('ప్రజా అభీష్టం') - 1879లో స్థాపించబడిన రహస్య విప్లవపార్టీ. నిరంకుశ పరిపాలనను కూలదోయడం, రాజకీయ స్వేచ్ఛను ప్రవేశపెట్టడం దీని లక్ష్యాలు. జారిజంతో సాగిస్తున్న పోరాటంలో యీ పార్టీకి చెందినవాళ్లు వ్యక్తిగత టెర్రరిజం ముఖ్య పద్ధతిగా భావించినారు. ప్రజలతో సంబంధాలు లేని విప్లవకారుల గ్రూపు కుట్రలద్వారా, టెర్రరిస్టు చర్యలద్వారా నిరంకుశ పరిపాలనను కూలదోయ వచ్చునని వాళ్లు దురభిప్రాయపడినారు.*

6 *బెర్న్‌స్టైనిజం-జర్మన్, అంతర్జాతీయ సోషల్ డెమోక్రసీలో జర్మన్ సోషల్ డెమోక్రట్ ఎడువార్డ్ బెర్న్‌స్టైన్ స్థాపించిన అవకాశ ధోరణి. అతను సోషలిస్టు విప్లవాన్ని గురించీ, మార్క్సిజం యొక్క మౌలిక సూత్రాలను రద్దుచేయాలనీ, పునర్విమర్శ చేయాలనీ డిమాండు చేసినాడు. సోషల్ డెమోక్రసీ సోషలిజం కోసం పోరాటాన్ని వదలిపెట్టి, పెట్టుబడిదారీ విధాన చట్రాలలో కొన్ని సంస్కరణలకోసం మాత్రమే ప్రయత్నించాలని యీ ధోరణి ప్రతిపాదన చేసింది.*

7 *మార్క్సు రాసిన 'అంతర్జాతీయ కార్మికుల సంఘం సాధారణ నిబంధనావళి' నుండి ఉల్లేఖన.*

8 *అలెక్సేయెవ్, ప్యోత్ర్-రష్యన్ విప్లవకారుడు, వృత్తిరీత్యా సాలీడు; 1875లో అరెస్టుచేయబడి, కోర్టులో ఉత్సాహపూరితమైన ఉపన్యాసం చేసినాడు. ఆ ఉపన్యాసంలో ముగింపు మాటలు లెనిన్ ఉల్లేఖిస్తున్నాడు.* ★

కేంద్ర ప్రభుత్వ నిర్బంధ చట్టాలు... నిరంకుశ విధానాలు

ఈ సంవత్సరం ఏప్రిల్ రెండవవారంతో మొదలై, మే నెల మూడవ వారంతో ముగిసిన 17వ లోక్‌సభ ఎన్నికలలో భారతీయ జనతాపార్టీ ఊహించినదానికి మించిన భారీ మెజారిటీతో గెలుపొందింది. భారత బడా బూర్జువావర్గం, వారి వెనుక ఉన్న సామ్రాజ్యవాదశక్తులు ఈ ఎన్నికలలో భాజపాకు వత్తాసుగా నిలిచాయి. ఈ సందర్భంగా విపరీతమైన జాతీయ, మత ఉన్మాదాలను, దుష్ప్రచారాలను సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టారు. కార్మికులు, రైతాంగము, ఇతర పీడిత ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల జోలికి పోకుండానే, పక్కదారి పట్టించే చర్చలు చేసి గెలుపును కొనుక్కున్నారు.

20-6-2019 నుండి 6-8-2019 నడుమ 17వ లోక్‌సభ సమావేశమయి ప్రజల జీవితాల్ని తీవ్రంగా ప్రభావితం చేసే అనేక - 30కి పైగా - కొత్త బిల్లులను ఆమోదించింది; పాతవాటిని సవరించింది. పౌర హక్కులను క్రూరంగా అణచివేసే 'ఉప' చట్టం సవరణ, ముస్లిం మహిళల 'మూడు తలాక్'ల బిల్లు, పాత కార్మిక చట్టాల స్థానంలో నాలుగు కోడ్‌లు, వైద్య విద్యలో తీవ్రమైన మార్పులు, సమాచార హక్కు చట్టం నీరుకార్చడం, రహదారుల భద్రత, పౌరుల సౌకర్యాల పేరిట రవాణారంగంలో రాష్ట్రాల అధికారాలను కేంద్రానికి దఖలు పరుచుకోవడం, సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య పెంపుదల, ఎస్సీ జెడ్ చట్టంలో సవరణలు, ఆధార్‌కార్డ్‌కు విస్తృత అధికారిక గుర్తింపు, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన బిల్లు తదితరాలతో పాటు జాతీయ నేర పరిశోధన (ఎన్ఐఏ) విభాగపు అధికారాల పెంపు లాంటివి 30కి పైగా చట్టాలను, సవరణలను ఆమోదించింది. మొదటగా 2019-2020వ సంవత్సరపు ఆర్థిక బడ్జెట్టు బిల్లును, ముగింపుగా మెరుపు దాడితో జమ్మూ అండ్ కాశ్మీర్ విభజన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకున్నారు. కాశ్మీరుకు ఇప్పటివరకు గల ప్రత్యేక ప్రతిపత్తి హక్కును రద్దు పరుస్తూ 370వ అధికరణంలో మార్పులను చేశారు. తమ ఆధిపత్య విస్తరణకు తోడ్పడే ప్రతి చిన్న అవకాశాన్ని మూక బలంతో సాధించుకునే ప్రయత్నం భాజపా పాలకులు చేస్తున్నారు. చాలామంది పార్లమెంటు సభ్యులకు ముసాయిదా బిల్లులను తగినంత ముందుగా పంపకుండానే, వాటిపై సరియైన చర్చ జరగకుండానే తమకు మెజారిటీ ఉందన్న అదరగండంతో ఇన్ని ప్రజా వ్యతిరేక, పచ్చి నిరంకుశ చట్టాలను చేశారు. ప్రజలలో గూడుకట్టుకుని ఉన్న అసంతృప్తి ఆందోళనలకు దారితీయకుండా కొత్త నిరంకుశ చట్టాలు, పాత చట్టాలకు క్రూర సవరణలు చేశారు. ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడిచే అనేక నిర్ణయాలను చేశారు. అయినప్పటికీ తెలుగు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్, వైసిపి పార్టీలుగానీ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి గానీ ఏ ఒక్క బిల్లును వ్యతిరేకించకుండా అన్నింటినీ ఆమోదించి తమ ప్రజా వ్యతిరేకతను చాటుకున్నారు.

తలాక్ - తలాక్ - తలాక్ బిల్లు ....

ఇరవై సంవత్సరాలకు పైగా పెండింగ్‌లో ఉన్న చట్టసభలలో మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి వాగ్దానాలు తప్ప పాలక రాజకీయ పార్టీలు, ముఖ్యంగా బిజెపిలు చట్టం చేయటానికి పూనుకోలేదు. ముస్లిం సమాజంలో ఉన్న తలాక్ తలాక్ తలాక్ అని ముమ్మారు పురుషుడు చెబితే విడాకులు ఇచ్చినట్లేనని భావించే దురాచారాన్ని అరికట్టటం పేరుతో ఈ చట్టం చేశారు. ఇది ఇంతకుముందే మూడు సార్లు ఆర్డినెన్సులు జారీ చేసినా రాజ్యసభలో ఆమోదం పొందలేక రెండుసార్లు తిరస్కరణకు గురైంది. సుప్రీంకోర్టు ఈ దురాచారాన్ని రద్దు పరుస్తూ 2 సంవత్సరాల క్రితం తీర్పును కూడా ఇచ్చింది. అంతేకాదు దీనికోసం ప్రత్యేకమైన చట్టం చేయవలసిన పని లేదని కూడా మెజారిటీ న్యాయమూర్తులు తీర్పులో పేర్కొన్నారు. ఒకరకంగా పై దురాచారం చట్టబద్ధంగా సుప్రీంకోర్టు తీర్పుతో నిషేధానికి గురైనట్లే! మీడియాలో ప్రచారం అవుతున్న అంత ప్రబలంగా కూడా ఈ దురాచారం లేదు. కానీ భాజపా పాలకులు తమ ముస్లిం విద్వేష రాజకీయాలకు ఒక తీపి పూత పూయటానికి, వాస్తవంగా ముస్లింలలో అంత ప్రబలంగా లేని ఈ దురాచారానికి వ్యతిరేకంగా ఒక చట్టం చేసేశారు. అతిక్రమించినవారికి 3 సం॥ జైలు శిక్ష అంటూ సివిల్ విషయాల్లోకి క్రిమినల్ విషయాలను జొప్పించారు. భారతదేశంలో విభిన్న మతాలు ఉన్నాయి. ప్రతి మతంలోను ప్రత్యేకించి హిందూ మతంలో ఉన్న దురాచారాలకు వ్యతిరేకంగా, వారు నిత్యం జపంచేసే మనుస్మృతికి వ్యతిరేకంగా వ్యాఖ్యానించే పనికి, చట్టాలు చేసే పనికి భాజపా పాలకులు పూనుకోలేదు. ముస్లింలలో ఉన్న దురాచారం మాత్రమే వారికి కనబడింది.

కార్మికుల హక్కులను హరించే చట్టాలు - చట్టసవరణలు

కార్మిక చట్టాల సవరణ పేరుతో నూరేళ్ళ కు పైగా అనేక పోరాటాల ఫలితంగా కార్మికులు సాధించుకున్న హక్కులను కాలరాచే వైపుగా మరో చట్ట సవరణ ఈ సమావేశాలలోనే చేశారు. నలభై నాలుగు రకాల కార్మిక చట్టాలను నాలుగుగా కుదించటం పేరుతో ఈ సవరణలు తలపెట్టారు. అయితే ప్రస్తుతానికి 4 రకాల పాత చట్టాలను సవరించి ఒకే వేతన చట్టం చేశారు. అలాగే 13 రకాల పాత చట్టాలను సవరించి వృత్తి సంబంధ ఆరోగ్యం, భద్రత మరియు పని పరిస్థితుల గురించి మరొక చట్టం ఆమోదించుకున్నారు. ఇవన్నీ భారత పారిశ్రామిక యాజమాన్య వర్గాలు ఎన్నికల ముందు మోడీ ప్రభుత్వాన్ని కోరుకున్న విధంగానే, వారికి మిక్కిలి సంతోషం కలిగించే విధంగానే కార్మికులకు వ్యతిరేకమైన ఈ కార్మిక చట్టాల సవరణ చేశారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా కార్మిక శ్రమశక్తిని విలువ కట్టడం కాకుండా, హేతుబద్ధమైన కనీస వేతన విధానాన్ని కాకుండా నెలకు కనీసం 18 వేల రూపాయలు ఉండాలనే 46వ లేబర్ కాన్ఫరెన్సు సిఫార్సుని పెడచెవినబెట్టి తమ ఇష్టానుసారం చట్ట సవరణ చేశారు. ప్రస్తుత కార్మిక మంత్రి సతీష్ గ్యాంగ్వార్ గత ప్రభుత్వంలో కూడా కార్మిక మంత్రిగా ఉంటూ 2018 జనవరిలో వేతన సిఫారసుల కొరకు ఒక నిపుణుల కమిటీని నియమించాడు. వారు దీనిని కుదించి 2012 నాటి ధరవరల ప్రకారం నెలకు 9750 నుండి 11,622 రూపాయల కనీస వేతనాన్ని సూచించారు. దాని ప్రకారం రోజుకి 375 నుండి 477 రూపాయల వరకు కనీస వేతనం ఉండాలన్నమాట !

అయితే దేశమంతటా ఒకే జాతీయ సార్వత్రిక కనీస వేతనం ఉండాలని, అంతకంటే తక్కువ వేతనం ఎవరూ ఇవ్వకూడదని చెప్పుకుంటూ 2019లో చేసిన చట్టం కనీస వేతనం రోజుకు 178 రూపాయలుగా నిర్ణయించింది. అంటే నెలకు 26 రోజులు చొప్పున 4628 రూపాయలు అన్న మాట! దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో నిర్ణయింపబడిన ఈ కనీస వేతనం కంటే తక్కువ లేకుండా

చూడటం కొరకు అన్నట్టు పాలకులు ప్రచారం చేసుకుంటున్నారు. ఇది ఇప్పటికే అమలులో ఉన్న రోజుకు 176 రూపాయల కంటే రెండే రెండు రూపాయలు పెంచి నిర్ణయించినది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వేతనం ఏవిధంగానూ సరిపోదని తెలిసినప్పటికీ భాజపా పాలకులు అత్యంత అమానవీయ అనాగరిక వేతన విధానాన్ని ప్రకటించడానికి ఏమాత్రం జంకలేదు. పెట్టుబడి దారుల కోర్కెల కనుగుణంగా హైర్ అండ్ ఫైర్ విధానాలకు ప్రభుత్వమే ఊతం కల్పించింది. బోనస్ అన్నది లాభాలలో కార్మికులకు పంచి ఇవ్వవలసిన భాగం కాదనీ అది కోల్పోయిన వేతనమనీ కనుక అది ప్రతి కార్మికుడు పొందవలసిన హక్కని 45 ఏళ్ల క్రితం సుప్రీం కోర్టు ఒక తీర్పు చెప్పింది. పాలకులు దానిని ఏనాడు అమలు పరచక పోగా ప్రస్తుతం అయితే దాని ఊసే లేకుండా చేశారు. రోజుకు 8 గంటల కంటే ఎక్కువ పని చేసినట్లయితే ఓవర్ టైం ఇవ్వాలనే నిబంధన 70 సంవత్సరాల నుంచి ఉన్నది. నేటి బిల్లులో దాని ఊసు కూడా లేదు. ఇంకా ధరల పెరుగుదలకు అనుగుణంగా మూడు నెలలకు ఒకసారి, ఆరు నెలలకు ఒకసారి కరువు భత్యం పెంపుదల చట్టబద్ధంగా నిర్ణయించవలసి ఉండినా ప్రభుత్వం పట్టించు కోలేదు.

సమాచారహక్కును నీరుగార్చే సవరణ

సమాచార హక్కు చట్టం కూడా సవరణ కు గురైన వాటిలో ఒకటి. అనేక ప్రజాతంత్ర ఆందోళనల ఫలితంగా 2005లో రూపు దిద్దుకుంది సమాచారహక్కు చట్టం. వ్యక్తిగత విషయాలు, దేశరక్షణ సంబంధిత విషయాలు మినహా ప్రభుత్వంలో జరిగిన, జరుగుతున్న వ్యవహారం ఏదైనా పది రూపాయల చలానాతో తెలుసుకోగలిగే సమాచార హక్కు సామాన్య పౌరులకు కూడా దీనివల్ల లభించింది. ఈ శాఖకు కేంద్ర స్థాయిలో ముఖ్య కమిషనర్‌తో పాటు సహకమిషనర్లు తదితరులు ఉంటారు. రాష్ట్రాల స్థాయిలో కూడా కమిషనర్లు ఉంటారు. కేంద్ర సమాచార హక్కు కమిషన్ సభ్యులను కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లే, రాష్ట్రస్థాయి సమాచార హక్కు కమిషన్ను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. ఎన్నికల కమిషన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు లాగానే సమాచార హక్కు శాఖకు అటానమస్ (స్వయం ప్రతిపత్తి) అధికారాలు ఉన్నాయి. ఈ స్వయంప్రతిపత్తి అధికారాలే భాజపా పాలకులకు ఇష్టం లేకుండా పోయింది. అందుకే వాటి స్థాయిని కుదించారు. రాష్ట్ర కమిషనర్ల నియామకం రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయం ప్రకారం ఇప్పటివరకు అమలు జరిగేది. ఇకనుండి సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్లను కూడా కేంద్ర ప్రభుత్వమే నియమించుకునే విధంగా అధికారాలను దఖలు పరుచుకుంటూ చట్టాన్ని సవరించారు. అంతే కాకుండా కేంద్ర, రాష్ట్ర కమీషనర్ల పదవీకాలం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వమే నిర్ణయించే విధంగా చట్టంలో మార్పులు చేశారు. దానితో సమాచార హక్కు చట్టం శాఖకు ఇప్పటివరకు ఉండిన స్వయంప్రతిపత్తి లేకుండా పోవడమే కాక ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై నిత్యం ఆధారపడే వ్యవస్థ కింద దానిని మార్చారు. సుప్రీంకోర్టు జడ్జిలు, కేంద్ర ఎన్నికల కమిషన్ స్థాయితో సమానమైన హోదాను తొలగించారు. తమ అవినీతిని బహిర్గత పరిచే సమాచారాన్ని ప్రజలకు అందనివ్వకుండా భాజపా పాలకులు అడ్డు తగల దలుచుకున్నారు. ఆ విధంగా సమాచార హక్కును పొందే పౌర స్వేచ్ఛకు కళ్ళాలు బిగించారు. అధికారంలో ఉన్నవారి అవినీతి బహిర్గతం కానివ్వకుండా చేసుకునే తాపత్రయానికి ఈ చట్ట సవరణ ఒక నిదర్శనం.

నిర్బంధచట్టాల కోరలకు పదను

అణచివేతలకు అదనపు కోరలు అందించే రెండు రకాల చట్ట సవరణలు కూడా చేశారు. వాటిలో ఎన్ఐఏ అధికార పరిధిని విస్తృత పరచడం ఒకటైతే, రెండవది 'ఉప' చట్టం. 2008లో జరిగిన ముంబాయి దాడులు కర్కరే హత్యల తర్వాత నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ అనే కొత్త పోలీసు వ్యవస్థను మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఏర్పరచింది. టెర్రరిస్టు చర్యలను జరగక ముందు కనిపెట్టడం, జరిగిన తరువాత విచారణ చేపట్టడం దాని పరిధిగా ఉండేది. ఇప్పుడు సవరించిన చట్టం ప్రకారం 1. వ్యభిచార కేంద్రాల కు తరలింపు (హ్యూమన్ ట్రాఫికింగ్), 2. దొంగనోట్ల ముద్రణ, 3. నిషిద్ధ ఆయుధాల తయారీ, 4. సైబర్ టెర్రరిజం, 5. పేలుడు పదార్థాల చట్టం(1908) పరిధిలోని నేరాలు కూడా ఎన్ఐఏ పరిధిలోకి వచ్చే విధంగా చట్ట సవరణ చేశారు. ఇప్పటివరకు ఇవన్నీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పోలీసుశాఖలు నిర్వహిస్తూ ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వాల పరిధిలో సాగుతున్న ఐదు రకాల విచారణాధి కారాలను కేంద్ర ప్రభుత్వం తన గుప్పిటలోకి గుంజుకున్నది. పేరుకు ఫెడరల్ (సమాఖ్య తరహా పరిపాలన) వ్యవస్థ, ఆచరణలో కేంద్రీకృత యూనిటరీ పరిపాలనకు ఇదొక సరికొత్త ఉదాహరణ మాత్రమే!!

హిందూమతం పేరిట టెర్రరిస్టు కార్య కలాపాలు నిర్వహించే వారిని (ఉదాహరణకు అభినవ భారత్ వారి బాంబు కేసులు, సనాతన సంస్థాన్ వారి హత్యాకాండ) ఎన్ఐఏ అరికట్టలేక పోయింది, నీరు కార్చే విధంగా వ్యవహరిస్తూ ఉంది.

'ఉప' చట్టానికి నూరేళ్ళ క్రితపు వలస పాలకుల రౌలట్ చట్టంలో మూలాలు ఉన్నాయి. చైనా దేశంతో సరిహద్దు సంఘర్షణ తర్వాత 1963లో దేశ సమగ్రత సార్వభౌమత్వాల పరిరక్షణ పేరిట జరిపిన 16వ రాజ్యాంగ సవరణ ఆధారంగా 1967లో చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం చేశారు. దాని నుండే టాడా, పోటాలాంటి చట్టాలు పుట్టి ప్రజాందోళనల ఫలితంగా రద్దయినాయి. 'ఉప' చట్టంకు 2004లో మన్మోహన్ ప్రభుత్వం కొన్ని సవరణలు చేసింది. టెర్రరిజంను నిర్వచించి, అలాంటి సంస్థలను 'ఉప' చట్టం కింద నిషేధించ వచ్చునంది. ఆ చట్టం అమలును ఎన్ఐఏ కు బదలాయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల నుండి గుంజుకొని కేంద్రం తన అధికారాలుగా మార్చుకుంది. టాడా పోటా చట్టాలు పోయినా 'ఉప' చట్టం ద్వారా పై తరహా నిర్బంధాలను పాలకులు కొనసాగిస్తూ ఉన్నారు. ఇప్పుడు ఆ చట్టానికి మరింత విస్తృత అధికారాలను అందించే సవరణలు చేశారు.

ఇకనుండి సంస్థలను మాత్రమే టెర్రరిస్టువి అనే కాకుండా వ్యక్తులను కూడా టెర్రరిస్టులుగా ఆరోపించి ఎలాంటి విచారణ జరపకుండా నిర్బంధించే అధికారాలను ఉప చట్టం పాలకులకు ఇస్తుంది. "ఈ చట్టానికి భయపడే వారందరూ టెర్రరిస్టులయి ఉంటారు" అని హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటించడాన్ని బట్టి నిరసన గొంతులను, ప్రజాతంత్ర గొంతులను వినపడనివ్వకుండా చేయడమనే క్రూర ఆలోచన ఇందులో ఉంది. పాలకులు భావించే టెర్రరిజం వ్యాప్తికి సహాయపడే వ్యక్తులను కూడా టెర్రరిస్టులని పేరు పెట్టొచ్చు. "టెర్రరిస్టు కార్యకలాపాలకు ఆర్థిక సహాయం చేసేవారందరూ టెర్రరిస్టులే! టెర్రరిస్టు భావజాలాన్ని-సాహిత్యాన్ని-వ్యాప్తి చేసేవారందరూ టెర్రరిస్టులే!! "ఇవి కూడా పార్లమెంటులో హోంమంత్రి గారి మాటలే.

ప్రపంచ ప్రఖ్యాత రచయిత టాల్‌స్టాయ్ రచించిన 'యుద్ధము-శాంతి' నవల కూడా నిషిద్ధ గ్రంథం లాగా హైకోర్టు జడ్జి స్థాయి వారికి అనిపించిందంటే భగత్‌సింగ్ రచనలు కూడా నిషిద్ధాలు అయితే ఆశ్చర్యపడవలసినది ఏమీ లేదు. ఇప్పటికే 'ఉప' చట్టం కింద సంవత్సరం క్రితం అరెస్టు కాబడిన వరవరరావు, సుధా

(తరువాయి 8వ పేజీలో)

భరద్వాజ తదితరులు కనీస విచారణ లేకుండా జైళ్ళల్లో మగ్గుతున్నారు. కోరలు పెంచిన కొత్త చట్టం టెర్రరిజం పేరిట, సమస్త ప్రజాతంత్ర ఉద్యమాలను, వాటికి నాయకత్వం అందిస్తున్న సహాయపడుతున్న వారందరినీ నిర్బంధం పాలు కావించడం ఈ చట్ట సవరణ యొక్క అసలు లక్ష్యం. తీవ్రతరమవుతున్న సామాజిక సంక్షోభాన్ని దాని నుండి పెరుగుతున్న ప్రజా నిరసన, ఆందోళనలను అణచివేయా లన్నదే వారి ఊహ. పెరిగిపోతున్న అసమానతల వ్యవస్థను నిర్బంధ చట్టాల ద్వారా కాపాడు కోవాలన్నదే వారి దురాశ!!

కాశ్మీర్ ప్రజల ఆకాంక్షలపై గొడ్డలివేటు

పార్లమెంటు జరిగిన చివరి రెండు రోజులలో, ఆగస్టు 5, 6 తేదీలలో, జమ్మూ కాశ్మీర్‌కు ఆర్టికల్ 370 , 35ఏలతో గల ప్రత్యేక హక్కులను రద్దు పరుస్తూ హడావిడిగా మరో చట్టం చేశారు. కాశ్మీర్‌లో రెండేళ్ల క్రితం పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ తో సంకీర్ణ ప్రభుత్వాన్ని నడిపిన భారతీయ జనతా పార్టీ ఆ ప్రభుత్వాన్ని కూలిపోయేట్లు చేసింది. గవర్నర్ వ్యవస్థ ద్వారా మరో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడకుండా చూసింది. అక్కడ గవర్నర్ పరిపాలన నడుస్తుండగానే జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాన్ని రద్దు చేసి లడక్ ప్రాంతాన్ని దాన్నుండి విడగొట్టి 2 కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టింది. లడక్‌కు ఎన్నుకోబడిన అసెంబ్లీ అన్నదే లేకుండాను, జమ్మూకాశ్మీర్‌కు ఎన్నికలంటూ జరిగినా కేంద్రం అధీనంలోనే ఉండేట్లుగాను మార్చేసింది. ఈలోగా జమ్మూ కాశ్మీర్ రాష్ట్రానికి రాజ్యాంగంలోని 370వ అధికరణం ద్వారా ఉండిన స్వయంప్రతిపత్తి హక్కులను హరించి వేస్తూ, అలాగే ఆర్టికల్ 35ఏ చట్టం రద్దుద్వారా ఆ రాష్ట్ర సహజ వనరులపై ఆ రాష్ట్ర ప్రజలకు మాత్రమే గల అధికారాలను, ఆ రాష్ట్ర ప్రజలకు గల ఉపాధి హక్కులను రద్దు చేశారు. ఇది కాశ్మీర్ రాష్ట్ర ప్రజల ప్రజాస్వామ్య హక్కులపై నిస్సిగ్గుగా చేసిన దాడి. అంతేకాకుండా విశాల భారతదేశం లో గల ఏ రాష్ట్రంలోని వనరులైనా కేంద్ర ప్రభుత్వం అధీనంలో పెట్టుకునే హక్కులు తమకు ఉన్నాయని కేంద్రీకృత పాలనాధికార దర్పాన్ని అది ప్రదర్శించుకొంది. ఈ తరహా కేంద్రీకృత నిరంకుశ ఆధిపత్య పాలనా విధానం భారత దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలకు, సమస్త జాతుల ప్రజానీకపు స్వాతంత్ర్యేచ్ఛకు ప్రమాదకరం.

గడిచిన 30 ఏళ్లకు పైగా లక్షలాది సైనిక బలాల మోహరింపుతో కాశ్మీరీ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను అణచి ఉంచుతూ వస్తున్నారు. వాటికి అదనంగా మరో 40 వేల సైనిక బలగాలను ఆగస్టు మొదటి రోజులలో జమ్మూకాశ్మీర్‌కి తరలించి పార్లమెంటు ఉభయ సభలలో హడావిడిగా చట్టసవరణ చేసుకున్నారు. రెండు నెలలు గడుస్తున్నా నేటికీ నిర్బంధంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులకుగాని, స్తంభించిపోయిన ప్రజా జీవనానికిగాని వెసులుబాటు దొరకలేదు. పాఠశాలలు కళాశాలలు పనిచేయటం లేదు. రోగులకు వైద్య సదుపాయాలు అందటం లేదు. ప్రజానీకం యిళ్లలో నుండి స్వేచ్ఛగా బయటకు వచ్చి తమ రోజువారి వృత్తి సంబంధ కార్యకలాపాల్లో పాల్గొనలేక పోతున్నారు సరికదా కనీసం గృహ అవసరాలకు కావలసిన సరుకుల కోసం కూడా బయటకు వెళ్ళలేక పోతున్నారు. ఫోన్లు లేవు, ఇంటర్నెట్‌లు లేవు పత్రికలు విడుదల కావడం లేదు. కాశ్మీరు రాష్ట్రం రాష్ట్రాన్ని నిర్బంధ ఖైదు కొట్టు గా మార్చేశారు. ఇదంతా కాశ్మీరు ప్రజలని భారతదేశంలో ఎలాంటి ప్రత్యేక ప్రతిపత్తి లేకుండా పరిపూర్ణ విలీనం చేసుకోవడంగా చెబుతున్నారు. కాశ్మీరీ ప్రజల హృదయాలను క్రూరంగా గాయపరిచారు. కాశ్మీరీల సమస్య ఆ జాతి ప్రజల సమస్య. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అది ఎప్పటికైనా పరిష్కారమవ వలసిందే తప్ప నిర్బంధాల వల్ల, అణచివేతల వల్ల కాదు. ★

కామ్రేడ్ తుఫాయిల్ అబ్బాస్‌కు విప్లవ నివాళులు

పాకిస్థాన్ కమ్యూనిస్టుపార్టీ తొలితరం నాయకులలో ఒకరైన కామ్రేడ్ తుఫాయిల్ అబ్బాస్ (92 సం॥లు) దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ 2019 ఆగస్టు 8న కరాచిలో మరణించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

1927 సం॥లో భారతదేశంలో లక్నోకు దగ్గరలో వున్న దేబర్ అనే ఓ చిన్న పట్టణంలో కా॥ అబ్బాస్ జన్మించాడు. దేశ విభజన తర్వాత వారి కుటుంబం కరాచి తరలివెళ్ళింది. పాకిస్తాన్ కమ్యూనిస్టుపార్టీ తొలితరం సభ్యులలో ఈయన ఒకరు. ఓరియంటల్ ఎయిర్‌వేస్ ఎంప్లాయిస్ యూనియన్‌ను కా॥ అబ్బాస్ 1950లో స్థాపించారు. పాలకులు ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగించిన ప్రతి సందర్భంలోనూ కామ్రేడ్ అబ్బాస్ అనేకసార్లు జైలులో నిర్బంధించబడ్డారు. ఆయూబ్ ఖాన్ ప్రభుత్వ కాలంలో కా॥ హసన్ నాజర్‌ను అరెస్టుచేసి, ఆపై హత్యగావించిన సందర్భంలో కూడా కా॥ అబ్బాస్‌ను జైలులో నిర్బంధించారు.

కా॥ అబ్బాస్ కరాచి పట్టణ కమ్యూనిస్టుపార్టీ కార్యదర్శిగా కృషిచేశారు. పార్టీలో విభేధాలు ఉత్పన్నమయిన తర్వాత ఆయన కమ్యూనిస్టుపార్టీని వీడి, చైనా కమ్యూనిస్టుపార్టీ విధానాల వైపు మొగ్గుచూపారు. మావోసేటుంగ్ మరణం తర్వాత చైనా, రష్యా పాలకులను రివిజనిస్టులుగా పేర్కొంటూ ఆయన ఖండించారు. పాకిస్ధాన్ కార్మిక ఫ్రంట్‌కు ఆయన అధ్యక్షునిగా పనిచేశారు.

కామ్రేడ్ తుఫాయిల్ అబ్బాస్‌కు సిపిఐ(ఎం-ఎల్) జోహార్లు అర్పిస్తోంది. పాకిస్తాన్ కార్మిక ఫ్రంట్ కామ్రేడ్స్‌కు, ఆయన కుటుంబసభ్యులకు సిపిఐ(ఎం-ఎల్) తన ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతోంది.

కామ్రేడ్ సంతోష్‌రాణాకు విప్లవజోహార్లు

వయోవృద్ధులైన విప్లవ కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ సంతోష్ రాణా(76 సం॥) క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ 2019 జూన్ 29న కోల్‌కతాలో కన్నుమూశారు. కామ్రేడ్ సంతోష్‌రాణా పశ్చిమబెంగాల్‌లోని గోపీవల్లభపూర్‌కు చెందినవారు. 1960లలో కోల్‌కతా విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్రంలో పి.హెచ్.డి చేస్తున్న కాలంలో ఆయన విప్లవ కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారు. తాను జన్మించిన ప్రాంతంలోనే విప్లవోద్యమ కృషిలో ఆయన నిమగ్నమయ్యారు. అంకితభావంతో కూడిన తన కార్యాచరణద్వారా అనతికాలంలోనే కార్యకర్తగా అభివృద్ధిచెంది చారిత్రక దేబ్రా-గోపీవల్లభపూర్ ప్రాంత ఆదివాసీ రైతాంగ తిరుగుబాటుకు నాయకుడిగా ఎదిగారు. జైలుశిక్షననుభవించారు. గోపీవల్లభపూర్ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో కా॥సంతోష్‌రాణా జైలునుండే పోటీచేసి గెలుపొందారు. సిపిఐ(ఎం.ఎల్) పిసిసికి ఆయన దీర్ఘకాలం ప్రధానకార్యదర్శిగా వున్నారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన పలు ప్రజాఉద్యమాలలో క్రియాశీలంగా పాల్గొన్నారు. ఆనాటి జార్ఖండ్ ఉద్యమంలో ఒక ముఖ్యమైన పాత్రను ఆయన నిర్వహించారు. ఆయన మరణం విప్లవోద్యమానికి తీరనిలోటు. అమరులైన కామ్రేడ్ సంతోష్‌రాణాకు విప్లవజోహార్లు.

నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి)

వైద్య విద్యను, ప్రభుత్వ వైద్యాన్ని మరింత దిగజార్చి, కార్పొరేట్ల లాభాలకోసమే

ఇప్పటివరకు దేశంలో సాగుతున్న వైద్య విద్యను, వైద్య వృత్తికి సంబంధించిన నైతిక నియమావళిని, వైద్యుల గుర్తింపును, రిజిస్ట్రర్లను నడుపుతూ వచ్చిన మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ)ను రద్దుపరుస్తూ - దాని స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్‌ను ఏర్పరుస్తూ ఎన్ఎంసి బిల్లు - 2017ను పార్లమెంటు ఉభయసభలు ఆమోదించాయి. 8-8-19నాడు రాష్ట్రపతి ఆమోద ముద్రపడి అది చట్టరూపం ధరించింది. దీనికి వ్యతిరేకంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌తోపాటు వైద్య విద్యార్థులు దేశవ్యాపితంగా పెద్దఎత్తున గత 2 సంవత్సరాలుగా ఆందోళన చేస్తూ వచ్చారు. వారందరి ఆందోళనలను నిరసనలనూ పెడచెవిన పెట్టారు. 2017 డిశంబరులోనే ఈ బిల్లు పార్లమెంటు ముందుకు రాగా దాదాపు వైద్య వృత్తిలో వున్న వారంతా దానికి నిరసన తెలిపారు; పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దాంతో బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపారు. ఆ స్టాండింగ్ కమిటీకి పలు సంస్థలు వినతిపత్రాలు అందజేసి తమ వాదనలు వినమని అభ్యర్థించాయి. అయితే స్టాండింగ్ కమిటీ ఆయా సంస్థల అభ్యంతరాలు వినదానికి నిరాకరించింది. మౌలిక స్వభావం కలిగినవి కానప్పటికీ స్టాండింగ్ కమిటీ బిల్లులో కొన్ని మార్పులు, చేర్పులను ప్రతిపాదించింది. అయితే ఈ ప్రతిపాదనలను కూడ పరిగణలోకి తీసుకోకుండా కేంద్రంలోని బిజెపి పాలకులు కార్పొరేట్లకు సేవజేసే తమ రాజకీయ లక్ష్యాలకనుగుణంగా ఎన్ఎంసి చట్టం చేశారు.

ఇంట్లో ఎలుకలు పడ్డాయని ఇల్లు తగలబెట్టుకున్న చందాన...

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఎందుకు రద్దుచేయాల్సి వచ్చిందన్న ప్రశ్నకు పాలకులు చెప్పిన జవాబు దాని ప్రతిష్ట మసకబారిందనీ, అవినీతిలో కూరుకుపోయిందనీ! లాభార్జనాదృష్టితో ప్రైవేటు వైద్య విద్యా సంస్థలను పెంచుతూ రావటం, సూపర్ లాభార్జనల కార్పొరేటు వైద్యాన్ని ప్రోత్సహించటమనే పాలకుల విధానాలే దీనికి కారణం. ఈ విధానాలలో మార్పులేకుండా మరింత పకడ్బందీగా, మరింత స్వేచ్ఛగా ప్రైవేటు వైద్య విద్యను, కార్పొరేటు వైద్యాన్ని మూడు పువ్వులు, ఆరుకాయలుగా వర్ధిల్లచేసేందుకు వీలు కల్పించే విధంగా ఈ కొత్త చట్టాన్ని రూపొందించారు.

ఇంట్లో ఎలుకలు పడితే ఎలుకల్ని బయటికి తరిమేసి ఇల్లు చక్కబెట్టుకుంటామా? లేక ఇంటినే తగలేసుకుంటామా? ఇపుడు కేంద్రప్రభుత్వం చేసింది ఎలుకల సాకుతో వున్న ఇంటిని తగులబెట్టి మరిన్ని ఎలుకలు దూరేలా మరో కొత్త చట్టాన్ని రూపొందించటమే.

ప్రైవేటుకు నిబంధనలు మరింత సరళతరం

ఇప్పటివరకు అమలులో వున్న చట్టం ప్రకారం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్ని క్రమం తప్పక తనిఖీ చేయాలి. ప్రత్యక్షంగా పరిశీలించాలి. ఆయా కళాశాలల్లో తగినన్ని పడకలూ, తగినంత మంది రోగులూ, సిబ్బందీ, వున్నారా, లేరా అని పరిశీలించాలి. అలా లేకుంటే వున్న (మంజూరైన) వైద్యసీట్లను (యుజి,పిజి)కూడ తగ్గించాలి. నిబంధనలు ఏదోమేరకు కఠినతరంగా వుండేవి. ఆ నిబంధనలను పాటించడంకన్నా కళాశాల తనిఖీ బృందానికి కోట్ల రూ॥లంచం ఇవ్వడమే ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాలకు సులువుగా వుండేది. ఈవిధంగా సాపేక్షంగా కఠినతరమైన నిబంధనలు ఉన్ననాడే ఎమ్‌సిఐ అవినీతి, ఆరోపణలలో కూరుకుపోయింది. కాగా, ఎమ్‌సిఐలోని నిబంధనలన్నిటినీ సరళతరం చేసి, బిజెపి పాలకులు ఎన్ఎమ్‌సిని రూపొందించారు.

దీని ప్రకారం, ప్రైవేటు వైద్య కళాశాలలు తమ ఇష్టం వచ్చినన్ని సీట్లు కోరుకోవచ్చు. ఒకవేళ తనిఖీ చేసినపుడు సరైన వసతులు లేకపోతే కొత్తగా ఏర్పడే కమిషన్ సీట్లను కత్తిరించదు. పెనాల్టీ వేస్తుందంతే.

అంతేకాదు, గతంలో మేజేజిమెంటు కోటాకింద 15శాతం సీట్లను మాత్రమే కోటీశ్వరులకు అమ్ముకోగలిగేవి. ఇపుడు 50 నుండి 60 శాతం వరకు సీట్లను అమ్ముకునే అవకాశం కొత్త చట్టంలో ఇచ్చారు.

'స్వతంత్ర ప్రతిపత్తి'కి సంపూర్ణ సమాధి

జాతీయోద్యమ కాలంలోనే విద్యావ్యవస్థలపై వలసపాలకుల పెత్తనమేమిటని ప్రజాతంత్ర వాదులు, దేశభక్తులనేకమంది ప్రశ్నించారు. స్వతంత్ర వ్యవస్థల కోసం డిమాండ్ చేశారు. ఫలితంగా 1934లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను చట్టబద్ధమైన స్వతంత్ర(అటానమస్) సంస్థగా నెలకొల్పారు. 1947లో అధికారమార్పిడి జరిగాక 1956లో మళ్ళీ కొత్తచట్టం తెచ్చారు.

ఈ కౌన్సిల్‌లో ఇప్పటివరకు 160 మందివరకు సభ్యులుగా వుంటే అందులో 2/3వ వంతు మంది ఎన్నికయ్యేవారు. నామినేట్ చేయబడే వారి సంఖ్య తక్కువగా వుండేది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలనుండి, విశ్వవిద్యాలయాలనుండి ప్రాతినిధ్యం వుండేది. వైద్య వృత్తిలోని వారికే అవకాశం వుండేది. అధ్యక్ష, ఉపాధ్యక్షులు కౌన్సిల్ సభ్యులనుండే ఎన్నికయ్యేవారు.

ప్రస్తుత ఎన్.ఎమ్.సి. చట్టం ఈ స్వరూపాన్ని మార్చివేసింది. ఏదోమేరకున్న దాని స్వతంత్ర స్వభావాన్ని రద్దుచేసింది. కేంద్రప్రభుత్వం తన కిష్టం వచ్చిన వారిని ఈ కమీషన్‌లో నామినేట్ చేసుకునే అవకాశం కల్పించుకుంది. వైద్యవృత్తికి సంబంధించిన వారే ఇందులో వుండాలన్న నిబంధనను ఎత్తివేసింది. ఎన్నికయ్యే సభ్యుల సంఖ్యను తొమ్మిదికి కుదించింది. వైద్యరంగం- కేంద్రం, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలోని అంశం. గతంలో ఎంసిఐలో రాష్ట్రాల నుండి తగినంత మంది ప్రతినిధులు - ముఖ్యంగా వైద్యరంగం నుండి వుండేవారు. ప్రస్తుత ఎన్ఎమ్‌సి చట్ట ప్రకారం రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోవటంతో పాటు, వైద్యేతర (రాజకీయ) రంగాల ప్రతినిధులకు అవకాశం కల్పిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఎన్ఎమ్‌సిపై గుత్తాధిపత్యం నెలకొల్పుకుంది.

ఎన్ఎమ్‌సి పర్యవేక్షణ కింద 4 స్వతంత్ర బోర్డులను ఏర్పాటు చేస్తారు. 1) అండర్ గ్రాడ్యుయేట్(ఎంబిబిఎస్) మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డు 2) పోస్టు గ్రాడ్యుయేట్ బోర్డు 3) మెడికల్ అసెస్‌మెంట్ అండ్ రేటింగ్ బోర్డు 4) ఎథిక్స్ (నైతిక విలువలు) అండ్ మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డు. ఎన్ఎమ్‌సికే స్వతంత్రత లేకుండాచేసి, దాని ఆధ్వర్యంలో నియామకమయ్యే ఈ బోర్డులు స్వతంత్రంగా పనిచేస్తాయని చెప్పడం హాస్యాస్పదం కాదా!? పైగా వీటిలో వైద్య కళాశాలల అసెస్‌మెంట్, రేటింగ్ ఇచ్చే బోర్డు స్వయంగా తనిఖీలు చేపట్టకుండా కన్సల్టెన్సీల ద్వారా చేయించుకునే అవకాశం కల్పించారు.

వారిని కొనుగోలు చేస్తే, మంచిరేటింగ్ సాధించుకుని ప్రైవేటు వైద్య కళాశాలలు తమ సీట్లకు గిరాకీ మరింతగా పెంచుకోడానికి ఎంతో చక్కటి అవకాశాలు కల్పించారు. ప్రస్తుతం స్వతంత్ర ప్రతిపత్తి పేరుతో వున్న యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి)కి కూడ ఇదే పరిస్థితి దాపురించనుంది.

విద్యార్థులకేమో నిబంధనలు కఠినతరం

మెడికల్ కళాశాలలో సీటు సాధించాలంటే ఇంటర్మీడియట్ చదివి నేరుగా పరీక్ష రాస్తే చాలదు. ఖచ్చితంగా కోచింగ్సెంటరులో చేరి వాళ్ళకు లక్షల రూ॥లు చెల్లించి శిక్షణ తీసుకోవాల్సిన తప్పని స్థితి కల్పించారు. పి.జి. సీటు సాధించడం మరో యజ్ఞం. ఇపుడు ఈ చట్టంలో మరో మెలిక పెట్టారు. ఎం.బి.బి.యస్ పరీక్షలో పాసై వైద్య వృత్తిలోకి ప్రవేశించాలంటే నేషనల్ లైసెన్సియేట్ ఎగ్జామినేషన్ అనే అర్హత పరీక్ష ఉత్తీర్ణులవ్వాలనే మరో నిబంధన పెట్టారు.

ఇప్పటి వరకు ఈ పరీక్షను ఇతర దేశాల్లో చదివి వస్తున్న విద్యార్థులకు మాత్రమే పెట్టేవారు. విదేశాల్లో వైద్యవిద్యలో ఉత్తీర్ణులైనవారు సరైన ప్రమాణాల్లో చదివారో లేదో పరిశీలించటానికి దీన్ని పెడుతున్నారంటే అర్థముంది. మన విశ్వ విద్యాలయాలు డిగ్రీ ఇచ్చాక, తిరిగి ఆ విద్యార్థులకే మరో పరీక్ష పెట్టడం ఎందుకన్న వైద్య వర్గాల ప్రశ్నకు ప్రభుత్వం నుండి సమాధానం లేదు.

దేశీయ వైద్య విధానాలకు ప్రోత్సాహం శూన్యం

ఆధునిక వైద్యంగా చెప్పుకోబడే(అల్లోపతి) వైద్యం విదేశాలనుండి తీసుకున్నది. మనదేశంలో సాంప్రదాయకంగా నడుస్తున్న వైద్యవిధానా లున్నాయి. ఆయుర్వేదం, యునాని, సిద్ధ, ప్రకృతి వైద్యవిధానాలు. విదేశాలనుండి వచ్చినప్పటికీ హోమియో వైద్యాన్ని కూడ ఈ జాబితాలోకే చేర్చి వీటన్నిటికి కలిపి ఆయుష్ అనే వైద్యశాఖను ఏర్పరచారు.

ఈ వైద్య విధానాల్లో కొన్ని సుగుణాలు వున్నాయి. గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ ఎన్నో జబ్బులకు ఆకులు వనమూలికల ద్వారా వైద్యం చేసే పద్ధతి వుంది. ఔషధగుణాలున్న ఎన్నో మొక్కలు మన నేలల్లో పెరుగుతున్నాయి. ఎన్నో రకాల వనమూలికలున్నాయి. ఔషధ గుణంగల ఖనిజాలున్నాయి. వీటన్నిటిపై తగినంత పరిశోధనలు జరగాలంటే ప్రభుత్వం తన బడ్జెట్నుండి కేటాయింపులు జరపాలి. ఆధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఈ విధానాలతో జోడించాలి. చైనాలాంటి దేశాలు తను సాంప్రదాయక ఆక్యుపంచర్ విధానాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసిన సంగతి మనకు తెలుసు.

కాగా, మన దేశ పాలకులు దేశీయ వైద్య పరిశోధనలపై ఏమాత్రం శ్రద్ధ పెట్టడం లేదు. ఇపుడు ఈ చట్టం ద్వారా దీనికున్న కనీసపాటి అవకాశాలను కూడా తుడిచి పెడుతున్నారు. ఆయుర్వేద, హోమియో తదితర వైద్య కోర్సులు చదివిన వారికి 6 నెలల బ్రిడ్జి కోర్సులుపెట్టి అల్లోపతి/మోడరన్ వైద్యం చేసే అవకాశాన్ని ఈ బిల్లు కల్పిస్తుంది. ఈ నిబంధన ద్వారా దేశీయ వైద్యాన్ని అభివృద్ధిచేసే బాధ్యత నుండి పాలకులు తప్పుకోదలచుకున్నారనేది స్పష్టం.

గ్రామీణ వైద్యం మరింత సంక్లిష్టం

దేశంలోని వైద్యులు పట్టణ ప్రాంతాలకే పరిమితమయ్యారని, గ్రామీణ ప్రాంతంలో తప్పనిసరిగా పనిచేయాలన్న నిబంధనను వైద్య విద్యార్థుల ముందు చాలకాలంగా పాలకులు పెడుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి మరీ అధ్వాన్నం. (గ్రామీణ, పట్టణ వైద్యుల నిష్పత్తి 1:4). తగిన ఆసుపత్రి, నివాసం కల్పించి తగు వేతనం ఇస్తామంటే వెళ్ళడానికి వైద్యులు సిద్ధ పడతారు. వాటిని కల్పించకుండానే పాలకులు దశాబ్దాలు గడుపుతున్నారు.

దాంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు పి.ఎం.పి, ఆర్.ఎం.పిలే దిక్కవుతున్నారు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కార్పొరేట్ ఆసుపత్రులు వీరిని దళారులుగా పెట్టుకుని తమకు రోగుల్ని పంపినందుకు కమిషన్లు, పర్సెంటేజిలు చెల్లిస్తున్నాయి. ప్రస్తుత బిల్లు ఈ వైద్యులకు కూడ గుర్తింపు నిస్తామంటున్నది తప్ప, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేవైపు ఈ బిల్లు తీసుకున్న చర్యలు శూన్యం.

ఏతావాతా, ఈ కొత్తబిల్లు ద్వారా కేంద్ర ప్రభుత్వం మొత్తం వైద్యవిద్యను, వైద్యవృత్తిని తన చేతిలోకి తీసుకుంది. ప్రైవేటు కార్పొరేటుకు, వైద్య విద్యా వ్యాపారాన్ని సరళతరం చేసింది. పేద వర్గాల విద్యార్థుల విద్యావకాశాలను మరింతగా కుదించి ధనాఢ్యవర్గాలకే వైద్య విద్యను పరిమితం చేస్తోంది.

వైద్యం, వైద్యవిద్యలను ప్రభుత్వమే నిర్వహించాలి

మన వైద్య వ్యవస్థలో ప్రైవేటు పద్ధతిని రద్దుచేసి పూర్తిగా ప్రభుత్వమే చేతుల్లోకి తీసుకొని వైద్యం పొందే హక్కును ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తించాలని కమ్యూనిస్టులు, ప్రజాతంత్రవాదులు ఎంతోకాలంగా డిమాండు చేస్తూవస్తున్నారు. బంగ్లాదేశ్, భూటాన్, శ్రీలంక వంటి చిన్నదేశాలు కూడ వైద్యాన్ని ప్రభుత్వ రంగంలోనే అందిస్తున్నాయి.

వైద్యవిద్య గతంలో ప్రభుత్వరంగంలోనే చాలా దశాబ్దాలు నడిచింది. ప్రైవేటురంగంలో అనుమతులు పెంచాక వైద్య విద్య వ్యాపారీకరణ పెరిగింది. ప్రైవేటు వైద్య కళాశాలలు పెరగకుండా మెడికల్కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనలు కొంతలో కొంత నియంత్రణ వుండేది. ఇపుడు ఎన్ఎంసి చట్టంతో సరళతరమైన నిబంధనలవల్ల కార్పొరేటుశక్తులు, బహుళజాతి సంస్థలతో సహా ఈ రంగంలోకి ప్రవేశించి విస్తరిస్తాయి; పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య ఇక అందే అవకాశం వుండదు.

కమ్యూనిస్టు విప్లవకారులు, ప్రజాతంత్ర శక్తులు వైద్యరంగంలో పాలకులు తీసుకుంటున్న చర్యలను ప్రజలమధ్య బహిర్గతం చేయాలి. వైద్యం ప్రజల ప్రాథమిక హక్కుగా గుర్తించాలనీ -ప్రభుత్వరంగంలోనే వైద్యవ్యవస్థ, వైద్య విద్య వుండాలన్న డిమాండు కోసం విస్తృతమైన ప్రజాఉద్యమ నిర్మాణానికి పూనుకోవాలి. ✱

మహిళా కార్మికుల దుస్థితి

గ్రామీణ భారతంలో వ్యవసాయరంగం మహిళలకు సాంప్రదాయకంగా ఉపాధి కల్పించే రంగం. కాని సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క నయా ఉదారవాద ఆర్థిక విధానాలు అనుమతులివ్వడం మొదలయ్యాక శ్రామిక మార్కెట్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతూ వుంది. దానిలో భాగంగానే, మన దేశంలోని వస్త్ర పరిశ్రమ మహిళలకు అత్యధికంగా ఉపాధి కల్పించే రంగంగా మారింది. వ్యవసాయ రంగంలో సంక్షోభం ఫలితంగా జీవనోపాధిని వెతుక్కుంటూ నగరాలకు, పారిశ్రామిక రంగానికి గ్రామీణ మహిళల వలసలు ఎక్కువయ్యాయి. ప్రత్యేకంగా మహిళలకుండే సమస్యల కారణంగా వీరు వస్త్ర పరిశ్రమవైపు ఆకర్షితులయ్యారు. దీన్ని అదునుగా చేసుకొని దుస్తుల తయారీ కంపెనీలు మహిళల శ్రమశక్తి దోపిడీ ద్వారా భారీ లాభాలు గడించగలుగుతున్నాయి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణయొక్క నయా ఉదారవాద ఆర్థిక విధాన సమర్థకులు, ఆర్థిక వేత్తలు మాత్రం ఈ ఆర్థిక విధానాలు మహిళలకు ఆర్థికరంగంలో అనేక అవకాశాలు కల్పించాయనీ, తద్వారా మహిళలు బంధవిముక్తులై సాధికారికత లక్ష్యసాధనవైపు పురోగమించగలుగుతున్నారని అంటున్నారు. అంతేకాదు ఉపాధిరంగంలో ప్రస్తుతమున్న మహిళల భాగస్వామ్య స్థాయి చాలదనీ, మనదేశం అభివృద్ధిచెందిన దేశాల సరసన నిలవాలంటే పారిశ్రామిక ఉపాధి రంగంలోకి మరింత ఎక్కువగా మహిళలను తీసుకురావలసి వుందనీ, అప్పుడే వారు సాధికారత దిశగా మరింత ముందడుగు వేయగలరని నయాఉదారవాద ఆర్థిక పండితులు వాదిస్తున్నారు. ప్రపంచ కార్మిక సంస్థ, ఐక్యరాజ్యసమితిలాంటి అంతర్జాతీయ సంస్థలు సైతం మహిళలకు సాధికారత కల్పించడానికి ఈ దిశగా మార్పులు రావాలని వంతపాడు తన్నాయి.

ఈ వాదనలు, ఉద్బోధలు మహిళల ప్రయోజనాలు కాపాడడంలో ఎంతో అభివృద్ధి కరంగా వున్నట్లుగా కన్పిస్తాయి. కాని దుస్తుల తయారీ రంగంలో, సెజ్‌లలో, ఇతర పరిశ్రమల్లో అలాగే వ్యవసాయరంగంలో పనిచేస్తున్న మహిళల వాస్తవ పరిస్థితిని చూస్తే, వీరు చేస్తున్న వాదనల్లోని కపటత్వం, డొల్లతనం బయట పడతాయి. ప్రస్తుత అర్థవలస, అర్థభూస్వామ్య భారత వ్యవస్థపై శ్రమశక్తిని దోపిడీచేసే పెట్టుబడిదారీ విధానాలు, పద్ధతులు రుద్దబడు తున్నాయి. ఈ నేపథ్యంలో మహిళలపై తీవ్ర దోపిడీ విధానాలు ఏ స్థాయిలో రుద్దబడు తున్నాయో వాస్తవ పరిస్థితులు తపరిశీలిస్తే అర్థమవుతుంది.

కర్ణాటకలోని బెంగుళూరులో, తమిళనాడులో, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వద్దవున్న బ్రాండిక్స్ కంపెనీలలోని మహిళా కార్మికులపై నమ్మశక్యంగాని దారుణమైన పని పరిస్థితుల మధ్య కర్కశంగా, అమానవీయ పద్ధతుల్లో శ్రమదోపిడి జరుగుతోంది. ఇది దుస్తుల తయారీ, వస్త్ర పరిశ్రమల్లో మహిళా కార్మికుల దుస్థితి. మహిళా కార్మికుల శ్రమదోపిడీద్వారా ఈ రంగంలోని యజమానులు అత్యధిక లాభాలు ఆర్జిస్తున్నారు.

ఈ మహిళా కార్మికులకు సంఘాలలో జేరడానికిగానీ, సంఘాలుగా ఏర్పడడానికిగానీ అనుమతిలేదు. ప్రభుత్వాల అంగీకారంవల్ల, చూసీచూడనట్లుపోయే విధానాలవల్ల వీరు రాత్రి సమయాల్లో కూడా పనిచేయవలసి వస్తోంది. రోజుకు 10 గంటలపైగా పనిచేసే పరిస్థితికి నెట్టబడుతున్నారు. అవసరార్థం కాలకృత్యాలు తీర్చుకునే స్వేచ్ఛకూడా లేదు. పై అధికారులు వీరిని వివిధ రూపాల్లో వేధింపులకు గురి చేస్తుంటారు. మేనేజర్లు మహిళలపై దౌర్జన్యాలు చేస్తుంటారు. బెంగుళూరులోని టెక్స్‌పోర్టు దుస్తుల తయారీ పరిశ్రమ ఎల్‌ఎల్‌పి ఫోర్తు స్టేజిలో జరిగిన దౌర్జన్యాన్ని ఈ పరిస్థితులకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. పని ప్రదేశాలకు దగ్గరలో ఈ మహిళలకు వసతి సౌకర్యం కల్పించరు. దీనివల్ల ప్రతిరోజు వారు ఎక్కువ సమయం పనికి వచ్చి వెళ్ళడానికే కేటాయించ వలసివస్తోంది. దీనికితోడు ప్రభుత్వ రవాణా వ్యవస్థ లేకపోవడంతో ప్రైవేటు వాహనాలపై ఎక్కువ మొత్తాలను ఖర్చుపెట్టవలసి వస్తోంది. వారి కొస్తున్న కొద్దిపాటి జీతాల్లో యిదొక అదనపు వ్యయం. మరోవైపు బలవంతంగా వీరితో ఓవర్‌టైం చేయిస్తారు. దీనికి సాధారణ కూలీనే యిస్తారు. సెలవులు వుండవు. పనిభారాన్ని క్రమంగా పెంచుతుంటారు. పనిభారం పెరిగినా వేతనం పెరగదు. మొదట్లో గంటకు 25 నుండి 35 పీసులు కుట్టేవారు. అది ఇప్పుడు 70 కుడ్తున్నా సరిపోవడంలేదు. యజమానులు నిర్ణయించిన లక్ష్యాలు పూర్తి చేయకపోతే చివాట్లు, వేధింపులు భరించ వలసివస్తోంది.

'ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన' మరియు స్కిల్ ఇండియాలాంటి కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకాల క్రింద జార్ఖండ్, ఒడిశా, అస్సాం, మధ్యప్రదేశ్‌లాంటి తూర్పు, ఉత్తర రాష్ట్రాలనుండి నవయువతులను తీసుకు వస్తున్నారు. ఊరుకాని ఊరు; పైగా మహిళలు. వలస మహిళల ఈ నిస్సహాయ పరిస్థితిని ఆసరా చేసుకొని ఈ పరిశ్రమల్లో తక్కువ వేతనాలు యిస్తున్నారు. స్థానిక మహిళలకు కూడా తక్కువ వేతనాలే. తక్కువ వేతనాలు, అవీ సకాలంలో యివ్వకపోవడం, శారీరక, మానసిక వేధింపులతో దుస్తుల తయారీ పరిశ్రమ మహిళా కార్మికులను పీడిస్తోంది.

పైన పేర్కొన్న పద్ధతులలో మహిళా కార్మికులను పీడించడం, అమానవీయ దోపిడీ చేయడంతో పరిశ్రమ సరిపెట్టుకోవడంలేదు.

తమిళనాడు దుస్తుల తయారీ పరిశ్రమలో ఇటీవల సర్వే చేసిన థాంసన్ రీటర్స్ ఫౌండేషన్, యజమానులు అనుసరిస్తున్న ఒక కొత్త దుష్ట విధానాన్ని బయటపెట్టింది. మహిళా కార్మికుల బహిష్టు సందర్భాలలో పనిమానెయ్యకుండా వుండడానికి, వీరికి బహిష్టు నొప్పులు లేకుండా కొన్ని మందులను వాడేవిధంగా ఒత్తిడి చేస్తున్నారు. అవి ఏ మందులో వాటిమీద పేర్లు కూడా వుండవు. ఈ మందులు వివిధ ఆరోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. ఈవిధంగా దుస్తుల తయారీ పరిశ్రమ మహిళల శ్రామిక శక్తిని దోపిడీ చేయడంలో ఒక దుర్మార్గమైన పరిశ్రమగా మారింది.

దుస్తుల తయారీ రంగంలో మహిళా కార్మికుల దోపిడీ ఈవిధంగా వుంటే మహారాష్ట్రలో వ్యవసాయరంగంలో అనుసరిస్తున్న మనసు కలచివేసే, అన్యాయమైన దుష్టభ్యూడల్ విధానాలు వెలుగులోకి వచ్చాయి.

బహిష్టు సమయాల్లో రెండు మూడు రోజులపాటు మహిళా కార్మికులు ఇతర రోజుల్లో లాగా ఆ స్థాయిలో కష్టపడి పనిచెయ్యలేక పోవడమనేది సహజం. ఈవిధంగా పూర్తి స్థాయిలో పనిచెయ్య లేకపోవడంవల్ల భూ యజమానులకు కొంత నష్టం కలిగే అవకాశం వుంది. అందువల్ల మహారాష్ట్ర భూయజమానులు బహిష్టులయ్యే వయస్సులో వున్న వారిని కాకుండా గర్భాశయ తొలగింపు (హిస్టరెక్టమీ) ఆపరేషన్లు చేయించుకున్న వారిని పనిలో పెట్టుకుంటున్నారు. **(తరువాయి 12వ పేజీలో)**

నీతిబాహ్య పద్ధతుల్లో విస్తరణకు పాల్పడుతున్న వాల్‌మార్ట్ కార్పొరేషన్

కార్పొరేట్ యాజమాన్యాలు తరచుగా 'కార్పొరేట్ నీతి సూత్రాలు' 'కార్పొరేట్ సామాజిక బాధ్యత'ల వంటి నినాదాలను తమ గొప్ప సుగుణాలుగా అభివర్ణించుకుంటూ వుంటాయి. ఈ యాజమాన్యాలు అందించే 'సేవలకు', తయారుచేసే సరుకులకు వినియోగదారులుగా వున్న ప్రజానీకం ఎదుట, బడాపెట్టుబడిదారీ వర్గానికి చెందిన ఈ బడా బహుళజాతి కార్పొరేషన్ కంపెనీలు తమను స్వచ్ఛశీలురుగా, నీతిమంతులుగానూ, తాము న్యాయంగా వ్యవహరిస్తున్నామని చూపెట్టు కోవటానికి, ఆవిధంగా వారిని వంచించటానికి ఉద్దేశించినవే ఈ బడాయి నినాదాలన్నీ.

అయితే, ఆచరణలో తమ సూపర్ లాభార్జనా వేటలో ఈ బహుళజాతి కంపెనీలన్నీ అంతులేని నీతిబాహ్య విధానాలకు పాల్పడుతూ వస్తున్నాయి.

ప్రపంచంలోని బహుళజాతి పరిశ్రమలలో వాల్‌మార్ట్ పేరుమోసిన అతిపెద్ద కంపెనీ. ఇది తనవద్ద పనిచేసే కార్మికుల శ్రమశక్తిని వివిధ రూపాల్లో దోపిడీ చేసుకోవటంతోపాటు, తనకు ఆహార ఉత్పత్తులను, పంట ధాన్యాలను సరఫరా చేసే వివిధ దేశాలలోని వారందరికీ అతి తక్కువ ధరలను చెల్లిస్తోంది. మరోవైపున ఈ సరుకుల కొనుగోలుదారుల (వినియోగదారుల) నుండి అధిక ధరలను పిండుకుంటోంది. అంతేగాక, ఇది వివిధ దేశాలలోకి చొరబడటానికి ఆయా దేశాల ప్రభుత్వాధినేతలనుండి, ఉన్నతాధికారుల నుండి అనుమతులు సంపాదించటానికి (తన సరుకుల అమ్మకానికి, స్థానిక సరుకులను పెద్దమొత్తంలో కొనుగోలు చేయటానికి, శ్రామికులను నియమించుకోవటానికి మొ॥) లంచాలకు పాల్పడుతోంది. మధ్యదళారీల ద్వారా అనుమతులు పొందడానికి వాల్‌మార్ట్ యాజమాన్యం లంచాలు ఇవ్వటానికి ఏవిధంగా పాల్పడుతోందో తెలిపే ఉదంతమొకటి ఇటీవలే వెల్లడైంది.

వాల్‌మార్ట్ కంపెనీ ప్రపంచంలోని వివిధ దేశాలలో తన మార్కెట్లను తెరుచుకునేందుకు దశాబ్దకాలం పైగా నుండి దళారీలను వినియోగించి అవినీతికర, అక్రమపద్ధతులకు పాల్పడుతోంది. బ్రెజిల్‌లోని వాల్‌మార్ట్ కార్పొరేషన్ కార్యాలయంలోపల, వివిధ దేశాలలో సులభంగా, వేగంగా ప్రభుత్వ అనుమతులను పొందేందుకు 'సోర్సెరెస్' అని పిలవబడే శాఖ వుంది.

'ప్రభుత్వంతో సంబంధాలు-సంప్రదింపుల సేవల' పేరిట వాల్‌మార్ట్ సంస్థ చైనాలో స్థానికుడైన ఓ భూస్వామికి కొంత డబ్బును లంచంగా అందజేసింది. అలాగే మెక్సికోలో తాను నూతనంగా తన మార్కెట్లను తెరవాలనుకుంటున్న ప్రాంతాలలోని ప్రభుత్వ అధినేతలు, ప్రభుత్వశాఖాధిపతులకు కంప్యూటర్లు, కార్లను బహుమతులుగా అందజేసింది. మనదేశంలో లంచాలు అందజేయడం, 'చట్ట విరుద్ధంగా పరోక్ష' రూపంలో చేసింది. 'మిస్‌లేనియస్ (ఇతరములు)' 'వృత్తి నిర్వహణ రుసుము', 'యాదృచ్ఛికము', 'ప్రభుత్వ రుసుం' మొదలైన అస్పష్ట వర్ణనలతో సంయుక్త భాగస్వామ్య పుస్తకాలలో, రికార్డులలో నమోదుచేయటమనే రూపంలో ఇక్కడ లంచాలను అందించింది.

2012 సం॥లో 'ది న్యూయార్క్ టైమ్స్' పత్రిక-మెక్సికో నగరంలోని అధికారులకు వాల్‌మార్ట్ యాజమాన్యం అనుమానాస్పదమైన చెల్లింపులు చేసిందని, కంపెనీ కేంద్ర కార్యాలయంలోని ఉన్నతస్థాయి అధికారులకు తెలియకుండా దాచే ప్రయత్నం చేసిందని వెల్లడించింది. ఈ అంశంపై అమెరికాకు చెందిన న్యాయశాఖ మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజి కమీషన్‌లు దర్యాప్తు ప్రారంభించాయి.

ఈవిధమైన నీతిబాహ్య పద్ధతులలో ప్రపంచంలో తన మార్కెట్లను విస్తరించటం ద్వారా 2018 ఆర్థిక సంవత్సరంలో వాల్‌మార్ట్ సంస్థ 700 కోట్ల డాలర్ల లాభాలను గడించింది. అమెరికా ప్రభుత్వం చేసిన దర్యాప్తులో వాల్‌మార్ట్‌పై సివిల్, క్రిమినల్ ఆరోపణలు న్యాయమైనవేనని, వాల్‌మార్ట్ దోషి అని రుజువైంది. కానీ వాల్‌మార్ట్ యాజమాన్యం ఈ నిర్ధారణలను తోసిపుచ్చింది. అమెరికా న్యాయ చట్టాలననుసరించి తాను సవ్యంగా పని చేస్తున్నానని బూకరించింది. న్యాయస్థానంలో తనపక్షాన వాదించే న్యాయవాదులకు, తదనుగుణమైన కార్యకలాపాలకు వాల్‌మార్ట్ సంస్థ షుమారు 90 కోట్ల డాలర్లను ఖర్చుచేసింది.

సరుకులు తనవద్ద 'చౌకధరలకు లభిస్తాయనే' నినాదంతో త్వరత్వరగా తన మార్కెట్లను విస్తరింపజేసుకునే ప్రయత్నంలో, ఈ నీతి బాహ్యమైన పద్ధతులకు, అవినీతికి లంచాలు ఇచ్చేదానికి పాల్పడింది.

"వాల్‌మార్ట్ సవ్యమైన పద్ధతుల్లో వ్యాపారం చేయటానికి కట్టుబడి వుంది. అంటే దాని అర్థం, మార్కెట్లను విస్తరించిన అన్ని ప్రాంతాలలో సవ్యంగా, సరైన పద్ధతుల్లో వ్యవహరిస్తూ వస్తున్నాము" అని ఒకవైపున వాల్‌మార్ట్ యాజమాన్యం ప్రకటించుకుంటూనే, మరోవైపున పైన పేర్కొన్న అవినీతికర, నీతి బాహ్య విధానాలతో అది సూపర్ లాభాలను గడిస్తోంది.

వాల్‌మార్ట్ తన తప్పిదం లేదని ఎంతగా వాదించినప్పటికీ, సివిల్, క్రిమినల్ ఆరోపణలతో దోషిగా రుజువై, ఇక తప్పించుకునే మార్గం లేక, 28 కోట్ల 20 లక్షల డాలర్లను పరిష్కారంగా చెల్లించటానికి సిద్ధపడింది. ఇది చెల్లించకుంటే 60 కోట్ల డాలర్లను జరిమానాగా చెల్లించవలసి వచ్చేది.

వివిధ న్యాయవ్యవస్థలు, రాజకీయ సంస్కృతులుగల ప్రపంచదేశాలలోకి విస్తరించటం ద్వారా లాభాలను రెట్టింపు చేసుకోవాలనుకుంటున్న అమెరికా బహుళజాతి కార్పొరేషన్‌ల దుర్మార్గాలను, పై కేసు బాగా వెల్లడి చేస్తోంది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో పైకి ఎంత గొప్పగా, బడాయిగా మాటలు చెప్పినప్పటికీ, మానవజాతిని, నీతిబాహ్యంగా దోచుకుని, మోసగించే లక్షణం ఆ వ్యవస్థలోనే వుంది. పెట్టుబడిదారీవ్యవస్థ వర్గస్వభావం దోపిడీనే. ✸

(11వ పేజీ తరువాయి)

దీనివల్ల గర్భం దాల్చిన వ్యవసాయ మహిళా కార్మికులు పొలంపనుల్లో మనకు కన్పించరు. హజ్‌పూర్, దాని పరిసర గ్రామాల్లో గర్భవతులవడానికి అవకాశముండే 25 సం॥ల లోపు పనిచేసే అమ్మాయిలు ఈ పనుల్లో కన్పించరు. ఇంకా ఆశ్చర్య చకితులనుచేసే విషయమేమిటంటే అక్కడి భూయజమానులు గర్భాశయ తొలగింపు ఆపరేషన్లు చేయించుకోడానికి నవ యువతులకు అడ్వాన్సులు యిస్తున్నారు. ఎందుకంటే వీరిని తమ పొలం పనుల్లో పెట్టుకోవడానికి!

సిగ్గుమాలిన వాస్తవమేమంటే భూయజమానులు శస్త్ర చికిత్సవల్ల బహిష్టు అవకాశంలేని మహిళలను, తమ లైంగిక వాంఛ తీర్చే మహిళలను మాత్రమే తమ పనుల్లో పెట్టుకుంటున్నారు. మహారాష్ట్రలోని బీడ్‌జిల్లాలో మొదలైన ఈ జాడ్యం రాష్ట్రమంతా వ్యాపించింది.

ప్రస్తుతం ఈ దుష్టవిధానం భారతదేశంలోని యితర రాష్ట్రాలకు కూడా వ్యాపించే ప్రమాదం ముంచుకొస్తుంది.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణయొక్క నయా ఉదారవాద ఆర్థిక విధానాల నీడలో మన దేశంలో అనుసరింపబడ్తున్న ఈ విధానాలు-మహిళా కార్మికులకు సాధికారికతను కల్పిస్తున్న తీరు ఏవిధంగా వుందో వెల్లడిచేస్తున్నాయి. ✸

నీగ్రోల భూములను దుర్మార్గంగా కబళించిన అమెరికా దేశ పెట్టుబడిదారీ వ్యవస్థ

ఒకనాడు మంచులాంటి తెల్లటి కింగ్ కాటన్ పత్తి తోటలతో నిండివుండే అమెరికా దేశంలోని మిసిసిపి డెల్టా ప్రాంతమంతా యిప్పుడు పచ్చటి సోయాబీన్ తోటలతో నిండి పోయింది. ఇప్పుడు తోటలూ, పంటక్షేత్రాలూ– భారీ పారిశ్రామిక పంట క్షేత్రాలుగా, చాలా ఎక్కువ విస్తీర్ణం గల భూముల్లో నిర్వహింపబడు తున్నాయి. ఇప్పుడు యీ పంటపొలాల్లో జన్యుమార్పిడి పంటలు పండిస్తున్నారు. లేసర్ కిరణాల దర్శకత్వంలో నడిచే ట్రాక్టర్లను వ్యవసాయ పనులలో వాడుతున్నారు. డ్రోన్ ద్వారా పంటలపై క్రిమిసంహారక మందులు జల్లుతున్నారు. అతి తక్కువ క్షేత్రాలకు మాత్రమే రైతులు భూస్వంతదారులుగా మిగిలి వున్నారు. ఈ సంఖ్య కూడా (భూ యజమానులైన రైతుల) రోజురోజుకీ తగ్గిపోతోంది. పెద్దపెద్ద కార్పొరేటు సంస్థలు వేల ఎకరాల సారవంతమైన డెల్టా భూములను కొనుగోలుచేసి మెగా వ్యవసాయ క్షేత్రాలను నిర్వహిస్తున్నాయి. ఒకప్పుడు నల్లజాతి నీగ్రో రైతులు మెజారిటీ సంఖ్యలో యీ ప్రాంతంలోని భూముల్లో పంటలు పండిస్తూ వుండగా, గత 20 సంవత్సరాల నుండీ వ్యాపారస్తులైన పెట్టుబడిదారులు, హెడ్జి – ఫండ్ మేనేజర్లు, అగ్రి బిజినెస్ సలహా నిపుణులు యీ ప్రాంతంలో పెత్తనం చేస్తూ, వ్యవసాయ క్షేత్రాలను నిర్వహిస్తున్నారు.

దక్షిణ అమెరికా రాష్ట్రాలలోని భూమి అంతా మూలవాసులైన రెడ్ యిండియన్ తెగలవారిది. వారిని బలవంతంగా తరిమివేసి వారి భూమిని అక్కడకు వలసవచ్చిన తెల్లవారు స్వాధీనం చేసుకొన్నారు. ఆ భూమినంతా బానిసలుగా తేబడ్డ నీగ్రోల శ్రమతో – అడవులను నరికించి, నీటిని పోయించి, పంట భూములుగా, ఉత్పత్తిదాయకమైన సారం కల వ్యవసాయ భూములుగా మలిచారు.

నీగ్రో బానిసల విముక్తి అనంతరం అంతర్యుద్ధకాలం అనంతరం, ప్రతీ ఒక్కరికి (నీగ్రోలకు) 40 ఎకరాల సాగుక్షేత్రం యిస్తారనే వాగ్దానం వలన, స్వేచ్ఛా నీగ్రోలు తాము కష్టపడి సంపాదించిన మొత్తాలతో కౌలురైతులుగా పనిచేసే యీ ప్రాంతంలో భూములను పొంది స్వంతదారులయ్యారు. అనేక సందర్భాలలో బీడు భూముల్ని సహితం స్వంతపరచుకొని వాటిని తమ శ్రమశక్తిని వెచ్చించి పంట పొలాలుగా మలచుకొన్నారు. తమకంటూ స్వంత యింటి ఆవరణాలను ఏర్పరచుకొన్నారు. అమెరికా వ్యవసాయశాఖ వారి లెక్క ప్రకారం, 1910 సంవత్సరం నాటికి, మిసిసిపీ ప్రాంతంలో నల్లజాతివారైన నీగ్రోల చేతిలో 22 లక్షల ఎకరాల భూమి వుంది. 25,000 మంది నల్లజాతి (నీగ్రో) రైతులు యీ భూముల్లో సేద్యం చేసుకొంటున్నారు.

అయితే, క్రమక్రమంగా, వివిధ అమెరికన్ పెట్టుబడిదారీ ప్రభుత్వ విధానాల వలన చరిత్రకారుడు పీటెడానియల్ ప్రకారం 1950 సంవత్సరం అనంతర 25 సంవత్సరాల కాలంలో నీగ్రోలు స్వంతదారులైన 5 లక్షల ఎకరాల వ్యవసాయ క్షేత్రాలు వారి చేతినుండి బయటకు వెళ్ళిపోయాయి. "ఎమర్జెన్సీ ఫండ్" అనే గ్రూపు (నీగ్రోల భూబేదఖల్ సమస్యలపై పోరాడటానికి ఏర్పడిన ఒక సంస్థ) యొక్క అధ్యక్షుని అంచనా ప్రకారం 1950 నుండి 1969 మధ్యకాలంలో నల్లజాతి (నీగ్రో) రైతుల నుండి 60 లక్షల ఎకరాల భూమి బేదఖల్ చేయబడింది. ఒక్క 1960 సంవత్సరంలోనే నల్లరైతుల స్వంతమైన 87,000 ప్రత్తి క్షేత్రాలు కేవలం 3000కు తగ్గిపోయాయి. వ్యవసాయశాఖ గణాంకాల ప్రకారం 1950 నుండి 1964 మధ్యకాలంలో, మిసిసిపీ ప్రాంతపు నల్ల (నీగ్రో) రైతులు సుమారు 8,00,000 ఎకరాలను కోల్పోయారు.

ఫెడరల్ (అమెరికన్) పెట్టుబడిదారీ ప్రభుత్వం అవలంబించి, కొనసాగించిన విధానాలే యీ దారుణ 'భూ దోపిడీ'ని సృష్టించాయి. దేశమంతటా కలిపి మొత్తంగా ఒక లక్ష నీగ్రో రైతు కుటుంబాల నుండి వారి పంటపొలాలు లాగేసుకున్నారు. క్రమక్రమంగా నీగ్రో రైతులు తమ పంటపొలాల నుండి తొలగింపబడటంతో చికాగో, డెట్రాయిట్ తదితర నగరాలకు పోయి అక్కడి పరిశ్రమల్లో కూలీలుగా (శ్రామికులుగా) చేరిపోయారు.

1937లో దేశాధ్యక్షుడు ఫ్రాంక్లిన్.డి. రూజ్‌వెల్టు చేబట్టిన నూతన వ్యవసాయిక విధానం అన్నది, 'వ్యవసాయ క్షేత్రాల భద్రతా నిర్వహణ' అనే ఏజెన్సీ ఏర్పాటుకు దారితీసింది. ఈ సంస్థ (ఎఫ్.ఎస్.ఎ) దేశంలోని చిన్న రైతులకు సహాయం అందించటం కోసం ఏర్పాటు చేశారు. ఇతర "నూతన విధానాలు" అమలులో జరిగినట్లుగానే, యీ ఏజెన్సీ నిర్వహణలో కూడా, తెల్లజాతివారైన అధికారులు నల్లజాతి నీగ్రో రైతులను పట్టించు కోకపోవటమే కాక, వారినే లక్ష్యం చేసుకొని పని చేశారు. వారికి ఈ సంస్థ రుణాలు యివ్వటానికి నిరాకరించింది. అదేరకంగా పొలాలను నీగ్రో రైతులకు కౌలుకు యివ్వకుండా, తెల్లజాతి రైతులకే యిచ్చింది. 1945లో యీ సంస్థ రైతుల అంతర్గత వ్యవహారాల నిర్ణయశాఖ (ఎఫ్.హెచ్.ఎ)గా రూపాంతరం చెందింది. చిన్న రైతులకు సహాయపడే కార్యక్రమాలు నిర్వహించాల్సిన యీ సంస్థ, అమెరికన్ వ్యవసాయశాఖ నేడు అమలుజరుపుతున్న "అప్పులు – సబ్సిడీ" విధానాలను చేపట్టేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను నాడే అమలుజరిపింది. 1965లో దేశాధ్యక్షుడు జె.ఎఫ్.కెన్నడీ ప్రభుత్వం వ్యవసాయ స్థిరీకరణ – పరిరక్షణ సేవల సంస్థ (ఎ.ఎస్.సి.ఎస్) అనే రైతులకు అప్పులు యిచ్చే ఎఫ్.హెచ్.ఎస్.కు సహాయకారిగా వుండే మరొక సంస్థను స్థాపించింది. ఇది వ్యవసాయశాఖలో అంతర్భాగంగా వుండే ఫెడరల్ సంస్థ. కానీ యీ సంస్థలో అప్పులు మంజూరుచేసే, రైతులకు అప్పులు యిచ్చే కీలకమైన కమిటీలలోని సభ్యులను స్థానికంగా ఎన్నుకొనేవారు. ఆ ఎన్నికలలో నల్లజాతి నీగ్రోలకు ఓటుహక్కు నిషేధింపబడింది. అంటే తెల్లజాతి వారు మాత్రమే కమిటీ మెంబర్లుగా ఎన్నికవుతారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా అమెరికా దేశపు వ్యవసాయశాఖ మిసిసిపీ డెల్టా ప్రాంతాల్లాంటి ప్రాంతాల్లో వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు భద్రతా జాలంగా వ్యవసాయ ధరలను నిర్ణయించే, వ్యవసాయంలో ప్రధాన పెట్టుబడిదారుడిగా వుండే, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను నియంత్రించే ఏకైక సంస్థగా రూపొందించబడింది. ఈ రకంగా

ఒక "వ్యవసాయ ప్రభుత్వం" ఏర్పాటు చేయబడింది.

ఇలా ఏర్పాటు చేయబడ్డ "వ్యవసాయ ప్రభుత్వం" వలన పెద్దపెద్ద వ్యవసాయ పంటల కర్మాగారాలు పుట్టుకు వచ్చాయి. చిన్న చిన్న వ్యవసాయ క్షేత్రాలు కుప్పకూలిపోయాయి. ఈ "వ్యవసాయ ప్రభుత్వ" నాయకులు తెల్లజాతివారే కావటంతో నల్లజాతి నీగ్రోలను తమవైన స్వంత వ్యవసాయ క్షేత్రాల నుండి వెళ్ళగొట్టారు.

ఈ సంస్థ యిచ్చే రుణాల పథకాల ద్వారా చట్టవిరుద్ధమైన ఒత్తిళ్ళు పెంచి, నీగ్రో రైతుల సంపదను తెల్లజాతి సంపన్నులు దోచుకున్నారు. ఫెడరల్ ప్రభుత్వం రైతులకు పెట్టిన పెట్టుబడుల్లో నల్లజాతి వ్యతిరేక వైఖరులు (దక్షిణాది రాష్ట్రాలలో) వెల్లడయ్యాయి. ఎఫ్.ఎం.హెచ్.ఎ. సంస్థ చిన్న, మధ్యతరగతి తెల్లజాతి రైతులకైతే భారీఎత్తు మొత్తాల్లో రుణాలు యిచ్చింది. కానీ అదే స్థాయి నీగ్రో రైతులకు మాత్రం తక్కువ మొత్తాల్లో రుణాలు యిచ్చే జాతి వివక్షతా విధానాలు-నీగ్రోజాతి రైతులను పేదరికంలోకి నెట్టడానికి, వారిని భూముల నుండి తొలగించ టానికి కారణమయ్యాయి.

ఆ వ్యవసాయక సంస్థల్లో నీగ్రో రైతులకు కూడా ఓటుహక్కు యివ్వాలని ఆందోళనలు చేపట్టిన వారికి, ఆందోళనలో పాల్గొన్న వారికి (నీగ్రో రైతులకు) ఆ సంస్థలు కానీ, బ్యాంకులు కానీ రుణాలను మంజూరు చెయ్యటంలో అనేక చిక్కులు కల్పించాయి. 2001లో అసోసియేటెడ్ ప్రెస్ చేపట్టిన ఒక పరిశోధనలో "1950 నుండి 1960 మధ్య కాలంలో హోమ్స్ కౌంటీ (జిల్లా)లో ట్రక్కులు, భారీ వ్యవసాయ పరికరాలు అమ్మే నార్మన్ విధర్‌బే అనే వ్యక్తి, స్థానిక ఎఫ్.ఎం.హెచ్.ఎ (రుణాలు యిచ్చే సంస్థ) యొక్క ఏజెంటు అయిన విలియం స్ట్రైడర్‌తో కుమ్మక్కయి వారికి రుణాలు చాలా ఆలస్యంగా అందేటట్లు చేయించి, అందువలన తాము అప్పుపై కొనుగోలుచేసిన వ్యవసాయ పరికరాలకు నీగ్రో రైతులు వాయిదాలు చెల్లించలేని స్థితికి తీసుకు వచ్చి, ఆ అప్పుల క్రింద నీగ్రో రైతుల భూములను జప్తు చేసుకొన్న 100 కేసుల వివరాలు" బయల్పడ్డాయి.

చట్టవిరుద్ధమైన ఒత్తిడులు, రాష్ట్రాల పథకాలలో తీవ్రమైన జాతి వివక్ష, స్పెక్యులేటర్ల, న్యాయవాదుల మోసాలు, ప్రవేటు అప్పులు యివ్వనిరాకరణ, లేదా ప్రత్యక్షమైన హింస, వేధింపుల ద్వారా చట్ట వ్యవస్థలు నీగ్రోరైతుల భూములను పన్నుల చెల్లింపు కోసం అమ్ముకొనేటట్లు, భూ విభజన అమ్మకాలు చేసేటట్లు, లేదా అప్పులు చెల్లించలేక తాము తనఖా పెట్టిన భూములను కోల్పోయేటట్లు చేశాయి. నల్లజాతి నీగ్రో రైతులకు న్యాయసేవలు అందుబాటులో లేకపోవటం, సంక్లిష్టమయిన వారసత్వ హక్కుల వలన నీగ్రో రైతుల కుటుంబాల వారు తమ వారసత్వపు హక్కులను పొందలేక భూములను కోల్పోయారు. మూక దాడులు, పోలీసుల అమానుషత్వం, యితర రూపాల్లో వేధింపుల కారణంగా కూడా అనేక మంది రైతులు తమ భూములను వదులుకొని పారిపోక తప్పలేదు. ఎ.ఎస్.సి.ఎస్. ఎన్నికలలో చురుకుగా వ్యవహరించిన నీగ్రోల యిన్సూరెన్స్‌లు రద్దుచేశారు. ఒక్క పత్తిపంటపై తప్ప యితర పంటలపై నీగ్రో రైతులకు రుణాలు నిరాకరించారు. భూ స్వంతదారులలో, సహ స్వంతదారులుగా వున్న నీగ్రో రైతుల భార్యలకు బ్యాలట్ పత్రాలు (రుణసంస్థల కమిటీ సభ్యుల ఎన్నికలకు) పంపకుండా నిలువరించారు. ఈ రకంగా 1965లో ఓటింగ్ హక్కుల చట్టం చేసినా, నీగ్రో రైతులను ఓటు వేయకుండా నిరోధించారు. తీరా మిసిసిపీ ప్రాంతంలో నీగ్రో రైతులు ఓటుహక్కును పొందేనాటికి వారి సంఖ్య మైనార్టీస్థాయికి కుదించుకుపోయింది. తెల్లజాతి రైతుల సంఖ్య మెజార్టీ స్థాయికి చేరుకొంది. ఆరకంగా నీగ్రో రైతులు తమ స్వంత భూములపై హక్కులు కోల్పోయి, భూమిని 'పోగొట్టు' కొన్నారు.

వివిధ పద్ధతుల ద్వారా, కొన్నిసార్లు చట్ట బద్ధంగా, తరచుగా బలవంతంగా, అప్పుడప్పుడు హింస ద్వారా, నల్లజాతి నీగ్రో రైతుల చేతుల్లో వున్న భూమి తెల్లజాతి సంపన్నుల స్వంత మయింది. తర్వాత ఆ భూమి పెద్దపెద్ద వ్యవసాయ క్షేత్రాలుగా పరిణామం పొంది; అంతిమంగా వాల్‌స్ట్రీట్‌కు చెందిన బడా ఇన్వెస్టుమెంటు కార్పొరేషన్ల బడా పారిశ్రామిక వ్యవసాయ క్షేత్రాలుగా రూపొందింది.

రెండు, మూడు తరాలకు పూర్వం యీ డెల్టా ప్రాంతంలో నివసిస్తూ, తమ పొలాల్లో పనిచేసుకొంటూ జీవిస్తున్న నీగ్రోలను ఆ భూములనుండి తొలగించారు. ఆ స్థానంలో మెగా వ్యవసాయ క్షేత్రాలను నిర్వహిస్తున్న బడా కంపెనీలు వచ్చాయి. ఒక్క మిసిసిపీ ప్రాంతం లోనే ఉపాధ్యాయుల పెన్షన్ ఫండ్లను నిర్వహించే సంస్థ అయిన టి.ఐ.ఎ.ఎ. తన అనుబంధ సంస్థలతో కలిపి 80,000 ఎ కరాలకు స్వంతదారయింది. ఆర్కన్సాస్‌లో యీ సంస్థ మిసిసిపీ నది ఒడ్డున 50,000 ఎకరాల భూ ఖండానికి స్వంతదారయింది. డెల్టా రాష్ట్రాలలో టి.ఐ.ఎ.ఎ.తోపాటు మరికొన్ని బడా కార్పొరేటు సంస్థలు కూడా భూస్వాములుగా వున్నాయి. హాన్‌కాక్ వ్యవసాయ పెట్టుబడి గ్రూపుకు యిక్కడ 65,000 ఎకరాలున్నాయి. ఫార్మ్‌లేండ్స్ పార్టనర్స్ అనే రియల్‌ఎస్టేట్ ట్రస్టుకు 30,000 ఎకరాలున్నాయి. అగ్రివెస్ట్ అనే స్విస్ బ్యాంక్ యొక్క అనుబంధ కార్పొరేషన్‌కు 22,000 ఎకరాలున్నాయి.

భారీఎత్తు పెట్టుబడులను కలిగివున్న సంస్థలు చిన్నచిన్న సంస్థలను, స్థానిక రైతులను మించి భూ కొనుగోళ్ళు జరపగలిగిన ఆర్థిక స్థోమతతో వుండటం వలన, అవి విస్తీర్ణమైన భూఖండాలను కొనుగోలు చేయగలిగిన శక్తినేకాక, ఆ మెగా క్షేత్రాలను తరతరాలబాటు తమ స్వాధీనంలో వుంచుకోగలిగిన శక్తిని కలిగి వున్నాయి. అమెరికన్ పెట్టుబడిదారీవిధానం, యిటువంటి బడా భూఖండాలను, మెగా వ్యవసాయ క్షేత్రాలను అతిపెద్ద కార్పొరేషన్ల వశం చేసుకొని, స్వంతదారులుగా వుండేందుకు అనువైన విధానాలను అమలుజరపటంవల్లనే, ఆ దేశంలోని నల్లజాతి నీగ్రో రైతాంగం తమ స్వంతమైన భూముల నుండి చట్టబద్ధంగానే వెళ్ళగొట్టబడ్డారని అర్థమవుతోంది.

భూమి, మానవజాతి మనుగడకు మాత్రమే కాక, సంపదను సృష్టించి, పెంపొందింపజేసే మౌలికమైన, ప్రధానమైన వనరుగా వుంది. వివిధ సామాజిక వ్యవస్థల్లో యిది పాలకవర్గాల అధీనంలోనే వుంటూ, పాలితవర్గాల ప్రజల శ్రమశక్తి ద్వారా అదనపు సంపద సృష్టింపబడి ఆయా దోపిడీ పాలకవర్గాల వశంలోనే వుంటోంది.

ఈ భూ వనరు నుండి పెంపొందింపబడే – సృష్టించబడే సంపద ప్రజలందరికీ పంచబడా లంటే, ఈ సంపదను తమ శ్రమశక్తి ద్వారా పెంపొందించి, సృష్టించే శ్రామికవర్గాల, ప్రజల అధికారంలోని పాలనా వ్యవస్థ ఏర్పడటం తప్పనిసరి అనే విషయాన్ని అమెరికా దేశపు నీగ్రో రైతులు తమ స్వంత భూములను కోల్పోయిన అనుభవం స్పష్టం చేస్తోంది. అటువంటి పాలనా వ్యవస్థే నిజమయిన ప్రజాస్వామ్య పాలన అవుతుంది లేకుంటే ప్రస్తుతం అమెరికా దేశంలో సాగే బూటకపు ప్రజాస్వామ్య పాలనగానే మిగిలిపోతుంది!

('ది అట్లాంటిక్ డైలీ' పత్రికలో వాన్ ఆర్ న్యూకిర్క్ 11 వ్రాసిన వ్యాసం ఆధారంగా) ★

పొంచివున్న జన్యుమార్పిడి ఆహార ముప్పు

హర్యానా రాష్ట్రంలోని ఫతేబాద్‌జిల్లా పాటియా ప్రాంతంలో కొందరు రైతులు జన్యుమార్పిడి వంకాయలను పండిస్తున్నట్లు, అయితే వారు పండిస్తున్నవి జన్యుమార్పిడి వంగడాలన్న విషయమే ఆ రైతులకు తెలియదనే విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. వీరు స్థానిక నారు వ్యాపారుల వద్దనుండే ఈ నారును (మొక్కలను) కొనుగోలు చేశారు.

మనదేశంలో జన్యుమార్పిడి ఆహార పంటపై 2020 ఫిబ్రవరి వరకు నిషేధం వుంది. జన్యుమార్పిడి పంటలు పండించడానికిగానీ, విత్తనాలు లేక నారును మార్కెట్లో అమ్మడానికిగాని అనుమతిలేదు. కాని ఈ జన్యుమార్పిడి నారు అనధికారికంగా, చట్ట వ్యతిరేకంగా మన దేశంలోకి ప్రవేశించింది. అమాయక రైతులకు దీనిని అమ్ముతున్నారు. ఫలితంగా జన్యుమార్పిడి వంకాయలు దేశంలోకి ప్రవేశపెట్టబడి మార్కెట్లో అమ్మకాలు జరుగుతున్నాయి.

మహికో సంస్థ ఇలా చేస్తున్నది. గుత్త బహుళజాతి మోన్‌శాంటో అధీన సంస్థ, జన్యు మార్పిడి వంకాయల ఉత్పత్తిదారు మోన్‌శాంటో భారత దేశంలో వీటిని అనుమతించలేదు కాబట్టి వీటిని పండించడం, అమ్మడం యిక్కడ నేరమవుతుంది. అయితే బంగ్లాదేశ్ ప్రభుత్వం నుండి ఆ దేశంలో జన్యుమార్పిడి పంటలు పండించడానికి, అమ్మడానికి అనుమతి పొందింది. భారతదేశంలో అనుమతి పొందకముందే ఈ కంపెనీ బంగ్లాదేశ్‌లో పెంచిన నారును హర్యానాలోని అమాయక రైతులకు అమ్మి యిక్కడ ఆ వంగడం సాగును దొంగచాటుగా చేయిస్తోంది.

ఈవిధంగా చట్టవ్యతిరేకంగా జన్యుమార్పిడి వంకాయలను తన అధీన సంస్థద్వారా భారత దేశంలో ప్రవేశపెట్టి మోన్‌శాంటో కంపెనీ భారతదేశంలో బి.టి.వంగ సాగుకు రంగం సిద్ధపరుస్తూ వుంది. అలాగే దీని సాగుకు అనుమతి యివ్వవలసిందిగా భారతదేశంపై ఒత్తిడి తెస్తూ వుంది.

సంబంధిత ప్రభుత్వ నియంత్రణా సంస్థల సహకారం లేకుండా వాటి రహస్య అంగీకారం లేకుండా మహికో అనధికారికంగా, చట్ట వ్యతిరేకంగా భారతదేశంలో బి.టి. వంగ సాగు చేయించి అమ్మగలుగుతుందని అనుకోలేము. హర్యానాలో వున్న పరిస్థితుల దృష్ట్యా యిలా చెప్పడం ఎంతమాత్రం తప్పుకాదు.

నియంత్రణా కమిటీయైన జి.ఇ.ఎ.సి భారతదేశంలో జన్యుమార్పిడి వంకాయల సాగు, అమ్మకాలు జరుపుతున్న ఆ కంపెనీకి స్నేహ హస్తాన్ని అందిస్తోంది. అంటే ఈ నియంత్రణా కమిటీ తాను నిర్వర్తించాల్సిన మౌలిక విధి- జన్యుమార్పిడి ఆహార వినియోగం ద్వారా సంభవించే ఆరోగ్య దుష్ప్రభావాల నుండి భారతీయ ప్రజలను రక్షించడం - నుండి వైదొలుగుతున్నది.

అభివృద్ధిచెందిన ఐరోపా దేశాలు మరియు జపాన్ లాంటి దేశాలు ప్రజల ఆరోగ్యానికి హానికరమని తమ దేశాల్లో జన్యుమార్పిడి ఆహారాలను సాగుచేయడం, అమ్మడాన్ని నిషేధించాయి. కాని భారతదేశంలోని నియంత్రణా కమిటీలు మరియు భారతపాలకులు మాత్రం ఈ విషయంలో కంపెనీలపట్ల సానుభూతితో వ్యవహరిస్తూ, బి.టి. ఆహార పంటలసాగుకు, భారతదేశంలో ఆహార వాణిజ్యం చేసుకోవడానికి ఈ కంపెనీల పట్ల మొగ్గు చూపుతున్నారు.

బి.టి. ఆహారం ప్రజల ఆరోగ్యానికి హానికరం కాదనే విషయం ఇంకా స్పష్టంగా రుజువు కాలేదు. అనేకమంది ప్రఖ్యాత మరియు నిజాయితీగల శాస్త్రవేత్తలు ఈ బి.టి. ఆహారం ప్రజల ఆరోగ్యానికి హానికరమని, తక్షణం వాటి ప్రభావం కన్పించకపోయినా దీర్ఘకాలంలో వాటి దుష్పరిణామాలు బయట పడతాయిని హెచ్చరిస్తున్నారు.

కానీ, భారత ప్రభుత్వం మాత్రం చట్ట వ్యతిరేకంగా జన్యుమార్పిడి వంగనారును తెచ్చి అమాయక రైతులకు అమ్ముతున్న వారిపై తీవ్రమైన చర్యలు తీసుకోవలసిందిపోయి అమాయక రైతులపైననే చట్ట వ్యతిరేకంగా సాగు చేస్తున్నారని ఆరోపిస్తూ వారి పంటలను నాశనం చేస్తూ బి.టి. వంగ సాగు ప్రమాదాన్ని నివారిస్తున్నట్లు ప్రకటించుకుంటున్నది. ఆవిధంగా అమాయక రైతులు నేరస్థులుగా ముద్రవేయబడి దోషులుగా మిగిలిపోవడంతోబాటు ఆర్థికంగా నష్టాల పాలవుతున్నారు.

మరోవైపు జన్యుమార్పిడి ఆహార విత్తనాలను ఉత్పత్తిచేసి అమ్ముతున్న మోన్‌శాంటో కంపెనీ అండదండలతో జన్యుమార్పిడి పంటల పైరవీదారులు రైతు సంఘాల ముసుగులో బి.టి. సాగును నిషేధించడానికి వ్యతిరేకంగా కృత్రిమ ఉద్యమాలను సృష్టిస్తున్నారు. జన్యు మార్పిడి పంటలవల్ల కలిగే ప్రయోజనాలను నిరాశా నిస్పృహల్లో వున్న భారత రైతాంగానికి అందకుండా ప్రభుత్వం అడ్డుపడుతుందనే ప్రచారాన్ని చేస్తున్నారు.

ఏది ఎలా వున్నప్పటికీ చట్టవ్యతిరేకంగా, అనధికారికంగా జన్యుమార్పిడి ఆహార పదార్థాలు భారతీయ ఆహార రంగంలోకి చొచ్చుకు వచ్చాయి.

బి.టి. ప్రత్తి సాగుకు అనుమతించిన తర్వాత వాటి విత్తనాలనుండి నూనె తీస్తున్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో ముఖ్యంగా గుజరాత్, మహారాష్ట్రలలో ఈ నూనెను వాడు తున్నారు. అంతేకాదు భారతదేశంలో పండించిన జన్యుమార్పిడి విత్తనాలను ఆ కంపెనీలు తిరిగి మనదేశానికే దిగుమతి చేసి వాటినుండి కనోలా నూనె, సోయాబీన్ నూనెను తీస్తున్నారు.

ఇదంతా తెలిసి కూడా చట్టవ్యతిరేకంగా దేశంలోకి వస్తున్న జన్యుమార్పిడి పదార్థాలపట్ల భారత పాలకులు, మరియు నియంత్రణా కమిటీలు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నాయి.

ఇదీ జన్యుమార్పిడి ఆహారం ద్వారా దేశం ఎదుర్కొంటున్న ముప్పు! ఈ ముప్పు చట్ట వ్యతిరేక సాగు ద్వారా వస్తున్న ముప్పుకాదు. వీటి సాగును చట్టబద్ధంగా అనుమతించినా ఈ ముప్పు ఆగదు.

కాని మన పాలకులు మరియు ప్రభుత్వాలకు మనదేశ ప్రజల ప్రయోజనాలపట్ల ఆసక్తి లేదు. వారి వర్గ స్వభావరీత్యా సామ్రాజ్య వాదులకు సేవ చేయడమే వారి పరమావధి. అందువల్ల ఈ పాలకులు, ప్రభుత్వాలు నయానో భయానో జన్యుమార్పిడి పంటలను ఈ దేశంలోకి తీసుకురావడానికి మార్గాన్ని సుగమం చేయడానికే ఆసక్తి చూపుతారు. ఇదే అసలైన ముప్పు. దీనికి వ్యతిరేకంగా మనం పోరాడాల్సి వుంది. ✸

రైతుల హక్కులపై పెప్సి కంపెనీ దాడి

దేశ నామమాత్ర సార్వభౌమత్వానికి కూడా ముంచుకొస్తున్న ముప్పు

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ఆవిర్భవించిన తర్వాత ఇండియా సభ్యదేశంగా డబ్ల్యుటిఒకి సంబంధించిన 'టిఆర్ఐపిఎస్'(ట్రిప్స్) అగ్రిమెంట్‌పై సంతకం చేసింది. దీనివల్ల మనదేశ పాలకులు మరింతగా రాజీపడవలసి వస్తోంది. అలాగే నిరంతరం ముప్పును ఎదుర్కోవాల్సివస్తోంది. దేశ 'సార్వభౌమాధికారమే' తీవ్ర ప్రమాదంలో పడింది.

అమెరికా బహుళజాతి సంస్థయొక్క అనుబంధ కంపెనీయైన పెప్సికో ఇండియా గుజరాత్‌లోని నలుగురు బక్క రైతులను కోర్టుకీడ్చింది. తాను హక్కులు పొందిన 'లేస్' తయారీకి వుపయోగపడే ప్రత్యేక బంగాళ దుంపలను ఈ రైతులు పండిస్తున్నారని, నష్టపరిహారంగా ప్రతి రైతు తనకు 1.5 కోట్ల రూపాయలు చెల్లించాలని ఆ కంపెనీ అహ్మదామాద్‌లోని వాణిజ్య కోర్టులో దావా వేసింది. ఆ రైతులు సదరు వంగడం (ఎఫ్‌సి బంగాళాదుంప) సాగుచేయడానికి వీల్లేదని ఈ కోర్టు ఏకపక్షంగా మధ్యంతర తీర్పునిచ్చింది. ఈతీర్పులో అనేక ఆందోళనకర అంశాలున్నాయి. ఈ తీర్పు మనరైతుల విత్తన సార్వభౌమాధికారానికి, మన ప్రజల ఆహార సార్వభౌమత్వానికి అంతిమంగా మనదేశ సార్వభౌమత్వానికి పెనుముప్పుగా పరిణమిస్తోంది.

ఇక్కడ వివిధ వంగడాల రక్షణ మరియు రైతుల చట్టం-2001 (పిపివి అండ్ ఎఫ్ఆర్ చట్టం) అనబడే ఈ చట్టం అమలులో చట్టపరమైన మరియు న్యాయపరమైన అంశాల గురించి ఎదురయ్యే సమస్యకంటే సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు మనదేశంయొక్క, మన రైతులయొక్క, మన ప్రజలయొక్క సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమే మనముందున్న ప్రధాన సమస్య.

స్థానిక విత్తన వ్యాపారులనుండి ఆ బంగాళాదుంప వంగడాన్ని కొని సాగుచేసిన రైతులను, పై చట్టంలోని కొన్ని నిబంధనలను అడ్డంపెట్టుకొని పెప్సికో వేధిస్తోంది.

పెద్ద బహుళజాతి సంస్థలు ముఖ్యంగా అమెరికా బహుళజాతి కంపెనీలు అభివృద్ధి చెందుతున్న దేశాలలో తమ యిష్టారాజ్యంగా నీతిబాహ్య వ్యాపార పద్ధతులకు పాల్పడుతున్న విషయం బహిరంగ రహస్యమే.

జాన్సన్ & జాన్సన్ కంపెనీ తన అధీన సంస్థలద్వారా భారతదేశంలో తన వైద్య ఉత్పత్తులను అమ్ముకోవడంలో ఎంతటి నీతిబాహ్య చర్యలకు పాల్పడిందో మనం చూశాం. అలాగే మోన్‌శాంటో కంపెనీయొక్క అధీన సంస్థ 'మహికో' ఈ దేశంలో చట్టవ్యతిరేకంగా ప్రవేశించి, తన బిటి వంకాయలను అనధికారికంగా పండించి, అమ్ముకున్న వైనం మనందరికీ తెలిసిందే. ఇటీవలనే వాల్‌మార్ట్ కంపెనీ సంబంధిత ప్రభుత్వ అధికారులకు లంచాలు యిచ్చి తన వ్యాపారాన్ని అంతర్జాతీయంగా విస్తరించుకోడానికి అనుమతులు పొందడంలాంటి నీతిబాహ్య కుట్రపూరిత చర్యలు బహిర్గతమయ్యాయి. ఈ బహుళజాతి కంపెనీలు తమకున్న భారీ పెట్టుబడిశక్తితో, ఆధిపత్యంతో వీటి బారినపడ్డ దేశాల ప్రజలహక్కులను, సార్వభౌమాధికారాన్ని హరిస్తూ, ఆ దేశాలను సర్వనాశనం చేస్తూ వాటితో ఆడుకుంటున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ ద్వారా రూపొందిన 'ట్రిప్స్' ఒప్పందం వీటికి స్వతంత్ర దేశాల సార్వభౌమాధికారాన్ని నిర్వీర్యపరిచే అవకాశాల నిస్తోంది.

అమెరికా దిగ్గజ అనుబంధ కంపెనీయైన పెప్సికో తన శీతల పానీయాల వ్యాపారంతో బాటు ఆహార పదార్థాల తయారీ వ్యాపారాన్ని కూడా చేస్తోంది. 'లేస్' చిప్స్ తయారీకి వాడే 'ఎఫ్-సి-5' రకం బంగాళాదుంప వంగడాన్ని 2009లో అది ఈ దేశానికి తెచ్చింది. సహకార వ్యవసాయంపేర 12000 మంది రైతులు ఈ వంగడాన్ని సాగుచేస్తున్నారు. ఈ వంగడం విత్తనాలను రైతులకు సరఫరా చేయడానికి, వారు పండించిన పంటను కొనుగోలు చేయడానికి ప్రత్యేకమైన ఒప్పందాలను రైతులతో ఈ కంపెనీ చేసుకుంది. ఈ వంగడాన్ని, పిపివి & ఎఫ్ఆర్ చట్టంక్రింద పేటెంటు హక్కులను ఈ కంపెనీ రిజిష్టరు చేసుకుంది. 2010లో ఈ వ్యాపారం ద్వారా 2727 కోట్ల రూపాయలను గడించింది. 2015లో కేవలం 'లేస్' చిప్స్ అమ్మడం ద్వారానే మనదేశ మార్కెట్ నుండి 6000 కోట్ల రూపాయలు లాభాలు గడించింది.

తన సహకార వ్యవసాయ ఒప్పందంలో భాగస్వాములు కాని రైతులు కొందరు గుజరాత్‌లో ఈ వంగడాన్ని పండిస్తున్నట్లు పెప్సికో తెలుసుకుంది. పిపివి & ఎఫ్ఆర్ చట్టం క్రింద తన హక్కులు ఉల్లంఘన జరిగిందని, తనకు జరిగిన భారీ నష్టానికి పరిహారం చెల్లించాలని ఆ చిన్న రైతులపై కేసులు పెట్టింది. గుజరాత్‌లోని వాణిజ్య న్యాయస్థానం కనీసం రైతుల వాదనలను కూడా వినకుండా ఏకపక్షంగా తీర్పునిచ్చింది.

ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దక్షిణకొరియా, యూరోపియన్ యూనియన్ దేశాలలోని సన్నకారు రైతులపై 'పెప్సికో' ఇలాంటి కేసులు పెట్టి దెబ్బతీస్తోంది. రైతుల హక్కుల రక్షణకు జరిగే ప్రయత్నాలు పట్టుచిక్కని వ్యవహారంగా మారిపోయాయి. చివరకు యిప్పుడు రైతుల హక్కులు, సార్వభౌమత్వమే ప్రమాదంలో పడ్డాయి.

ఒక భారతీయ న్యాయస్థానం భారతీయ రైతులకు వ్యతిరేకంగా మొత్తం పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష తీర్పులను ఎలా యిస్తుందనేది అర్థంగాని విషయం. దీన్నిబట్టి భారతీయ న్యాయస్థానాలు ఈ కేసుల్లో వున్న కీలకమైన పరిస్థితుల జోలికి పోకుండా, వాటిని పట్టించుకోకుండా యాంత్రికంగా చట్ట పరిమితుల్లోనే వ్యవహరిస్తున్న తీరు మనకు తెలుస్తోంది.

నీతిబాహ్యమైన విధానాలతో దుర్బలురైన రైతులను వేధించటంద్వారా పెప్సీ కంపెనీ 'ఏవిధంగా' లాభాలు గడించాలనుకుంటుందో ఈ ఉదంతం తెలియజేస్తోంది. 'కార్పొరేట్ జవాబుదారీతనం' వంటి బడాయి నినాదాలన్నీ ఎంతటి డొల్లవో ఈ ఉదంతం వెల్లడిచేస్తోంది.

ఇంతటి నీచమైన వ్యవహారాలు బయట ప్రపంచానికి తెలిసిన తర్వాత కూడా పెప్సికో తాను యిదంతా సహకార బంగాళాదుంప సాగులో భాగస్వాములుగా వున్న రైతుల ప్రయోజనాల పరిరక్షణకోసమేనని, చివరి అస్త్రంగా న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితికి నెట్టబడ్డామని వాదిస్తోంది. ఇంతకంటే నయవంచన ఏమైనా వుంటుందా!?

(తరువాయి 19వ పేజీలో)

జాతీయ పౌర జాబితా (ఎన్ఆర్సి) నుండి తొలగింపబడినవారందరికీ పౌరసత్వం కల్పించాలి

అసోం రాష్ట్రంలో జాతీయ పౌరజాబితా (ఎన్ఆర్సి) తుది రూపమిచ్చిన జాబితాలో 19 లక్షలమంది ప్రజానీకాన్ని తొలగించారు. ఎన్ఆర్సి నుండి తొలగింపబడినవారు 'ఫారినర్స్ ట్రిబ్యునల్'కు 120 రోజులలోపుగా విజ్ఞప్తి చేసుకోవచ్చునని చెప్పారు. ఈ క్రమం పూర్తయిన తర్వాత మిగిలినవారందరినీ శరణార్ధి శిబిరాలకు తరలిస్తారు. ఏ దేశమూ వీరందరినీ ఇముడ్చుకోబోవటంలేదు. 19 లక్షలమంది ప్రజల జీవితాలను దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేశారు.

ప్రస్తుతానికి అసోం రాష్ట్రంలో తాత్కాలిక వసతి సౌకర్యాలతో కూడిన ఆరు నిర్బంధ శిబిరాలను నిర్వహిస్తున్నారు. ఎన్ఆర్సి జాబితా నుండి మినహాయించబడిన వారికోసం మరో పది నిర్బంధ శిబిరాలను నిర్వహించేందుకు వీలుగా భవనాలు నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదిస్తోంది.

అదేసమయంలో, 1955 సం॥ నాటి పౌరసత్వ చట్టాన్ని (సిటిజన్‌షిప్ యాక్ట్‌ను) సవరిస్తూ 2016 జులై 19న 'ఇండియన్ సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్టు'ను లోక్‌సభలో ప్రతిపాదించారు. ఈ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదం పొందేట్లయితే, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ల నుండి చట్టవిరుద్ధంగా వచ్చిన అల్పసంఖ్యాక మతస్థులైన హిందూ, శిక్కు, బుద్ధిస్టు, జైన్, పార్శీ లేదా క్రిస్టియన్ మతస్థులు భారతీయ పౌరసత్వానికి అర్హులౌతారు; ఒక్క ముస్లిము మతస్థులు తప్ప! పైన పేర్కొన్న శరణార్ధులైన మతస్థులు భారత దేశంలో పౌర అర్హత పొందాలంటే అవసరమైన నివాస కాలాన్ని 11 సం॥ల నుండి 6 సం॥లకు తగ్గిస్తూ ఈ బిల్లు వెసులుబాటు కల్పిస్తోంది. అంటే, దీని అర్థం ఎన్ఆర్సిని తాజా పరచటం అనేది, అసోంలో నివశిస్తున్న అల్పసంఖ్యాక ముస్లిమ్ మతస్థులను పీడించి, హింసించేందుకేనని స్పష్టం అవుతోంది.

ప్రధానమంత్రి సైతం తన డిగ్రీ సర్టిఫికెట్లను సమర్పించలేని మనదేశంలో, 5 దశాబ్దాల వెనకటి డాక్యుమెంట్స్‌ను తీసుకురావటం ఏవిధంగా సాధ్యం? లక్షలాదిమంది భారతపౌరులు మనదేశం నుండి ప్రపంచవ్యాపితంగా వలసలు వెళ్ళి అనేక దేశాలలో పౌరసత్వం పొందివున్నారు. ఎన్ఆర్సి జాబితా నుండి మినహాయించిన వారిని భారతదేశం ఎందుకు ఇముడ్చుకోలేదు?

ఎన్ఆర్సి తుది జాబితా నుండి తొలగించబడిన 19 లక్షలమందికి భారత పౌరసత్వం కల్పించాలని మేము డిమాండ్ చేస్తున్నాం. భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామిక దేశమే అయ్యేట్లయితే, వారందరినీ అది నిర్బంధ శిబిరాల్లో ఉంచజాలదు.

కేంద్రకమిటీ,
సిపిఐ(ఎం-ఎల్)

తుంగభద్ర లోతట్టు కాలువ 'ఆధునీకరణ'పై రైతాంగం ఆందోళన - 15 రోజుల నిరవధిక ధర్నా

కర్ణాటక రాష్ట్రం తుంగభద్ర పరివాహక ప్రాంతంలో సిరిగుప్ప తాలూకాలో తుంగభద్ర లోతట్టు ప్రధాన కాలువకు ఆధునీకరణ చేపట్టే సమయంలో బోర్డు అధికారులు మార్పు చేయడాన్ని గమనించిన రైతులు దిగువ ప్రాంతాలకు నీటి పారుదల కష్టమవుతుందని వందలాది మంది ప్రధాన కాలువ 68/300 కిలోమీటర్ వద్ద ఆందోళనకు దిగారు. పనులు చేపడుతున్న అధికారులను నిలదీశారు. ఫలితం లేకపోవడంతో నిరవధిక ధర్నాకు పిలుపునిచ్చి కాలువ పక్కనే ధర్నా చేపట్టారు. వందలాది మంది రైతులతో 2-6-19 నుంచి పదిహేను రోజులపాటు ఈ ధర్నా, నిరాహార దీక్షలు కొనసాగాయి.

కర్ణాటక రాజ్య రైతు సంఘ(ఏఐకెఎంకెఎస్ అనుబంధం) ఆధ్వర్యంలో సాగిన ధర్నాలో చుట్టుపక్కల ప్రాంతాల రైతాంగం, సిరిగుప్ప, బళ్ళారి ప్రాంత రైతు సంఘం నాయకులు ఆర్.మాధవరెడ్డి, హులిగప్ప,లేపాక్షి, తిమ్మనగౌడ, సత్యనారాయణరెడ్డి, రామనగౌడ తదితరులు నాయకత్వం వహించారు. పనులు ఆపివేశారు. దాంతో 17-6-19న టీబీ బోర్డు సిఈ ఆధ్వర్యంలో ధర్నా స్థలంలో చర్చలు జరిగాయి.

సీఈతోపాటు పదకొండుమంది పాల్గొన్నారు. అధికారులంతా ఆధునిక పరిజ్ఞానంతో సర్వేచేసి నిర్ణయించామని, ప్రాజెక్టు డిజైనింగ్‌లో వున్న మేరకే పనిచేస్తున్నామని రైతులతో చెప్పారు. కానీ రైతులు తమకు తెలిసిన వ్యవసాయ జ్ఞానంతో నీరు ఎక్కడ పారుదల కష్టం అవుతుందో చూపుతామని కాలువలో మళ్లీ కొలతలు తీయమన్నారు. సి.ఈ. సమక్షంలో కొలిపించారు. రైతుల సమక్షంలో జరిగిన సర్వేలో వాస్తవాలు వెలుగుచూడడంతో గతంలో వున్న వెడల్పు-లోతుల ప్రకారమే పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వేలాది ఎకరాల నీటిపారుదలకు తీవ్రమైన సమస్యగా మారబోయిన ఈ ఆధునీకరణ సమస్యను రైతు సంఘం సరైన సమయంలో చైతన్యం ప్రదర్శించి కాపాడుకోగలిగింది. ధర్నా జరుగుతున్న 15 రోజులపాటు అధికారులు అనేక రకాల ప్రలోభాలకు గురిచేయడానికి పూనుకున్నా రైతులు లొంగక నిజాయితీగా నిలబడడంతో రైతుల సమస్య పరిష్కారమైంది. చాగనూరు మల్లిఖార్జునరెడ్డి (అడ్వకేట్), మరికొందరు మేధావులు రైతులకు అండగా నిలిచారు. ✱

తరుగుతున్న ఉపాధి - పెరుగుతున్న నిరుద్యోగం - పాలకుల వంచన

దేశవ్యాపితంగా నిరుద్యోగం యువతను పట్టిపీడిస్తున్నది. ఉద్యోగ, ఉపాధి లేక వారు నిరాశా నిస్పృహలకు గురౌతున్నారు. 'స్వాతంత్ర్యం' వచ్చి 72 సంవత్సరాలైనా గ్రామీణ, పట్టణ పేదలకు ఉపాధి, చదువు పూర్తిచేసిన యువతకు ఉద్యోగాలు కల్పించటంలోనూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వక వైఫల్యం పొందాయి. భవిష్యత్తు అంధకారంగా మారి, కుటుంబానికి భారంగా మారానన్న మానసిక వ్యధకు లోనై అనేకమంది యువకులు బలవన్మరణాలకు లోనౌతున్నారు.

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా, పేదల జీవన ప్రమాణాలు పెంచుతామని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెబుతూనే వున్నారు. అది మాటలకు పరిమితమే తప్ప ఆచరణలో అందుకు తీసుకోవాల్సిన చర్యలు, విధానాలు చేపట్టటంలేదు. సామ్రాజ్యవాదులకు ఊడిగం చేస్తున్న పాలకులకు దేశ ప్రయోజనాలు, ప్రజల సమస్యల పరిష్కారం పట్టటంలేదు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రజల అవసరాలను తీర్చే పరిశ్రమలు నెలకొల్పకుండా సామ్రాజ్యవాద దేశాల బడాపరిశ్రమాధిపతుల ప్రయోజనాలకు అనుకూలమైన పారిశ్రామిక విధానాన్ని అమలు జరుపుతున్నారు. ఫలితంగా పారిశ్రామిక అభివృద్ధి ప్రక్కదారి పట్టి ఉపాధిలేమి, నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చింది.

యుపిఏ ప్రభుత్వం మాటలగారడీతో యువతను మభ్యపెట్టి మోసం చేసిందేతప్ప ఉద్యోగాలు కల్పించలేకపోయింది. యువతలో గూడుకట్టుకొన్న నిరాశ, నిస్పృహను బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఏ కూటమి 2014 సాధారణ ఎన్నికల్లో తనకు అనుకూలంగా మార్చుకొంది. తాము అధికారంలోకి వస్తే యువతకు ఉపాధి కల్పిస్తామని, సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు యిస్తామని చెప్పి వారిని భ్రమలకు గురిచేసింది. అందుకు 'గుజరాత్'ని ఉదాహరణగా చూపింది. తెలుగుదేశం పార్టీ కూటమి కూడా ఇలాంటి వాగ్దానమే చేసింది. సంవత్సరానికి 5 లక్షలు ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పింది.

కేంద్రంలో ఎన్‌డిఏ, రాష్ట్రంలో తెలుగుదేశం కూటములు మెజారిటీ స్థానాలతో 2014 సం॥లో ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. అధికారపగ్గాలు చేపట్టిన తర్వాత ఉద్యోగ కల్పనలో యువతకు మొండిచేయి చూపాయి. ఉద్యోగాలు కల్పించక పోగా భారీగా వున్న ఉద్యోగాలను కూడా భర్తీచేయలేదు. ఉన్నత ఉద్యోగాలు ఊడబెరికే విధానాలు అమలుజరిపాయి.

భారీ పరిశ్రమలకన్నా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలే ఎక్కువగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. మనదేశంలో ఇలాంటి పరిశ్రమలు 6.5 కోట్ల వరకు వున్నాయి. ఇవి 12 కోట్లమందికి ఉద్యోగ, ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ పరిశ్రమల రంగం వాటా స్థూలదేశీయ ఉత్పత్తిలో(జిడిపి)లో 29 శాతంగా వుంది. కొత్తగా కొన్ని పరిశ్రమలు ఏర్పడుతున్నా, మూతపడే పరిశ్రమలే ఎక్కువగా వున్నాయి. రిజర్వుబ్యాంక్ గణాంకాల ప్రకారమే 4,86,291 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూలబడ్డాయి. ఈ పరిశ్రమలు 2013-14 సంవత్సరంలో 9.17 శాతం వార్షిక అభివృద్ధి సాధించగా 2015-16 నాటికి 7.62 శాతానికి పడిపోయింది. ఆ తర్వాత 6 శాతానికి దిగజారింది. ఇందుకు కారణం పాలకుల విధానాలే. ఈ పరిశ్రమలు నిలదొక్కుకొని అభివృద్ధిచెందటానికి చేయూత ఇవ్వకుండా వాటి మనుగడను దెబ్బతీసే విధానాలు అమలుపర్చారు. ఇవి అభివృద్ధి చెందితే తమకు తీవ్రనష్టంగా పరిణమిస్తుందని బడాపరిశ్రమాధిపతులు, అవి ఉత్పత్తి చేసే సరుకులకు మార్కెట్ సంక్షోభాన్ని సృష్టించాయి.

పాలకుల పారిశ్రామిక విధానాల ఫలితంగా నిరుద్యోగ సమస్య నానాటికీ పెరుగుతూనే వుంది. జాతీయ నమూన సర్వే సంస్థ (ఎన్‌ఎస్‌ఎస్) నియతకాలిక సర్వే నివేదికను ఓ పత్రిక ప్రచురించింది. నిరుద్యోగిత రేటు 6.1శాతం అన్న విషయాన్ని బయటపెట్టింది. గత 45 సం॥కాలంలో ఇదే ఎక్కువ అని పేర్కొంది. పత్రిక ప్రచురించిన దానిపై ఆనాటి కేంద్ర గణాంకాలశాఖ మంత్రి సదానందగౌడ లోక్‌సభలో స్పందిస్తూ అది నకిలీ నివేదికగా ప్రకటించాడు. ఆయన ప్రకటన వాస్తవ విరుద్ధమని వెల్లడైంది. మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఏ కూటమి రెండవసారి కొలువుదీరిన మరుసటిరోజే కేంద్ర గణాంకాలశాఖ ఎన్‌ఎస్‌ఎస్‌ఓ నియతకాలిక కార్మిక సర్వే వివరాలను విడుదల చేసింది. దానిలో నిరుద్యోగిత రేటు 6.1% నమోదైంది. పత్రిక ప్రచురించింది వాస్తవమని, మంత్రి ప్రకటించింది అవాస్తమని వెల్లడైంది.

నియతకాలిక సర్వేతోపాటు 2018 ఏప్రియల్ నుండి డిసెంబర్ వరకు త్రైమాసికాలకు సంబంధించి పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగిత పైన ఎన్‌ఎస్‌ఎస్‌ఓ అధ్యయనం చేసింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో నిరుద్యోగిత రేటు 9.7శాతంగా నమోదైంది. ఈ సంస్థ సర్వేలోనే జూన్ 2018 నాటికి పట్టణప్రాంత నిరుద్యోగం 7.8% ఆ తర్వాత ఆరునెలల్లో 2 శాతం దాకా పెరిగింది. ప్రభుత్వం అనుసరించిన విధానాలతోపాటు పెద్దనోట్ల రద్దు, జిఎస్‌టి కూడా ఇందుకు దోహదపడింది. ఎన్‌ఎస్‌ఎస్‌ఓకు సమాంతరంగా దేశ ఆర్థికవ్యవస్థ పర్యవేక్షక కేంద్రం(సిఎంఐఈ)నిరుద్యోగితపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నది. ఆ సంస్థ నివేదిక ప్రకారం జూన్ 9, 2019 నాటికి దేశంలో నిరుద్యోగిత 6.1 నుండి 7.7 శాతానికి పెరిగింది. ఇది త్రిపురలాంటి రాష్ట్రంలో 30 శాతంగా వుంది. ఈ సంస్థ అధ్యయనం ప్రకారం 2018 సం॥లో కోటిమందికి పైగా ఉపాధి కోల్పోయారు. వీరిలో 84శాతం గ్రామీణ ప్రజలే వుండటం వ్యవసాయ సంక్షోభ తీవ్రతకు అద్దంపడుతున్నది.

ఎన్‌ఎస్‌ఎస్‌ఓ సర్వేలో పేర్కొన్న అంశాలు కేంద్రప్రభుత్వానికి మింగుడుపడలేదు. సర్వే ఫలితాలు వ్యతిరేకంగా వున్నా, తను చెప్పిందే నిజమన్నట్లుగా వ్యవహరిస్తున్నది. దేశంలో నిరుద్యోగం గత 45 సం॥ల గరిష్టస్థాయికి చేరిందని చెప్పటం అందులో భాగమే. ఎన్‌ఎస్‌ఎస్‌ఓ సర్వేకి ఎంచుకొన్న ప్రమాణాలను కేంద్రం శంకిస్తున్నది. గత సర్వేలతో, ఈ సర్వేను పోల్చగూడదంటున్నది. దేశంలో చదువుకొన్న, చదువుకొంటున్న వారు పెరిగారని, కుటుంబ ఆదాయాలు ఇనుమడించాయని, విద్యావంతులైన యువత ఆకాంక్షలు పెరుగుతున్నాయని, తన నైపుణ్యాలకు సరిపడని తక్కువ జీతాలు లభించే ఉద్యోగాల్లో చేరటానికి వారు ఆసక్తి చూపటం లేదని కేంద్రప్రభుత్వం చెప్పటం హాస్యాస్పదంగా వుంది. కేంద్రప్రభుత్వం చెప్పేదాని అర్థం ఉద్యోగాలు వున్నాయి కాని తక్కువ వేతనాలు లభించే ఉద్యోగాల్లో యువత చేరటంలేదని చెప్పటమే.

ఉద్యోగాలు దొరకటం కష్టమౌతున్న పరిస్థితుల్లో యువత ఏదో ఒక ఉద్యోగం దొరికితే చాలనుకొంటున్నది. కొద్దికాలం క్రితం

పశ్చిమబెంగాల్‌లో ఆరువేల క్లాస్ - 4 ఉద్యోగాలకు 25 లక్షలమంది దరఖాస్తు చేసుకొన్నారు. ఈ ఉద్యోగాలకు ఎనిమిదవ తరగతి అర్హత చాలు. కాని పీజీలు, పిహెచ్‌డిలు చేసినవారు కూడా దరఖాస్తు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో 368 బంట్రోతు ఉద్యోగాలకు 23 లక్షలమంది దరఖాస్తు చేయగా, వీరిలో లక్షన్నర మంది డిగ్రీ పట్టాదారులు, 250 మందికిపైగా డాక్టరేటు సాధించిన వారు వున్నారు. కర్ణాటక, మహారాష్ట్రల్లోనూ ఇలాంటి సంఘటనలు వున్నాయి.

వాస్తవలకు భిన్నంగా కేంద్రప్రభుత్వం ఉద్యోగ కల్పన లెక్కలు చెబుతున్నది. అందుకు తన అనుయాయులను ప్రయోగిస్తున్నది. ప్రధానమంత్రి ఆర్థిక సలహాసంఘం సభ్యుడు సుర్జిత్ ఎస్.భల్లా, ఐఐఎం బెంగుళూరుకు చెందిన తీర్థ తన్మయ్‌దాస్ 2018 జులై 9న ఓ అధ్యయన నివేదికను విడుదల చేశారు. అందులో 2014-17 సం॥ మధ్యకాలంలో దేశంలో 2.2కోట్ల ఉద్యోగాల సృష్టి జరిగిందని, 2017 సం॥లోనే 1.3 కోట్ల ఉద్యోగాలు కొత్తగా ఏర్పడ్డాయని లెక్కలు గట్టారు. సరైన ఆధారాలు, క్షేత్రస్థాయి పరిశోధన చేయకుండా రూపొందించిన ఆ నివేదిక తీవ్ర విమర్శలపాలైంది.

2018 జులై 20న అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని మోడీ నిరుద్యోగ సమస్యపై మాట్లాడుతూ సంవత్సరకాలంలో కోటికి పైగా ఉద్యోగాలు సృష్టించామని 2017 సెప్టెంబరు నుండి మే 2018 మధ్యలో 45 లక్షలమంది కొత్తగా ఉద్యోగులు భవిష్యనిధి సంస్థలో చేరారని, వీరికి జాతీయ పింఛను పథకం లబ్ధిదారులను కలిపితే 50 లక్షల ఉద్యోగాలను సృష్టించినట్లేగదా! కొత్తగా వచ్చిన వృత్తి నిపుణులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, అసంఘటితరంగ కార్మికులను కలిపితే కోటిమంది అవుతారని చెప్పారు. ప్రధాని చెప్పిన ఉద్యోగకల్పన లెక్కలు వాస్తవ విరుద్ధమైనవి. ఆ లెక్కలు ఉద్యోగ కల్పన క్రిందకు రావు. ఉద్యోగాల కల్పనలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకొనేదే మోడి లెక్కల గారడి.

2019 సాధారణ ఎన్నికల తేదీలకు రెండు నెలలముందు 2.5లక్షల ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు మోడి ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 40శాతం ఉద్యోగాలు కేంద్ర పారా మిలటరీకి సంబంధించినవిగాను, 35 వేల ఉద్యోగాలు ఆదాయపు పన్నుశాఖవిగాను, 39 వేల ఉద్యోగాలు ఎక్సైజ్‌శాఖవిగానూ వుంటాయని ప్రకటించింది. ఉద్యోగ కల్పన స్వభావాన్ని గమనంలోకి తీసుకొంటే, ప్రజాఉద్యమాల అణచివేతకు ప్రాధాన్యతగల నియామకాలకు అగ్రపీఠం వేసింది. ఇవికాక రైల్వేశాఖలోనూ 2.3 లక్షల ఉద్యోగాలు భర్తీచేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటన ఎన్నికల్లో ప్రయోజనం పొందటానికి ఉపయోగించుకొంది. మోడి ప్రభుత్వం రెండవ సారి కొలువుదీరి మూడునెలలు కావస్తున్నా ఉద్యోగాల కల్పన ఊసే లేదు.

2014లో రాష్ట్ర అధికార పగ్గాలు చేపట్టిన తెలుగుదేశం ప్రభుత్వం సంవత్సరానికి 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానన్న వాగ్దానాన్ని నెర వేర్చటంలో విఫలమైంది. కనీసం నిరుద్యోగ భృతికూడా చెల్లించలేకపోయింది. దాదాపు 1.50 వేల ఉద్యోగాలు ఖాళీ అయినా వాటిని కూడా భర్తీ చేయలేదు. కల్పించిన ఉద్యోగాలు కూడా ప్రజాఉద్యమాల అణచివేతకు అదనంగా కావాల్సిన పోలీసు ఉద్యోగాలను మాత్రం నియమించుకొంటూ వచ్చింది. టీచర్ పోస్టులకు అర్హతపొందిన వారికి ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. మోడిలాగానే చంద్రబాబు ఉద్యోగ లెక్కల గారడీనే చేశాడు.

చంద్రబాబు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల ఫలితంగా గత శాసనసభ ఎన్నికల్లో వైయస్ఆర్ సిపి పూర్తి మెజారిటీ సాధించి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అధికారంలోకి రాగానే ఖాళీ అయిన లక్షా 40వేల ఉద్యోగాలను భర్తీచేస్తానని, ప్రతి గ్రామ సచివాలయంలో 10 మందికి పర్మినెంట్ ఉద్యోగాలు, గ్రామీణ - పట్టణ ప్రాంతాల్లో 50 నుండి 70 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ని నియమించి లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తానని వాగ్దానం చేసింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడునెలలు పూర్తికావస్తున్నా ఖాళీ అయిన ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోలేదు. టీచర్ ఉద్యోగాలకు అర్హతపొందిన వారికి నియామకాలు జరపలేదు. గ్రామ, పట్టణ వాలంటీర్లకు, సచివాలయ ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేసింది. వాలంటీర్ నియామకాలను ఉద్యోగాలుగా పరిగణించలేము. 5 వేల వేతనంతో వెట్టిచాకిరీ చేయించటమే. దాని పేరుతో వారి అర్హతకు అనుగుణమైన ఉద్యోగాలకు వారికి దూరం చేయటమే.

కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు గత 5 సంవత్సరాల కాలంలో ఉపాధి - ఉద్యోగ అవకాశాలు కల్పించటంలో ఉద్దేశపూర్వకంగానే వైఫల్యం చెందాయి. పేదలకు ఉపాధి, యువతకు ఉద్యోగాలు కల్పించే పారిశ్రామిక విధానాలను అమలుజరపటంలేదు. బడా పరిశ్రమాధిపతులకు, బహుళజాతి సంస్థలకు చౌకగా కూలీలను, అతితక్కువ వేతనాలకు యువతను అందించే వ్యవసాయ, పారిశ్రామిక విధానాలను అమలు జరుపుతున్నాయి. వ్యవసాయం ముఖ్య భూమిక పోషిస్తున్న మనదేశంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రజల అవసరాలను తీర్చే చిన్న, మధ్యతరహా పరిశ్రమల ద్వారానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. అలాంటి పారిశ్రామిక విధానం అమలు జరపకుండా నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దొరకదు. విప్లవకర భూసంస్కరణలు అమలుజరపటం ద్వారా గ్రామీణ పేదలకు ఉపాధి ఏర్పడుతుంది. ఇందుకోసం గ్రామీణ-పట్టణ పేదలు సమైక్యంగా ఉద్యమించాలి. ✱

(16వ పేజీ తరువాయి)

కానీ, ఈ అర్థంలేని కేసును రైతులపై రుద్దినపుడు మనదేశంలో సార్వత్రిక ఎన్నికల వాతావరణం వుండడం, సోషల్ మీడియాలో పెల్లుబికిన కోపం, దేశవ్యాప్తంగా వచ్చిన ప్రజల నిరసన, వివిధ రైతుసంఘాల నుండి ఎదురైన ప్రతిఘటన, అత్యధిక రాజకీయ-పార్టీలు కంపెనీ చర్యను ఖండించడం, ముఖ్యంగా ఈ దేశంలో తనకున్న భారీవ్యాపారం, వ్యాపార ప్రయోజనాలు, భారతీయ మార్కెట్‌నుండి భారీ లాభాలు పొందే అవకాశాలతోబాటు భారతదేశంలో ఆ కంపెనీ ఉత్పత్తుల కొనుగోలును బహిష్కరిస్తామనే హెచ్చరికలు-'పెప్సికో'ను రైతులపై తను పెట్టిన కేసులు ఉపసంహరించుకొని వెనక్కు తగ్గేట్లు చేశాయి.

అయినా సంబంధిత రైతులకు యిది ఒక తాత్కాలిక ఉపశమనం మాత్రమే. తిరిగి ఆ కంపెనీ అర్థంపర్థం లేని సాకులతోనో, చట్టపరమైన విషయాలనో ఆధారం చేసుకొని రైతులపై దాడిచేసే అవకాశముంది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే విత్తనాల సార్వభౌమాధిపత్యం, ఆహార సార్వభౌమాధిపత్యం, మొత్తంగా మనదేశ సార్వభౌమాధిపత్యంపై ముప్పు ముంచుకొస్తున్నది.

ప్రపంచ వాణిజ్య సంస్థ విసిరిన అసమాన ఒప్పందాల వల నుండి మనదేశం నిర్ణయాత్మకంగా, రాజీలేకుండా బయటపడాల్సి వుంది. అప్పటివరకు ఈ ఒప్పందాల రూపంలో రైతులే కాదు, మనదేశ ప్రజలు, వారి హక్కులు వారి విస్తృత ప్రయోజనాలతోబాటు మన ఆర్థిక స్వాతంత్ర్యం, బహుళజాతి కంపెనీల భారీ పెట్టుబడుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతూ వాటి ఉచ్చులో మగ్గాల్సి వుంటుంది. ✱

రైతాంగానికి మద్దతునివ్వని మద్దతు ధరలు

2019-20 సంవత్సరానికి వివిధ పంటలకు కేంద్రప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించింది. ఎప్పటిలాగానే ఈ ధరలవలన రైతాంగానికి ఉపయోగంలేదు. ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలకు మద్దతు ధరలు అద్దం పడుతున్నాయి.

2020 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మోడి ప్రభుత్వం చెప్పే మాటలకు, ప్రకటించిన మద్దతు ధరలకు పొంతనే లేదు. ఇలాంటి మద్దతు ధరలతో రైతుల ఆదాయం రెట్టింపు ఎలా సాధ్యం? పంట ఖర్చులను వాస్తవంగా లెక్కించకుండా, దాన్ని కుదించి ఉత్పత్తి ఖర్చును తగ్గించి, మద్దతు ధరను దానిపై 50శాతం పెంచామని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ త్రోవర్ చెప్పటం వంచన కాదా?

ఎకరా వరి సేద్యానికి పంట ఖర్చులు 25 వేలు, కౌలుఖర్చు 15 వేలు, కుటుంబశ్రమ విలువ 10వేలు కలిపి మొత్తం 50వేల రూపాయలు ఖర్చు అవుతుంది. సగటు దిగుబడి ఎకరాకి 20 క్వింటాళ్ళు. క్వింటా ఉత్పత్తి ఖర్చు 2500 రూ. దీనికి అదనంగా 50% కలిపి మద్దతుధర ప్రకటిస్తే 3750 రూ.గా వుంటుంది. ప్రభుత్వం ఒక్క పంట ఖర్చునే ప్రమాణంగా తీసుకొని క్వింటా ఉత్పత్తి ఖర్చును 1250 ప్రకటించి దానికి 50% పెంచి 1835 రూ. మద్దతు ధరను ప్రకటించింది. ఇలా ప్రకటించట మంటే కౌలుఖర్చును, కుటుంబ శ్రమవిలువను గుర్తించ నిరాకరించటమే. స్వామినాధన్ కమిటీ సిఫార్సుల్లోను సేద్యపు ఖర్చుల్లో కౌలుఖర్చును చేర్చలేదు. పంట ఖర్చులతోపాటు, కుటుంబ శ్రమను మాత్రమే చేర్చింది. ఆ లెక్కన క్వింటా ఉత్పత్తి ఖర్చు 1,750రూ. యాభైశాతం అదనంగా కలిపితే 2,625 రూ.మద్దతు ధర వుంటుంది. ప్రభుత్వం స్వామినాధన్ సిఫార్సులను కూడా ప్రక్కనపెట్టింది.

దేశంలోనూ, రాష్ట్రాల్లో అధికంగా కౌలు రైతులే సేద్యంలో వున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 60శాతం దాకా వీరే వున్నారు. చాలా ప్రాంతాల్లో భూయజమానికి ముందుగానే కౌలుడబ్బులు చెల్లించాలి. పేదలు, రైతులు వ్యవసాయ కూలీలుగా, మధ్యతరగతి రైతులు పేదరైతులుగా మారారు. అందుకు నూతన ఆర్థిక విధానాలే కారణం. సంపన్నవర్గాల, భూస్వాముల వద్ద భూమి కేంద్రీకరణ పెరిగింది. భూమి హీనులు ఎక్కువ కావటంతో కౌలుభూమికోసం పోటీ పెరిగి కౌలు రేట్లు పెరుగుతున్నాయి. సొంత భూమిలేని వారు ఉపాధికోసం కౌలుసేద్యాన్ని ఎంచుకొన్నారు. కౌలు చెల్లింపుకి అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. కుటుంబం మొత్తం పొలంలోనే పనిచేస్తారు. ఇలాంటి స్థితిలో వున్న కౌలురైతులను ప్రభుత్వం, స్వామినాధన్ కమీషన్ పట్టించుకోలేదు. సేద్యపు ఖర్చులో వారి కౌలు ఖర్చును పరిగణలోకి తీసుకోలేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు వలన వారు పెట్టిన పెట్టుబడి కూడా రాక అప్పుల పాలౌతున్నారు. సొంతభూమి రైతుకి కూడా కుటుంబ శ్రమ విలువ ఆదాయం కూడా మిగలదు. స్వామినాధన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు ప్రకటించినా కౌలురైతుకు ఏమీ మిగలదు. కొన్ని ప్రాంతాల్లో సగటు దిగుబడికన్నా ఎక్కువ దిగుబడిని చూపెట్టి, రైతుల ఆదాయాన్ని ఎక్కువచేసి పాలకులు, వారి ఏజెంట్లు చూపటం వంచనతో కూడిందే.

ప్రభుత్వం తాను ప్రకటించిన మద్దతు ధరలైనా రైతులకు అందేటట్లు చేస్తుందా అంటే అదీ జరగటంలేదు. మద్దతు ధరలను ప్రకటించిన ప్రభుత్వం ఆ ధరలు బహిరంగ మార్కెట్‌లో లభించేలా చేయటం, అలా లభించకుంటే ప్రభుత్వ సంస్థలచేత కొనుగోలు చేయించే బాధ్యత తీసుకోవాలి. పాలకులు అటువంటి బాధ్యతను ఇప్పటివరకు చేపట్టలేదు. మద్దతు ధరల ప్రకటనతో తన బాధ్యత తీరినట్లు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. రాష్ట్రప్రభుత్వం నామమాత్రపు కొనుగోళ్ళకే పరిమితమైంది. భారత ఆహారసంస్థ రైతుల నుండి ధాన్య సేకరణను విరమించుకొంది. ఇలాంటపుడు మద్దతు ధరల ప్రయోజనం ఏమిటి అన్న ప్రశ్న రాక మానదు.

సేద్యానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, డీజిల్ ధరలు నిరంతరం పెరుగుతూ రైతులకు సేద్యపు ఖర్చులు భారంగా మారాయి. కొద్దిరోజుల క్రితమే ప్రతి ఎరువుపైనా బస్తాకి 100 నుండి 120 రూ.వరకు ధర పెరిగింది. పురుగు మందులు, డీజిల్ ధరలు పెరిగాయి. వీటి పెరుగుదల వలన ఎకరా సేద్యానికి వెయ్యి రూపాయలకు పైగా రైతులకు పంట ఖర్చు పెరిగింది. పెరిగిన పంట ఖర్చును గమనిస్తే ప్రభుత్వం పంటలకు పెంచిన మద్దతు ధరలు ఎందుకూ కొరగావు.

కౌలుఖర్చు, కుటుంబ శ్రమవిలువ, పంట ఖర్చును కలిపి సేద్యపు ఖర్చుగా లెక్కించి దానికి అదనంగా 50శాతం పెంచి మద్దతు ధరలను ప్రకటించాలి. రైతులవద్ద వున్న పంటలకు బహిరంగ మార్కెట్‌లో మద్దతు లభించేలా చేయటం లేదా ప్రభుత్వ సంస్థలే కొనుగోలు చేసేలా ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఎరువులు, విత్తనాల ధరలను నియంత్రించాలి. అప్పుడు మాత్రమే రైతులకు మద్దతు ధరల ప్రయోజనం వుంటుంది. ఈ ప్రయోజనాల సాధనదిశలో రైతాంగం ఉద్యమించాలి. ✸

కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 43వ వర్ధంతి సందర్భంగా సిపిఐ(ఎం-ఎల్) కృష్ణాజిల్లా నిర్వహణలో జరిగిన

భారతదేశంలో ప్రస్తుత వ్యవస్థను మార్చడానికి పోరాడుతున్న శక్తులు-ఎదుర్కొంటున్న సవాళ్ళు అంశంపై జిల్లా సెమినార్ రిపోర్టు

4-8-2019, విజయవాడ :

భారత విప్లవోద్యమనేత, మార్క్సిస్టు మేధావి కా॥తరిమెల నాగిరెడ్డి 43వ వర్ధంతి సందర్భంగా విజయవాడలో ఐఎంఏ హాలులో "భారతదేశంలో ప్రస్తుత వ్యవస్థను మార్చడానికి పోరాడుతున్న శక్తులు-ఎదుర్కొంటున్న సవాళ్ళు" అంశంపై జిల్లా సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌కు సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥వీరబాబు, ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కా॥ఎం.సుధాకర్‌లు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.



సెమినార్‌లో ప్రసంగిస్తున్న కామ్రేడ్ ఎస్. ఝాన్సీ; వేదికపై కామ్రేడ్స్ వెంకటరెడ్డి, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, తదితరులు

సెమినార్‌లో మొదటగా రాజ్యహింసకు గురై అమరులైనవారికి, అనారోగ్యానికి గురై అమరులైనవారికి, అనేక విధాల దాడులలో మరణించిన దళితులు, మహిళలు, ఆదివాసీలు, మైనారిటీలకు సంతాపాన్ని తెలియజేస్తూ మౌనం పాటించారు.

మొదటగా సిపిఐ జాతీయ కంట్రోలు కమీషన్ సభ్యులు కా॥ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కా॥టిఎన్ వర్ధంతి సందర్భంగా ఈ అంశంపై సెమినార్ నిర్వహిస్తున్న సిపిఐ (ఎం-ఎల్)కు అభినందనలు తెలిపారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో తాను విద్యార్థి ఉద్యమంలో వున్నకాలంలో కా॥టిఎన్‌ను కలిసిన జ్ఞాపకాలను గుర్తుచేశారు. ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీలో టిఎన్‌కు చాలా గౌరవం వుండేదని, ఈ గౌరవం చీలిపోయాక కూడా ఉందని అన్నారు. వ్యక్తిగత జీవితంలో విలువలు, మంచి క్రమశిక్షణను పాటించారని, ప్రజలను ఆకర్షించే వ్యక్తిత్వం గలవారని అన్నారు.

ఈ సెమినార్ చాలా ముఖ్యమైనదని, అయితే ఆచరణ ఇంకా ముఖ్యమైనదని, ఐక్యకార్యాచరణను ముందుకు తీసుకువెళ్ళటంలో భాగంగా జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో ఇప్పుడు జిల్లాస్థాయిలో సెమినార్లు నిర్వహించటం మంచి ప్రయత్నమని అన్నారు. "నరేంద్రమోడి పాలన తీరు సామ్రాజ్యవాదానికి, ప్రోకాపిటలిస్టు విధానం ఇది. సామ్రాజ్యవాదులకు జూనియర్ పార్ట్‌నర్‌గా వుంది. అందువల్ల తక్షణ కర్తవ్యాల్లో ఈ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం, ప్రతిఘటించడం చేయాలి. అది ఐక్యకార్యాచరణ కావచ్చు, సంఘీభావం కావచ్చు. దీర్ఘకాలిక లక్ష్యంగా-సెమిఫ్యూడల్, ఫ్యూడల్ వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయాలి. ఈ క్రమంలోనే సోషలిజానికి బాటలు వేసి, అంతిమంగా వర్గరహిత, కులరహిత సమాజాన్ని నెలకొల్పి-ఆ తర్వాత కమ్యూనిజానికి వెళ్ళాలి. భారతదేశంలో ప్రజాతంత్ర విప్లవాన్ని పరిపూర్తిచేయాలి. ఒక దేశంలో కమ్యూనిజం సాధ్యం కాదన్నది చరిత్ర నిరూపిస్తున్నది. ప్రపంచమంతా వ్యాపించాలి.

1857 నుంచి శాసనోల్లంఘన, క్విట్ ఇండియా, కయ్యూరు, తెభాగ, పున్నప్రవాయిలార్, తెలంగాణా, అజాద్‌హింద్‌ఫౌజ్ అనేక ఉద్యమాల ఫలితంగానే స్వాతంత్ర్యం వచ్చింది. బ్రిటీషువారు తమ దోపిడీ ప్రయోజనాలకోసం రైల్వేలు, పరిశ్రమలు నెలకొల్పారు. స్వాతంత్ర్యం వచ్చాక ఈ దేశంలో సెమీఫ్యూడల్ సెక్షన్‌లు అనుసరించిన కాపిటలిస్టు పెట్టుబడిదారీ పంథాలో సోషలిస్టు దేశాల సహాయంతో ప్రభుత్వరంగంలో పరిశ్రమలు నెలకొల్పారు. సశ్యవిప్లవం ఫలితంగా పెట్టుబడిదారీ ధనిక రైతాంగం ఏర్పడి వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిచెందుతూ వచ్చిందని మా అభిప్రాయం. మౌలికంగా ఈ దేశపు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పంథాను పెట్టుబడిదారులే డైరక్టు చేస్తున్నారు. ఈ దశలో పారిశ్రామిక కార్మికులను, వైట్‌కాలర్ వర్గాలను, స్కిల్ట్, అన్‌స్కిల్ట్ ప్రజలను, సంఘటిత, అసంఘటిత వర్గాలను కలుపుకు రావాలి. ఇప్పటికే ఉత్తరాదిలో, మహారాష్ట్రలో, రైతాంగ, ఆదివాసీ ఉద్యమాలు వస్తున్నాయి. సోషలిజం గురించి, సోషలిజం విజయాల గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలి. భారత దేశంలో కమ్యూనిస్టులు టిఎన్ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్ళాలని చెపుతూ ఆయన తన ప్రసంగం ముగించారు.

సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్రనాయకులు కా॥ఎస్. ఝాన్సీ మాట్లాడుతూ కా॥టి.ఎన్ గొప్ప మార్క్సిస్టు మేధావి అని అన్నారు. కా॥టిఎన్ ఏ పనినైనా మార్క్సిస్టు-లెనినిస్టుగా అన్వయించి ఎలా చేయాలో చేసి చూపిన నాయకుడని అన్నారు. బ్రిటీషు సామ్రాజ్యవాదులు భారతదేశ స్వాతంత్ర్యోద్యమాన్ని అణచటానికి ఏ చట్టాలైతే చేశారో 1947 తర్వాత అధికారాన్ని చేపట్టిన భారత పాలకులు కూడా అవే చట్టాలను రాజ్యాంగంలో పొందుపరుచుకొని ప్రజాఉద్యమ నాయకులను అణచివేస్తున్నారని వివరించారు. నిన్న, మొన్న కూడా లోక్‌సభ, రాజ్యసభలో 'ఉపా' చట్టం ఆమోదించారని, దీనిద్వారా సంస్థల్నేకాకుండా వ్యక్తుల్ని కూడా టెర్రరిస్టులుగా గుర్తించటమేకాక ఆయా రాష్ట్రాల అనుమతి లేకుండా డైరక్టుగా కేంద్రప్రభుత్వమే ఆయా వ్యక్తులను అరెస్టు చేయటానికి అధికారాన్ని ఈ చట్టంలో పొందుపర్చారని అన్నారు. ఈ చట్టాన్ని మన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష ఎంపిలు ఎవరూ వ్యతిరేకించలేదని, అంటే బిజెపి అయినా, వైసిపి అయినా, టిడిపి అయినా వారి వైఖరి ఏమిటో తెలుస్తోందని అన్నారు. 1927లో చేసిన భారత అటవీచట్టాన్ని నేడు మరలా మరింత కఠినతరం చేయబోతున్నారని అన్నారు. ఆర్‌టిఐ యాక్టులో అనేక మార్పులు చేశారని అన్నారు. అంతేకాక కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ 4 కోడ్‌లను పెట్టారని ఫలితంగా 8 గం॥ల పనిదినాలు కోల్పోతారని, మహిళా కార్మికులకు రక్షణ

వుండదని అన్నారు. 'కాఫీడే' సిద్ధార్థ ఆత్మహత్య పారిశ్రామికవేత్తల సంక్షోభాన్ని తెలియజేస్తుందని అన్నారు.

సెమినార్ 'కీనోట్'ను ఆమె వివరిస్తూ నిలకడైన ఒక ఐక్యకార్యాచరణను నిర్మించు కుంటేనే ప్రజలెదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయగల్గుతామన్నారు. "ప్రస్తుత వ్యవస్థను అర్ధవలస, అర్ధఫ్యూడల్ అని మన పార్టీ అభిప్రాయం. వ్యవసాయరంగంలో మార్పులు కొన్ని వచ్చినప్పటికీ వాటిని ఉపరితల అంశాలుగానే తీసుకోవాలి. భూమిపై పనిచేస్తున్న వారి చేతుల్లో భూమిలేదు. బానిస సమాజ లక్షణాలే -ఫ్యూడల్ వ్యవస్థలోనూ కొనసాగు తున్నాయి. భారతదేశంలో మతతత్వాన్ని తెచ్చిన బ్రిటీషు వలసవాదుల లక్షణాలను కాంగ్రెస్, బిజెపిలు కొనసాగిస్తున్నాయి. భారతదేశంలో ఫ్యూడల్‌శక్తులు, బూర్జువా వర్గాలు అందరూ సామ్రాజ్యవాదులకే దళారులుగా వున్నారు. ఈ దశలో భారత విప్లవం రెండు దశలుగా సాగుతుంది. అవి: 1. నూతన ప్రజాస్వామిక విప్లవం 2. సోషలిస్టు విప్లవం, అంతిమంగా కమ్యూనిస్టు విప్లవం. కనుక ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా అందరూ కలసి ఉద్యమాలు చేయాలి. ఈ విషయంలో కలసి వచ్చే మేధావులను అందర్నీ కలుపుకు రావాలి. మార్క్సిజం-లెనినిజంపై దాడులను ఖండించాలి.

అన్నిరంగాల్లో సంక్షోభం చాలా తీవ్రంగా వుంది. దీనినుంచి బయటపడటానికి ప్రజలు మన పిలుపుకోసం, ఐక్యకార్యాచరణకోసం ఎదురు చూస్తున్నారు. మార్క్సిజాన్ని అన్వయించటంలో వచ్చే విబేధాలే చీలికలకు కారణమవుతున్నది. ఈ వ్యవస్థ మార్పుకోసం కలసి పనిచేయాలి. ఈ దశలో మనల్ని మనం తిట్టుకోవటం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారంకోసం బలమైన ఐక్యకార్యాచరణ ఉద్యమాన్ని నిర్మించాలని చెపుతూ ఆమె ముగించారు.

సిపిఐ(ఎం-ఎల్) ఎన్‌డి నాయకులు కా॥పోలారి మాట్లాడుతూ కా॥ టిఎన్ పేరు చెప్పగానే తాకట్టులో భారతదేశం గ్రంధం గుర్తుకు వస్తుందని, నేడు దేశం తాకట్టులోనే వుందని అన్నారు. ప్రజాఉద్యమాలే లక్ష్యంగా ఐక్యకార్యాచరణ సాగాలని, ఐక్యత క్రిందినుంచి రావాలని, ప్రజాసంఘాలద్వారా ప్రజాసమస్యలు తీసుకొని ముందుకు సాగాలని, ఈ క్రమం అభివృద్ధికాకుండా ప్రజాపోరాటాలను అభివృద్ధి చేయలేమని అన్నారు. కేంద్రం నిర్బంధ చట్టాలను మందబలంతో చేస్తోందని, ఎమర్జెన్సీ పేరు పెట్టకుండా ప్రత్యర్థులపై దాడి చేయటానికి చట్టాలను తెచ్చిందని, ఈ దశలో వర్గ ఐక్యత కావాలని, ఈ సమాజాన్ని అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ అని భావిస్తున్నామని, విప్లవానికి మార్గం ఏమిటన్నది చర్చ సాగుతున్నదని, ఐక్యత సాగాల్సి వుందని, ప్రజాసంఘాలనుంచి ఐక్యత సాగించాలి అని చెపుతూ ముగించారు.

సిపియం రాష్ట్రనాయకులు కా॥వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిద్ధాంతం లేకుండా విప్లవోద్యమం లేదన్నారు. "ఈ సిద్ధాంతాల పేరుతో ఒకరి నొకరం ముద్రలు వేసుకున్నాము. ఇవన్నీ స్వీయాత్మకమైనవి. అందరి లక్ష్యం వ్యవస్థను మార్చాలన్నదే. పాలకవర్గాలను అంచనా వేయటంలోను, దేశ స్వాతంత్ర్యంపట్ల అంచనా ల్లోను తేడాలున్నాయి. ఫ్యూడలిజంమీద, పెట్టుబడిదారీ విధానం మీద అంచనాల్లో తేడాలున్నాయి. ఎవరి అభిప్రాయాలు వారి కున్నాయి. బడాబూర్జువా నాయకత్వంలో వున్న బూర్జువావర్గం ఇది. సామ్రాజ్యవాదంతో మిలాఖత్ అయింది. ఈ దశలో సంఘటిత, అసంఘటిత కార్మికులను, వర్కర్లను ఆర్థిక పోరాటాలకే పరిమితం చేస్తే ఆర్థిక చైతన్యమే వస్తుంది. రాజకీయ చైతన్యాన్ని కల్పించకపోతే బూర్జువా పార్టీల భ్రమల్లో వారి చుట్టూనే తిరుగుతారు. కమ్యూనిస్టులు రాజకీయ సైద్ధాంతిక పోరాటాలు చేపట్టాలి. ఐక్యకార్యాచరణ కొనసాగించాలి అని ఆయన అన్నారు. కా॥టిఎన్ తరం నాయకులకు సిద్ధాంతానికి, ఆచరణకు వ్యక్తిగత జీవితానికి లింకు వుందని అన్నారు. ఇది సముచితమైన సెమినార్ అని ఐక్యకార్యాచరణ సాగాలని ముగించారు.

సిపిఐ(ఎం-ఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు కా॥సత్యన్నారాయణ మాట్లాడుతూ కా॥తరిమెల నాగిరెడ్డి గారికి తమ పార్టీ తరఫున రెడ్‌శాల్యూట్స్ చెప్పారు. "గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి సెమినార్‌లో పాల్గొన్నాము. కేంద్ర స్థాయి, రాష్ట్రస్థాయి, వివిధ జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తున్న సెమినార్‌లు విజయవంతం కావాలని కోరుకుంటున్నాము. చాలా విషయాల పట్ల ఐక్యకార్యాచరణ చేస్తున్న మనం ఎన్నికల విషయాలలో ఏకంగా లేము. పాలకవర్గాలను బహిర్గతం చేయటంకోసం మనమందరం కలసి ఛాలెంజ్‌గా నిలబడాల్సిన చోట కామన్‌గా అంగీకారం వున్న వాటిని ఉపయోగించు కోవటంలేదు. ఎవరికి వాళ్ళం కీచులాటలు, ఎగతాళి, హేళనలు, పెద్దన్న పాత్రలు వహిస్తున్నారు. 100 మంది జనం ఎక్కువ తెచ్చుకోగానే స్టేజిఅంతా తమదే అన్నట్లు మిగిలిన భాగస్వాములను కనిష్ట స్థానంలో వుంచుతూ సంకుచితమైన మనస్తత్వాన్ని కలిగి వుంటున్నారు. శత్రువులను ఎదుర్కోవాల్సిన పరిస్థితుల్లో ముసుగులు తీసేసి పోరాడాల్సిన మనం ముసుగులు వేసుకోవద్దు". ఈ కుహనా సంస్కృతిని, జాతీయవాదాన్ని అంగీకరించబోమని, వివిధ స్థాయిల్లో కలసివచ్చే వారిని కలుపు కుంటూ ముందుకు వెళ్దామని చెబుతూ ఆయన ముగించారు.

ఎంసిపిఐ రాష్ట్రకార్యదర్శి కా॥వెంకటరెడ్డి మాట్లాడుతూ ముందుగా కా॥టిఎన్‌కు జోహార్లు తెలిపారు. "ప్రస్తుత సెమినార్ అంశంమీద మాట్లాడే సందర్భంలో సైద్ధాంతిక అంశాలను ముందుకు తెచ్చారు. ప్రస్తుత రాజ్యాంగం ప్రజావ్యతిరేకమైనది అన్నారు. దీన్ని మేము వ్యతిరేకిస్తున్నాము. ఇది అర్ధవలస అన్నారు. కానీ, ఇది అర్ధవలస కాదని మా నిశ్చిత అభిప్రాయం. గుత్తపెట్టుబడిదారీ బడాభూస్వామ్య వర్గం మీద ఆధారపడింది. దళారీ ప్రభుత్వం కాదు. దళారీ స్వభావం కల్గిన ప్రభుత్వం. సోషలిజం సాధన, కమ్యూనిస్టు సమాజస్థాపనే లక్ష్యం మనందరిదీ. గుర్తించిన ప్రజాసమస్యల మీద కలసి పోరాడటానికి ఎర్రజెండాలన్నీ కలసి పోరాడాలని ఆయన ముగించారు. సెమినార్‌లో ప్రవేశపెట్టిన కీనోట్‌పై సభికులు తమతమ అభిప్రాయాలు తెలిపారు.

వచ్చిన వివిధ అభిప్రాయాలను క్రోడీకరించి ముగింపుగా సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ఎస్.ఝాన్సీ మాట్లాడారు. సరైన లోతైన అవగాహనతో ఐక్యకార్యాచరణ వుండాలని కోరుతున్నామన్నారు. ప్రాతిపదిక లేకుండా ఆచరణలోకి వెళ్ళలేమని అన్నారు. దళితులు, మైనార్టీలు, మహిళలపై జరిగిన దాడులకు ఎక్స్‌గ్రేషియాతో కొట్టుకుపోకుండా ఈ దాడులకు కారణాలు ఏంటి? వ్యవస్థకు దాడులకు గల సంబంధం ఏమిటి? మరొకసారి జరగకుండా ఏమి చేయాలో ప్రజలను చైతన్యపరచాలన్నారు. ప్రజలు పోరాడుతున్న సందర్భాలలో ప్రభుత్వం చట్టాలు చేస్తోంది. ఈనాటికీ చేస్తూనే వుంది. చట్టాలు లేకపోవటంవల్లనే మహిళలు, దళితులు, ఆదివాసులపై దాడులు జరుగుతున్నాయా? అని ప్రశ్నించారు. రాజ్యం దోపిడీ పాలకవర్గాల చేతిలో ఆయుధం అని లెనిన్ మహాశయుడు ఏనాడో వివరించాడని అన్నారు. వర్గాలు లేనప్పుడు రాజ్యం అవసరం వుండదు. దోపిడీ వర్గం లేని వ్యవస్థను మనమందరం సాధించు కోవాల్సి వుందని అన్నారు. సెమినార్‌లో చాలా మంది కామ్రేడ్స్, కమ్యూనిస్టు అభిమానులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు పాల్గొనటం సంతోషంగా వుందని అన్నారు. సరైన ఐక్యకార్యాచరణను ముందుకు తీసుకువెళ్తామని తెలియజేస్తూ ఈ సెమినార్‌ను ముగించారు. సెమినార్‌లో ప్రజాకళాకారులు విప్లవగేయాలు ఆలపించారు. ✸

(చివరి పేజీనుండి)

సగానికి పైగా జనాభా ఆధారపడుతున్న వ్యవసాయరంగం పూర్తిగా నిరాదరణకు గురవుతోంది. లక్షలాది మంది రైతులు - ప్రత్యేకించి అభివృద్ధి చెందాయని, ఆధునిక వ్యవసాయం జరుగుతున్నదని చెప్పే రాష్ట్రాల్లోనే ఆత్మహత్యలకు తలపడ్డారు. ఉత్పాదక ఖర్చుల పెంపు, బ్యాంకు ఋణాలు ఇవ్వకపోవడం, గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం వంటి పాలకుల విధానాలు చేసిన హత్యలివి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల రూపంలో విదేశీ గుత్త సంస్థలు లాభాల పంటలు పండించుకోగా- గ్రామీణ ప్రాంతాల్లోని వడ్డీ వ్యాపారులు కూడ రైతుల రక్తాన్ని పీల్చివేశారు. పాలకులు గ్రామీణ పేదలకు భూములు పంపకం చేయకపోగా- పారిశ్రామికవేత్తల కోసం రైతాంగం నుండి బలవంతంగా భూములను గుంజుకునేందుకు అవసరమైన చట్టాలు చేశారు. మరోవైపు గుత్త కంపెనీల మైనింగ్ అవసరాల కోసం గిరిజనుల్ని అడవుల నుండి తరలి వెళ్ళేలా చేస్తున్నారు. ప్రభుత్వపు తప్పుడు రిపోర్టులను ఆధారం చేసుకుని సుప్రీంకోర్టు ఇటీవలే లక్షలాది గిరిజనులను అడవుల నుండి ఖాళీ చేయమని ఆదేశించింది.

ఆర్థిక రంగంలో తను తీసుకుంటున్న భూస్వామ్య- పెట్టుబడిదారీ - సామ్రాజ్యవాద అనుకూల విధానాలు ప్రజా జీవితంపై పడవేస్తున్న దుష్ప్రభావాలను మరుగు పరిచేందుకు మత విద్వేషాలను రెచ్చగొట్టడమే గాక జాతీయోన్మాదాన్ని కూడ ప్రభుత్వం రెచ్చగొట్టింది. గత 70 సంవత్సరాలుగా కాంగ్రెసు, జనతా, బిజెపి-పాలకులెవరైనా దేశంలో పెరుగుతున్న సంక్షోభం నుండి దృష్టి మరల్చేందుకు విదేశీ ప్రమాదాలను బూచిగా చూపెడుతూనే వచ్చారు. మోడీ, షాల బృందం మరింతగా ఇందులో ఆరితేరింది.

దేశాన్ని జైలుగా మార్చారు. కాశ్మీర్ అంశాన్ని ఉద్రిక్తతలు పెంచడానికి సాధనంగా వాడుతూ ఆర్టికల్ 370ను, 35ఎ లను రద్దుపరచడం ద్వారా-అక్కడకు స్వదేశీ, విదేశీ గుత్త పెట్టుబడుల ప్రవేశానికి మార్గం వేసుకున్నారు. ఇపుడిక కాశ్మీరీ యువత కూడ అక్కడ ఉద్యోగాలు పొందలేక వలస బాటలు పట్టాల్సిన దుస్థితికి నెడుతున్నారు. రాష్ట్రాలలో ఏవిధంగానైనా జోక్యం చేసుకుంటానని, ఎంతటి సాయుధ బలగాలనైనా ప్రయోగిస్తానని ఈ చర్యల ద్వారా కేంద్రం చెప్పింది. మరోవైపు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (UAPA) చేసి ఎవరినైనా అరెస్టు చేసి సంవత్సరాల తరబడి బెయిల్ కూడా లేకుండా జైలులో కుక్కే అధికారం తీసుకుంది.

1947 ఆగస్టు,15న వచ్చింది స్వాతంత్ర్యం కాదు-తెల్లదొరల నుండి నల్లదొరలకు అధికార మార్పిడి మాత్రమేనన్న అంచనా నిజమని అంతకంతకూ రుజువవుతోంది. దేశ 'స్వాతంత్రపు ఫలాలు' 1 శాతంగా వున్న సంపన్నులకే దక్కాయి. 78 శాతం దేశ సంపదలు వారి చేతుల్లోనే వున్నాయి. రాజ్యాంగ సభ ఆర్థిక అంతరాలను వీలైనంత త్వరగా తగ్గించాలని చెప్పగా-అంతరాలను అపరిమితంగా పెంచే లక్ష్యంతో పాలన సాగుతోంది.

స్వదేశీ, విదేశీ అప్పులపై ఆధారపడే కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు నడుస్తున్నాయి. అప్పులకు వడ్డీలు, కిస్తీలు కట్టడానికే బడ్జెట్‌లోని ఒక వాటా పోతోంది. ప్రజలపై పన్నుల భారాలు మోపుతూ-బడా కార్పొరేట్లకు, అందునా విదేశీ గుత్త కంపెనీలకు రాయితీలపై రాయితీలు ప్రకటించి బడ్జెట్‌లను దోచిపెడుతున్నారు. ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటి సంస్థల షరతులకు మన పాలకులు దాసోహ మంటున్నారు.

సామ్రాజ్యవాద వలస ఆధిపత్య విధానాలకు మన పాలకులు 1947ల నుండే మద్దతు పలుకుతూ వస్తున్నారు. వారు సాగించే దురాక్రమణలకు వత్తాసు పలుకుతున్నారు. ఆర్థిక ఆంక్షలను అంగీకరిస్తున్నారు. ఇరాన్‌పై అమెరికా ఆగ్రహించి వారినుండి చమురు కొనుగోలును నిషేధిస్తే భారత ప్రభుత్వం కూడ దాన్ని అంగీకరించడం ఇందుకు తాజా నిదర్శనం.

పాలకుల విధానాల ఫలితంగా రైతాంగం కిందికి పడిపోతున్నారు. మధ్య తరగతి రైతాంగం సన్నకారుగా, సన్నకారు కౌలు రైతులుగా, వ్యవసాయ కూలీలుగా దిగజారుతున్నారు. వలసలబాట పడుతున్నారు. దేశంలోని శ్రామికుల్లో 6 శాతం మంది మాత్రమే సంఘటిత రంగంలో, పరిశ్రమల్లో పనిచేస్తుండగా-మిగిలిన 94 శాతం అసంఘటిత రంగంలోనే వున్నారు. శాశ్వత ఉద్యోగం ప్రభుత్వ రంగంలో గానీ, ప్రైవేటు రంగంలో గానీ లేకుండా పోతోంది. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతులు సర్వ సాధారణమయ్యాయి. ఉద్యోగ భద్రత, ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, బోనస్‌లు, ఇన్సెంటివ్‌లు, పెన్షన్‌ల వంటి పదాలు కనుమరుగవుతున్నాయి.

సోషలిజం విఫలమైందని పెద్దఎత్తున ప్రచారానికి పూనుకున్న సామ్రాజ్యవాద శక్తులు, ప్రత్యేకించి అమెరికా 2008లో వచ్చిన ఆర్థిక సంక్షోభానికి విలవిలలాడింది. ప్రస్తుతం మన దళారీ పాలకులు సామ్రాజ్యవాద, బడా పెట్టుబడిదారీ, భూస్వామ్య అనుకూల విధానాలు చేపట్టిన ఫలితంగానే మనదేశంలో కూడా ఆర్థికమాంద్యం రోజురోజుకు తీవ్రమవుతోంది. ఈ పరిస్థితుల నుండి బయటపడి మెరుగైన జీవితాలను సాధించుకోవడమన్నది ప్రస్తుత దోపిడి వ్యవస్థను కూల్చి ప్రజాతంత్ర వ్యవస్థను సాధించుకోవడం ద్వారానే సాధ్యమవుతుంది. సోషలిజం, కమ్యూనిజం అన్నవి కార్మిక వర్గపు చిరకాల వాంఛలు. అవి సాధించాలంటే కార్మిక-కర్షక మైత్రి ద్వారా ప్రజాతంత్ర విప్లవ సాధనకు కార్మిక వర్గం నడుం బిగించాలి. ఈ కర్తవ్యాల గురించి చర్చించేందుకు AIFTU(N) నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సులో కార్మిక వర్గంలోని చైతన్యపూరిత శక్తులు పాల్గొనాలనీ - దీన్ని విజయవంతం చేసేందుకు ప్రజాతంత్రశక్తులంతా సహకరించాలనీ విజ్ఞప్తి చేస్తున్నాం.

రాష్ట్ర కార్యవర్గం

AIFTU (New)

KLVA 102M250 (Communist Revolutionaries'Fortnightly) RNI No.8315/63 VJ-077/2019-21
No.of pages : 24 Date of publication : 3rd & 18th of Every Month Posting date : 5th & 20th of Every Month

2019 అక్టోబరు 1 న నెల్లూరులో ఏఐఎఫ్‌టియు(న్యూ) ఆధ్వర్యంలో

సామ్రాజ్యవాదము, పెట్టుబడిదారీ వర్గాలు సృష్టిస్తున్న ఆర్థిక సంక్షోభాలు - పరిష్కార మార్గాలు అంశంపై రాష్ట్ర సదస్సు

పెద్దనోట్ల రద్దు, జి.ఎస్.టి.ని ప్రవేశ పెట్టడం దేశ ప్రయోజనాల కోసమేనని నమ్మబలక జూసిన మోడీ ప్రభుత్వ చర్యల వల్ల దేశంలో కోటిమంది ఉపాధి కోల్పోయారని ప్రభుత్వపు లెక్కలే వెల్లడి చేశాయి. జాతీయోన్మాదాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మోడీ 2వ సారి గద్దెనెక్కిన 3 నెలలలోనే ఆర్థిక వ్యవస్థలోని డొల్లతనం బట్టబయలైంది.

ఆటోమొబైల్ (కార్లు, ఆటోలు, స్కూటర్లు వగైరా) కంపెనీల అమ్మకాలు జూలై మాసంలోనే 36 శాతం పడిపోయాయని లెక్కలు తేల్చారు. 10 లక్షల ఉద్యోగుల్ని ఇంటికి పంపుతామని ఆ పరిశ్రమల సంఘం ప్రకటించింది. టీ తోటల యజమానుల సంఘం తమ అమ్మకాలు పడిపోయినందువల్ల 10 లక్షల కార్మిక కుటుంబాలు సంక్షోభంలో పడ్డాయని చెప్పింది. 5రూ॥ బిస్కట్ పాకెట్ల అమ్మకాలు కూడ పడిపోయినందు వల్ల 10 వేలమంది కార్మికుల్ని లే ఆఫ్ చేస్తానని పార్లే-జి కంపెనీ హెచ్చరించింది. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతున్న కాలంలోనే మోడీ దేశ స్థూల ఉత్పత్తి (జి.డి.పి.)ని 5 ట్రిలియన్ డాలర్లకు పెంచుతానని ప్రకటించడం చూసి ఆర్థికవేత్తలు ఆగ్రహించారు.

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటనలు విడ్డూరంగా వున్నాయి. కార్లు నిల్వపడి వున్నాయంటే ప్రభుత్వ అవసరాలకోసం కొనుగోలు చేసి కార్ల పరిశ్రమను కష్టాల నుండి గట్టెక్కిస్తానంటుంది. బ్యాంకులు ఎందుకు విలీనం చేశావంటే - పెద్ద పెద్ద అప్పులు ఇచ్చే శక్తివంతమైన బ్యాంకులుగా రూపొందించడానికేనని చెప్పింది. మొన్న మార్చి 2019 నాటికి తేల్చిన లెక్కల ప్రకారం బ్యాంకుల మొండి బకాయిలు 8 లక్షల 6వేల 412 కోట్ల రూ॥ వసూలు గురించి నోరు మెదపదు. ఎందరి అప్పులు ఎంత రద్దు చేసిందీ చెప్పదు. గత ఆర్థిక సం॥లోనే బ్యాంకులలో మోసాలు 84 శాతం పెరిగాయి. పైగా రిజర్వు బ్యాంకు వద్ద నిల్వల నుండి ప్రభుత్వం కష్టాల నుండి గట్టెక్కడానికంటూ ఒకలక్షా 76వేల కోట్ల రూ॥ కేంద్రం తీసుకున్నది చాలక అదనంగా మరో 54 వేల 225 కోట్లు ఇమ్మని అడుగుతోంది. (3 లక్షల కోట్లు ఇమ్మని డిమాండు చేస్తోంది)

గత 2 దశాబ్దాలుగా కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు పనికిరానివని, వాటిని క్రోడీకరించాలని గత 5 సంవత్సరాలుగా ప్రకటిస్తూ వచ్చిన పాలకులు ఈసారి అధికారంలోకి రాగానే వేజ్ (వేతనాల) కోడ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. నెలకు 18 వేల రూ॥ కనీస వేతనాన్ని పే కమీషన్లు ప్రకటించినప్పటికీ -కార్మికుల వేతనాల్ని నిర్ణయించడానికి ప్రాతిపదిక వారి కనీస అవసరాల (తిండి, బట్టలు, వసతి తదితర కనీస కుటుంబ ఖర్చులు)ను లెక్కించి పరిగణించాలన్న సూత్రం వున్నప్పటికీ-వాటినన్నిటిని పక్కన పెట్టి 'ఒకే దేశం-ఒకే వేతనం' పేరిట అతి కనిష్టంగా రోజుకు రు.178 కనీస వేతనాన్ని ప్రకటించింది. రోజుకు కుటుంబ కనీస ఖర్చు రు.600గా లెక్కించగా అందులో 1/3 వ వంతు కూడ ఇవ్వ నిరాకరిస్తున్నారు. కంపెనీలు తమ డైరెక్టర్లకి సగటున సంవత్సరానికి కోటి రూపాయలు చెల్లిస్తూ-కార్మికుల వేతనాల వాటాను మాత్రం అతి కనిష్టంగా దిగకోస్తున్నారు. మారుతి సుజుకి కంపెనీ ఖర్చుల్లో కార్మికుల వేతనం వాటా 4.2 శాతం కాగా, బ్రిటానియా బిస్కట్ కంపెనీ చెల్లిస్తున్నది 4.7 శాతం మాత్రమే. రిలయన్స్, ఎయిర్‌టెల్ వంటి సెల్‌ఫోన్ కంపెనీలు చెల్లిస్తున్నది 3 శాతమే. ప్రైవేటు రంగంలోని అత్యధికులు, ప్రభుత్వరంగంలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పొందుతున్నది సుమారుగా నెలకు రూ.10 వేల లోపే.

మోడీ తన ప్రసంగాల్లో సంపద సృష్టికర్తలు పెట్టుబడిదారులేననీ, అందువల్ల వారికి మద్దతుగా నిలిస్తేనే దేశ సంపద పెరుగుతుందని ప్రబోధిస్తున్నాడు. విదేశీ పెట్టుబడిదారులను సమావేశపరచి మరీ - "మా దేశంలో శ్రమ శక్తి కారుచౌక గనుక మా దేశంలో పెట్టుబడులు పెట్టుకొని లభాలు సంపాదించుకొండి" అని ఆహ్వానించాడు. ఎఫ్.డి.ఐ. అంటే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు. దేశంలోని రక్షణ రంగం, రైల్వేలు, టెలీ కమ్యూనికేషన్లు, విమానయానం, శాటిలైట్లు (అంతరిక్ష రంగం), విద్యుత్తు, పెట్రోలియం, మైనింగు, బొగ్గు తదితర అన్ని రంగాల్లోకి నూటికి నూరు శాతం దీన్ని అనుమతిస్తూ చట్టాలు చేశారు. ఎఫ్.డి.ఐ. అంటే ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అనే పదానికి బదులు ఫస్ట్ డెవలప్ ఇండియా (తొలుత ఇండియాను అభివృద్ధి చేయడం) అని కొత్త వివరణనిస్తున్నాడు మోడీ.

నీతి ఆయోగ్ సంస్థ 74 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల జాబితా తయారుచేసి అందులో కొన్నిటిని పూర్తిగా ప్రైవేటుకు కట్టబెట్టేందుకు (స్ట్రాటజిక్ సేల్), కొన్నిటిలో షేర్లు అమ్మేందుకు (డిస్ ఇన్వెస్ట్‌మెంట్) వర్గీకరించారు. లాభదాయక సంస్థలైన ఒఎన్‌జిసి, గెయిల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, కోల్ ఇండియా, బిహెచ్‌ఇఎల్, ఎన్‌టిపిసి, పవర్ గ్రిడ్ వంటి సంస్థలను అమ్మబూనుకుంది. ప్రభుత్వ రంగంలోని బి ఎస్ ఎన్ ఎల్‌ను ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితికి నెట్టి అంబానీల జియో ఫోన్లను ప్రభుత్వమే ప్రోత్సహించింది. ప్రభుత్వం పని 'వ్యాపారం' కాదని అంటూ-దశాబ్దాల తరబడి కార్మికుల, ఉద్యోగుల శ్రమ శక్తితో పోగు పడిన వేల కోట్ల రూపాయల విలువైన దేశ సంపదలను కారుచౌకగా స్వదేశీ విదేశీ పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారు.

ఉద్యోగాలకల్పన జరగాలంటే విదేశీ పెట్టుబడులు రావాలంటున్నారు. కానీ గత 5 సం॥ల లెక్కలు చూస్తే విదేశీ పెట్టుబడుల్లో వుత్పాదక రంగంలోకి 28 శాతం మాత్రమే రాగా - మిగిలిన 72 శాతం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలోకి, స్టాక్ మార్కెట్, ద్రవ్య సర్వీసులలోకే వచ్చాయి. వీటివల్ల వచ్చిన ఉద్యోగాలు అతి స్వల్పం. నిరుద్యోగం ప్రస్తుతం దేశంలో గత 45 సం॥లుగా ఎపుడూ లేనంతగా పెరిగిందని గణాంకాలు చెపుతున్నాయి. మరోవైపు జి.డి.పి. వృద్ధిరేటు ఎపుడూ లేనంత కనిష్టంగా 5 శాతానికి పడిపోయింది.

(తరువాయి 23వ పేజీలో)

Printed, Published and Owned by P. Jaswantha Rao 32-13-26/1,
B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor : P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M250
పుస్తకం పేరు	జనశక్తి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	25
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Priyanka
పేజీలు విడదీసినది	Priyanka
స్కాన్ చేసినది	NAVYA
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good